అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

శనివారం 5-10-2019

సమగ్ర తెలుగు దినపత్రిక




సంపుటి : 5 | సంచిక : 279 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

# బస్సులు బంద్

## ఆర్టీసీ కార్మికుల్ని సమ్మెలోకి నెట్టిన ప్రభుత్వం

విధుల్లో చేరకుంటే..

### ఉద్యోగం వదులుకున్నట్టే

సాయంత్రం 6గంటల వరకు డెడ్‌లైన్

- కార్మిక సంఘాలతో ఇక చర్చలుండవ్
- చెప్పినట్టు వినాల్సిందే
- ఐఏఎస్ అధికారుల కమిటీ కూడా రద్దు
- సీఎం కేసీఆర్ హుకుం

వివరాలు 9లో


జేబీఎస్ బస్టాండ్‌లో ప్రయాణికుల ఇక్కట్లు

ఐఏఎస్‌లతో చర్చలు విఫలం

- చేతులెత్తేసిన కార్మికశాఖ
- సమ్మెచేస్తే ఎస్మా ప్రయోగిస్తాం : సర్కార్
- మీ బెదిరింపులకు లొంగం : టీఎస్‌ఆర్టీసీ జేఏసీ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ బస్సు చక్రం ఆగిపోయింది. అనివార్యంగా టీఎస్‌ఆర్టీసీ కార్మికులు సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితుల్ని ప్రభుత్వం కల్పించింది. నెలరోజుల ముందే ఆర్టీసీలోని అన్ని కార్మికసంఘాలు సమ్మె నోటీసులు ఇస్తే...ఉలుకూపలుకూ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వం సమ్మె తేదీ ప్రకటించాక చివరి మూడు రోజుల్లో ముగ్గురు ఐఏఎస్ అధికారులతో త్రిసభ్య కమిటీని నియమించి, చర్చలు అంటూ కాలహరణాన్ని కానిచ్చేసింది. ఈ కమిటీలోని ఐఏఎస్ అధికారులు ఈ మూడు రోజులు తొలిరోజు చెప్పిన మాటల్నే అటూ ఇటూ వల్లెవేశారు తప్ప, జేఏసీ నేతల ఏ ఒక్క డిమాండ్‌పైనా స్పష్టమైన హామీ ఇవ్వలేదు. మూడు విడతలు, దఫదఫాలుగా ఇరుపక్షాల మధ్య జరిగిన చర్చలు ఓ కొలిక్కి రాలేదు. 'సమస్యలన్నీ పరిష్కరిస్తాం...సమ్మె విరమించండి' అనే ఏకైక పదం తప్ప ఐఏఎస్ కమిటీ సభ్యుల నుంచి మరో మాట రాలేదు. పోనీ..ఎప్పట్లోపు పరిష్కరిస్తారో గడవు పెట్టి, దాన్నే ఓ కాగితం మీద రాసిమ్మని జేఏసీ నేతలు అడిగితే...దానికి కూడా కమిటీ సభ్యులు ససేమిరా అన్నారు. మరోవైపు లేబర్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన చర్చల్లోనూ జేఏసీ నేతలు యాజమాన్య ప్రతినిధిని నిలదీశారు. చివరకు జాయింట్ లేబర్ కమిషనర్ కూడా యాజమాన్యం తీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఇంతకు మించి తాను ఏం చేసేది లేదని తేల్చిచెప్పేశారు. ఐఏఎస్‌ల కమిటీ, లేబర్ కమిషనర్ వద్ద జరిగిన చర్చలు విఫలం కావడంతో 5వ తేదీ తొలి డ్యూటీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు జేఏసీ నేతలు ప్రకటించారు. కార్మికులు, ఉద్యోగులు సమ్మెచేస్తే సర్వీస్ నుంచి డిస్మిస్ చేస్తామని రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి, టీఎస్‌ఆర్టీసీ ఇన్‌ఛార్జీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌శర్మ ఉత్తర్వులు ...9లో

# ఆర్థిక పరిస్థితులు దారుణం

## అలసత్వంలో మోడీ సర్కారు : సీతారాం ఏచూరి విమర్శ



దేశవ్యాప్తంగా ఎన్‌ఆర్‌సీ అమలుకు బీజేపీ కుట్ర

- ఈ చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం
- నిర్బంధం నడుమ కాశ్మీర్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహణేంటీ?
- మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో బీజేపీయేతర పక్షాలతో జట్టు
- ముగిసిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాలు

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలతో దేశ ఆర్థికపరిస్థితులు దారుణంగా తయారయ్యాయని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగిన సీపీఐ(ఎం) పార్టీ కేంద్ర కమిటీ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏచూరి మీడియాతో మాట్లాడారు. కలకత్తా ప్లీనంలో తీర్మానించిన అంశాల అమలుపై ఈ సమావేశాల్లో చర్చ జరిపినట్టు ఆయన తెలిపారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో చాలా కంపెనీలు మూతపడ్డాయని, ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారని తెలిపారు. పరిస్థితులను చక్కదిద్దాల్సిన కేంద్రం.. పెట్టుబడిదారులకు రాయితీలు ఇవ్వడంలో బిజీగా ఉండటం దుర్మార్గమైన చర్య అని వ్యాఖ్యానించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జీడీపీ కనిష్ట స్థాయి 5శాతం నమోదు చేసుకుందని గుర్తు చేశారు. సమస్యను పట్టించుకోకుండా మోడీ ప్రభుత్వం అలసత్వం వహిస్తున్నదని చెప్పారు. ఈ సమస్యలపై పోరాడేందుకు తమ పార్టీ ఈ నెల 10 నుంచి 16 వరకు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు పెంచి, యువతకు ఉపాధి కల్పించాలని ఈ సందర్భంగా ఏచూరి డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకి ఉపాధి కల్పించేంత వరకు కేంద్రమే వారికి నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. అన్ని రంగాల్లోని వారికి కనీసం రూ. 21 వేల వేతనం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ తక్షణమే ఆపాలన్నారు. కోల్, బీఎస్ఎన్ఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, భారత రైల్వేలు, ఎయిర్ ఇండియా వంటి సంస్థల్లో ఎఫ్‌డీఐలను నిలిపివేయాలన్నారు. మహాత్మాగాంధీ నరేగా పనులను దేశవ్యాప్తంగా రెండు వందల రోజులు పెంచాలన్నారు. రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నందున.. రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని సూచించారు. వృద్ధులు, వితంతువులకు పెన్షన్‌ను ...9లో

## కనిపించని సాధారణ పరిస్థితులు

జమ్ముకాశ్మీర్‌పై సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఆందోళన వివరాలు 2లో

నల్లమలకు బాసటగా

## నిలబడదాం

భావజాలాలేవైనా.. కలిసికట్టుగా ముందుకు సాగండి : కె.శివారెడ్డి

- గవర్నర్‌కు మేధావుల సంతకాలతో కూడిన లేఖ విడుదల

వివరాలు 10లో

## మోడీకి లేఖ రాసిన ప్రముఖులపై దేశ ద్రోహం కేసు

వివరాలు 10లో






# 22 అంశాలు.. 50 నిమిషాలు

## వెనుకబడిన జిల్లాల నిధులు విడుదల చేయండి

- ఆదిలాబాద్‌లో సిమెంట్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించండి
- హైకోర్టులో జడ్జీల సంఖ్యను 24 నుంచి 42కు పెంచాలి
- ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి కేసీఆర్ వినతి
- రాష్ట్రానికి చెందిన పలు అంశాలపై చర్చ
- హస్తిన పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సీఎం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన 22 అంశాలపై 50 నిమిషాలపాటు ఆయన ప్రధానితో చర్చించారు. వీటికి సంబంధించిన వినతిపత్రాలను మోడీకి సమర్పించారు. అనంతరం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోనూ ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో రాజీవ్ రహదారి విస్తరణకు వీలుగా కంటోన్మెంట్ భూములను అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ...9లో

## వారిద్దరితో కేసీఆర్ ఏకాంత మంతనాలు

యురేనియం తవ్వకాలపై అసెంబ్లీ తీర్మానాన్ని పక్కన పెట్టేసిన వైనం

- చర్చలేని గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం
- ఎంపీల బృందంతో కలిసి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ

వివరాలు 9లో






# మాకు ఉద్యోగాలివ్వండి

## ఇంకెంత కాలమీ నిరీక్షణ

- కావాలనే టీఎస్‌పీఎస్సీ కాలయాపన
- టీఆర్టీ ఎస్జీటీ అభ్యర్థుల ఆగ్రహం
- వందలాదిగా ప్రగతిభవన్ ముట్టడి, అరెస్టు
- బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో నిరాహార దీక్ష
- బతుకమ్మ ఆటపాటలతో నిరసన




వివరాలు 9లో

లెక్చరర్ల సంఘం నేత

## అక్రమాస్తులు కోట్లలోనే

మధుసూదన్‌రెడ్డి ఆస్తులపై ఏసీబీ దాడులు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

అవినీతి, అక్రమాలకు పాల్పడి కోట్ల రూపాయల ఆస్తులను గడించిన రాష్ట్ర జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి గుట్టును రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు రట్టు చేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ ...9లో

# కనిపించని సాధారణ పరిస్థితులు

## జమ్మూకాశ్మీర్‌పై సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఆందోళన

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెబుతున్న విధంగా జమ్మూ కాశ్మీర్‌లో 'సాధారణ' పరిస్థితులు కనుచూపు మేరలో కనిపించడం లేదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 2, 3, 4 తేదీలలో ఇక్కడ జరిగిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశంలో పలు వర్తమాన అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. జమ్మూ కాశ్మీర్‌లో 'సాధారణ' పరిస్థితులే వున్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా, కనుచూపు మేరలో వాటి జాడ కానరావటం లేదని కేంద్ర కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. కేంద్ర కమిటీ సభ్యుడు మహ్మద్ యూసఫ్ తరిగామి ఇప్పుడు నిర్బంధంలోలేరని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఆయన కేంద్ర కమిటీ సమావేశానికి హాజరయ్యేందుకు అనుమతి మంజూరు చేయలేదని విమర్శించింది. ప్రభుత్వం చెబుతున్న 'సాధారణ పరిస్థితులు' కనుచూపు మేరలో లేవనేందుకు ఈ అంశం నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొంది. కేంద్రం చేస్తున్న ప్రకటనలన్నీ వాస్తవ విరుద్ధమేనని స్పష్టం చేసింది. కమ్యూనికేషన్లపై నిషేధం ఇప్పటికీ కొనసాగుతున్నదని, ప్రజా రవాణా ఇప్పటికీ రోడ్లెక్కలేదని, స్కూళ్లు, ఇతర విద్యా సంస్థలు మూసే వున్నాయని, షాపులు, ఇతర వ్యాపార సంస్థలు కూడా మూతపడే వున్నాయని వివరించింది. దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఈ పరిస్థితులు రాష్ట్ర ప్రజలను దుర్భర పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి స్థితిలో జమ్మూకాశ్మీర్‌లో బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిళ్ల ఎన్నికలను ప్రకటించారనీ, ఇది రాష్ట్రంలో పరిస్థితులు సాధారణంగానే వున్నాయని ప్రపంచాన్ని నమ్మించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నమేనని విమర్శించింది. బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిళ్ల ఎలక్టోరల్ కాలేజిలో దాదాపు 61శాతం పంచ్‌లు, సర్పంచ్‌ల స్థానాలు ఇప్పటికీ ఖాళీగానే వున్నాయని గుర్తు చేసింది. కమ్యూనికేషన్లు, ఉద్యమాలు, పౌరహక్కులపై నిషేధాన్ని తొలగించి వెంటనే పునరుద్ధరించాలని, నిర్బంధంలోవున్న నేతలందరినీ బేషరతుగా విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసింది. రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలను పునరుద్ధరించిన తరువాత మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని, అదే సరైన చర్య అని స్పష్టం చేసింది.



### రూ.21 వేలు కనీస వేతనం



అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు కనీస నెలసరి వేతనం రూ.21 వేలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ, ప్రస్తుత మాంద్యంలో ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయి రోడ్డున పడిన కార్మికులకు నెలసరి జీవన భత్యాన్ని అందించాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిలిపివేయాలని, రక్షణ, బొగ్గు రంగాలలో 100శాతం ఎఫ్‌డీఐలకు జారీ చేసిన అనుమతిని ఉపసంహరించుకోవాలని, బీఎస్ఎన్ఎల్, రైల్వేలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, ఎయిరిండియా వంటి సంస్థలను ప్రయివేటీకరించటాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ఉపాధి హామీ పనులకు నిధుల కేటాయింపును పెంచాలని, గత బకాయిల చెల్లింపునకు ఏర్పాట్లు చేసి కూలీలకు నిర్ణీత కనీస వేతనం అందే విధంగా కనీసం 200 పనిరోజుల పని కల్పించాలని డిమాండ్ చేసింది. అదే విధంగా వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించేందుకు, రైతు ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు రైతులకు ఏకకాల రుణమాఫీ అమలుచేయాలని, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేసింది. వృద్ధాప్య, వితంతు పెన్షన్లను నెలకు రూ.3000కు పెంచాలని డిమాండ్ చేసింది.

### కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు



**భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 2020 అక్టోబర్ 17 నాటికి 100 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంలో పార్టీ వ్యవస్థాపక ఉత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.**

**ఎన్నార్సీ ప్రక్రియ**

జాతీయ పౌరసత్వ జాబితా (ఎన్నార్సీ) ప్రక్రియను తమ రాష్ట్రాల్లో కూడా చేపట్టాలని బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులుచేస్తున్న డిమాండ్‌ను ప్రస్తావించిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ, ఈ ప్రక్రియ అసోం ఒప్పందంలో భాగమని, ఇది కేవలం అసోం రాష్ట్రానికి మాత్రమే పరిమితమని స్పష్టం చేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగుతున్నదని గుర్తుచేసింది. అసోంలో దాదాపు 20 లక్షల మందికి పైగా ప్రజలకు ఈ జాబితాలో స్థానం దక్కటం లేదని వివరించింది. ఇందుకు సంబంధించిన అప్పీళ్లన్నింటిపై ఎటువంటి వివక్షకూ తావులేకుండా న్యాయవ్యవస్థ పరిశీలనతో తుది నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఫారినర్స్ ట్రిబ్యునల్ విదేశీయులుగా ప్రకటించిన వారిని నిర్బంధించేందుకు ఉపయోగిస్తున్న నిర్బంధ కేంద్రాలలో కనీస వసతులు లేవని, అక్కడి పరిస్థితులు దుర్భరంగా వున్నాయని, ఇది ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించటమేనని స్పష్టం చేసింది. ఈ నిర్బంధ కేంద్రాలను వెంటనే మూసివేసి ప్రజల అప్పీళ్లు పరిష్కారమయ్యే వరకూ వారిని యథాతథ స్థితిలో కొనసాగించాలని డిమాండ్ చేసింది. అసోం వెలుపలి ప్రాంతాలలో ఎన్నార్సీ ప్రక్రియ చేపట్టటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పునరుద్ఘాటించింది. జాతీయ జనాభా రిజిస్టర్ తయారీకి ప్రయత్నాలను పునఃప్రారంభించిన ప్రభుత్వం దీనిని అఖిల భారత స్థాయిలో ఎన్నార్సీ ప్రక్రియలో వినియోగిస్తున్నదని వివరించింది. నిర్బంధ కేంద్రాలుగా వినియోగించేందుకు వీలుగా కొన్ని భవనాలను నిర్మించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని రాష్ట్రాలకు సూచించిందని వివరించింది. ఆధార్ కార్డుల ప్రక్రియను దేశమంతా విస్తరించిన నేపథ్యంలో ఈ కసరత్తు అంతా వృథా ప్రయాస అని కేంద్ర కమిటీ అభిప్రాయపడింది. దేశంలో ఓటర్లందరికీ ఓటరు గుర్తింపు కార్డులు, వారి ఫోటోలతో ఓటర్ల జాబితాలు వినియోగంలో వున్నాయని, ఈ జాబితాలను ఏటా సవరిస్తున్నారని గుర్తుచేసింది. ఈ ప్రక్రియలన్నీ కొనసాగుతున్న ప్రస్తుత సమయంలో అసోం వెలుపల ఎన్‌పీఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను చేపట్టటం, ఓటర్ల జాబితా పరిశీలన, పౌరసత్వ చట్ట సవరణకు ఇస్తున్న హామీల వంటి అంశాలు దేశంలో ప్రజల మధ్య మత చిచ్చు పెట్టి, తమ ఓటు బ్యాంకును పదిలం చేసుకునేందుకు ఆరెస్సెస్, బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను సూచిస్తున్నాయని వివరించింది.

### కేరళ విజయం

కేరళ అసెంబ్లీలోని పాల స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డీఎఫ్) అభ్యర్థిని గెలిపించిన ప్రజలకు కేంద్ర కమిటీ అభినందనలు తెలిపింది. ఇది అసాధారణ విజయమని అభివర్ణించిన కేంద్ర కమిటీ యుడీఎఫ్ స్థానాన్ని దక్కించుకోవటం ద్వారా ఎల్‌డిఎఫ్ తన పట్టును మరింత బలోపేతం చేసుకున్నదని అభిప్రాయపడింది.

**ఆర్థిక సంక్షోభం**



నానాటికీ విస్తరిస్తున్న మాంద్య పరిస్థితులు, తీవ్ర స్థాయిలో పెరుగుతున్న నిరుద్యోగిత, ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడుతున్న వేలాది మంది కార్మికులు, కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నదని, ఇది ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. వివాదాస్పదంగా మారిన 2011-12 బేస్ ఇయర్ ఆధారిత జీడీపీ వివరాలను పరిశీలిస్తే గత ఐదు త్రైమాసికాల కాలంలో 2017-18లో 8.1 శాతం నమోదైన జీడీపీ 2019-20 తొలి త్రైమాసికం చివరి నాటికి 5.6 శాతానికి దిగజారిందని వివరించింది. ఇక పారిశ్రామికోత్పత్తుల సూచీ కూడా ఆర్థిక మాంద్యాన్ని నిర్ధారిస్తున్నదని, గత ఏడాది తొలి త్రైమాసిక కాలంలో నమోదైన 5.4శాతం వృద్ధితో పోల్చుకుంటే, 2019-20 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో పారిశ్రామికోత్పత్తి పెరుగుదల కేవలం 2.8 శాతం మాత్రమే నమోదైందని వివరించింది. పెట్టుబడి వస్తువుల ఉత్పత్తి కూడా గత ఏడాది నమోదైన 7.1 శాతం వృద్ధి రేటు నుంచి ఈ ఏడాది 4.1శాతానికి పడిపోయిందనీ, వినిమయ వస్తువుల ఉత్పత్తి కూడా 2.7శాతానికి దిగజారిందని వివరించింది. ఈ ఆర్థిక మాంద్య పరిస్థితులతో దేశంలో నిరుద్యోగిత గతంలో ఎన్నడూ లేని రీతిలో పెరిగిపోయిందని తెలిపింది. అధికారిక లెక్కల ప్రాతిపదికగా సీఎంఐఈ అంచనాల ప్రకారం గత నెల 27 నాటికి దేశంలో నిరుద్యోగిత 9.94 శాతానికి చేరిందని, ఇది గత అర్ధశతాబ్ది కాలంలోనే అత్యధికమని వివరించింది. ఆగస్టు చివరి నాటికి దేశంలో 4.5 కోట్ల మంది నిరుద్యోగులున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయని, గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే ఇది 1.1 కోట్ల మేర ఎక్కువ అని వివరించింది. దేశంలో యువ నిరుద్యోగుల సంఖ్య 28 కోట్ల మేర వున్నట్టు అధికారిక అంచనాలు చెబుతున్నాయని కేంద్ర కమిటీ వెల్లడించింది. ఉపాధి కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులుపెంచాలని, అప్పటివరకూ యువతకు కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందచేయాలని డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల సాధన కోసం వామపక్షాల పిలుపు మేరకు ఈ నెల 10, 16 తేదీల్లో జరిగే జాతీయస్థాయి నిరసన ప్రదర్శనల్లో ప్రజలను భారీయెత్తున సమీకరించాలని అన్ని స్థాయిల్లోని పార్టీ కమిటీలకు కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.

**రాష్ట్ర శాసనసభ ఎన్నికలు**

త్వరలో జరుగనున్న మహారాష్ట్ర, హర్యానా శాసనసభల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలకు సంబంధించిన అంశాలపై చర్చించిన కేంద్రకమిటీ, సీట్ల సర్దుబాటు విషయంలో వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో చర్చలు కొనసాగుతున్నాయని వివరించింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పూర్తి జాబితాను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. బీజేపీ నేతృత్వంలోని మతోన్మాద, ఫాసిస్టు శక్తులను ఓడించి, చట్టసభల్లో వామపక్ష ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేయ టమే లక్ష్యంగా సీపీఐ(ఎం) ఈ ఎన్నికల్లో పోరాడుతున్నదని కేంద్ర కమిటీ వివరించింది.

---



**చంద్రునిచుట్టు తిరుగుతున్న చంద్రయాన్-2 ఆర్బిటర్ తీసిన ఫొటోలను ఇస్రో శుక్రవారం ట్వీట్ చేసింది. చంద్రుని ఉపరితలాన్ని అధ్యయనం చేయడానికి ఈ చిత్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని ఇస్రో పేర్కొంది.**

## ఆడ్రేకు రట్గర్స్ వర్సిటీ మద్దతు

- గతవారం మోడీ, 'హిందూత్వం'పై వ్యాఖ్యలు చేసిన చరిత్రకారిణి

**న్యూఢిల్లీ :** ప్రధాని మోడీ, హిందూత్వంపై వ్యాఖ్యలు చేసి విమర్శలు ఎదుర్కొంటున్న యూఎస్‌కు చెందిన ప్రముఖ చరిత్రకారిణి ఆడ్రే ట్రస్కేకు ఆమె పనిచేస్తున్న రట్గర్స్ వర్సిటీ మద్దతుగా నిలిచింది. గతనెల మోడీ అమెరికా పర్యటన సందర్భంగా న్యూయార్క్‌లోని జనరల్ అసెంబ్లీ ఎదురుగా దక్షిణాసియా, ఉత్తర అమెరికా నిరసనకారులతో కలిసి ఆమె ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారత్‌లో మైనారిటీలు, కాశ్మీరీలకు మద్దతుగా ఆమె నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఆమె మోడీ అనుసరిస్తున్న విధానాలను విమర్శించారు. అంతేగాక హిందూత్వం అనేది నాజీల నుంచి స్ఫూర్తి పొందిందని వ్యాఖ్యానించారు. తొలితరం హిందూత్వ నాయకులు జర్మన్ నియంత హిట్లర్‌ను కీర్తించారనీ, జర్మనీలో యూదులను ఊచకోత కోయడాన్ని వారు స్వాగతించారని ఆమె ఆరోపించారు. భారత్‌లో ముస్లింలపైనా అలాంటి విధానమే పాటించేందుకు వారు ప్రణాళికలు రచించారని విమర్శలు చేశారు. కాశ్మీర్‌లో సమాచార వ్యవస్థను రద్దు చేయడం, నిరవధిక కర్ఫ్యూను విధించడం అక్కడి ప్రజల మానవ హక్కులను కాలరాయడమేనని ఆమె ఆగ్రహం వ్యక్త చేశారు. దీంతో ఆడ్రేకు వ్యతిరేకంగా ఆన్‌లైన్‌లో హిందూత్వవాదులు విమర్శలు చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని రట్గర్స్ వర్సిటీని డిమాండ్ చేశారు. అంతేగాక ఆమె వీసాను నిలిపివేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై రట్గర్స్ స్పందిస్తూ.. ఆమెకు మద్దతుగా నిలుస్తున్నట్టు ప్రకటించింది. సాంస్కృతిక, ఆధునిక భారత చరిత్రకు సంబంధించి ఆమె అర్థవంతమైన చర్చలు చేశారని తెలిపింది. వర్సిటీ తనకు మద్దతుగా నిలవడంపై ఆడ్రే హర్షం వ్యక్తం చేశారు.

## సరైన సాక్ష్యాలు లేకుండానే... విదేశీ పౌరులని ఎలా అంటారు?

- అసోం విదేశీ ట్రిబ్యునళ్లపై గౌహతీ హైకోర్టు ఆగ్రహం

**గువహతీ :** అసోంలో జాతీయ పౌర జాబితా రూపకల్పనలో చోటుచేసుకున్న తప్పులకు అమాయకులు బలవుతున్నారని గౌహతీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బీఎస్ఎఫ్, ఎన్నికల సంఘం అధికారులు సందేహం వ్యక్తం చేసినంత మాత్రాన, ఆ పౌరులను విదేశీ ట్రిబ్యునళ్లు విదేశీయులుగా నిర్ణయించటం సరైంది కాదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశాన్ని సుమోటాగా స్వీకరించి, విదేశీ పౌరులుగా పేర్కొన్నవారి కేసులన్నీ మళ్లీ విచారిస్తామని న్యాయస్థానం శుక్రవారం ప్రకటించింది. విదేశీ ట్రిబ్యునళ్లు జరిపిన విచారణలో ఎన్నో లోపాలున్నాయని న్యాయస్థానం పలు కేసుల్ని ఉదహరించింది. అనేక కేసుల్లో ట్రిబ్యునళ్లు రకరకాల అభిప్రాయాలతో తీర్పు చెప్పినట్టు హైకోర్టు దృష్టికి వచ్చింది. ఉదాహరణకు 32 కేసుల్లో అనేకమందిని విదేశీ పౌరులుగా గుర్తించి, ఆ తర్వాత వారిని భారతీయులుగా విదేశీ ట్రిబ్యునళ్లు గుర్తించాయి. ఇదంతా పరిశీలించాక, అనేక కేసుల్లో ట్రిబ్యునళ్లు వెలువరించిన తీర్పులన్నీ మళ్లీ విచారిస్తామని హైకోర్టు తాజాగా ఆదేశాలు జారీచేసింది.

## నవ్‌లఖాకు స్వల్ప ఊరట

**ఈ నెల 15వరకు అరెస్ట్ చేయరాదన్న సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** భీమా కోరెగావ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పౌర హక్కుల కార్యకర్త నవ్‌లఖాకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఆయనను ఈ నెల 15వరకు అరెస్ట్ చేయకూడదని మహారాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఆ లోపు కేసుకు సంబంధించిన పత్రాలను కోర్టులో సమర్పించాలని వెల్లడించింది. కాగా, భీమా కోరేగావ్‌లో 2017 డిసెంబర్ 31న చెలరేగిన హింస కేసులో ప్రజాకవి వరవర రావు, న్యాయవాది సుధా భరద్వాజ్ సహా నవ్‌లఖాపై పూణె పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని బాంబే హైకోర్టును ఆశ్రయించగా, దానిని కోర్టు తిరస్కరించింది. దీంతో నవ్‌లఖా బాంబే హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఈ కేసును సుప్రీంకోర్టు సెప్టెంబర్ 30నే విచారించాల్సి ఉండగా, ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ సహా వరుసగా ఐదుగురు జడ్జీలు విచారణ నుంచి వైదొలుగుతూ వచ్చారు. ఎట్టకేలకు ఈ కేసును విచారించడానికి జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ దీపక్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ నెల 15న వాదనలు వినడానికి అంగీకరించింది.

## సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు

- చిదంబరం బెయిల్ పిటిషన్‌పై...

**న్యూఢిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరానికి బెయిల్ ఇచ్చే విషయంలో అభిప్రాయం తెలియజేయాలని సీబీఐని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి.చిందబరం బెయిల్ అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో చిదంబరం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ)ను శుక్రవారం దాఖలు చేశారు. దీనిపై స్పందన తెలియచేయాల్సిందిగా జస్టిస్ ఆర్ భానుమతి, హృషికేష్ రాయ్‌లతో కూడిన ధర్మాసనం సీబీఐ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. అనంతరం బెయిల్ పిటిషన్ విచారణను అక్టోబరు 15కు వాయిదావేసింది. చిదంబరం దేశం విడిచి వెళతారన్న, సాక్ష్యాలను తారుమారుచేస్తారన్న అనుమానాలకు తావులేదనిబెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా చిదంబరం తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు తెలిపారు. సరైన ఆధారులు లేకుండా కేవలం అనుమానాల కారణంగా తన క్లయింట్ సాక్షులను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని అనడం, బెయిల్ తిరస్కరించడం సరికాదని సిబల్ వాదించారు. జ్యుడిషియల్ కస్టడీలో వున్న చిదంబరం ప్రస్తుతం తీహార్ జైలులో వున్న విషయం తెలిసిందే. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరంను సీబీఐ ఆగస్టు 21న అరెస్టు చేసింది.

## మహారాష్ట్రలో ముగిసిన నామినేషన్ ప్రక్రియ

- చివరి రోజున దాఖలు చేసిన

**సీఎం, ఎన్సీపీ, శివసేన నాయకులు**

**ముంబయి:** మహారాష్ట్రలో ఈ నెల 21న జరిగే అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ దాఖలుకు, శుక్రవారం ఆఖరిరోజు కావడంతో పలు పార్టీల అభ్యర్థులు తమ తమ నియోజకవర్గాల్లో నామినేషన్ ప్రక్రియను పూర్తిచేసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కాంగ్రెస్ నాయకుడు అజిత్ పవార్, శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండేలు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నాగపూర్ సౌత్ వెస్ట్ నుంచి పోటీ చేస్తున్న ఫడ్నవీస్.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రకాంత్, పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ.. తమ కూటమి భారీ మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బారమతి నుంచి పోటీచేస్తున్న అజిత్ పవార్ కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కోప్రీ పచ్‌పఖడి నుంచి పోటీలో ఉన్న ఏక్‌నాథ్ షిండే కార్యకర్తల ఆధ్వర్యంలో నామినేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.

---

# దేశవ్యాప్తంగా 'నీట్' కుంభకోణం?

## మద్రాస్ హైకోర్టు వ్యాఖ్య

- సమాధానమివ్వాలని కేంద్రానికి నోటీసులు

**చెన్నై:** 'నీట్' పరీక్షలో చోటుచేసుకున్న కుంభకోణం కేవలం తమిళనాడు వరకే పరిమితమయ్యే అవకాశం లేదనీ, ఇది దేశమంతటా విస్తరించి వుండవచ్చునని మద్రాస్ హైకోర్టు అనుమానం వ్యక్తంచేసింది. దీనిపై కేంద్ర ఆరోగ్య, మానవ వనరుల మంత్రిత్వ శాఖలకు నోటీసులు జారీ చేసింది. గత నెలలో నిర్వహించిన నీట్ పరీక్షలో ఓ విద్యార్థికి బదులు మరో వ్యక్తి పరీక్షరాసి, తనకు వచ్చిన మార్కులపై కె.వి.ఉదిత్ సూర్య అనే విద్యార్థి మెడికల్ సీట్ పొందినట్టు ఆరోపణలు రావడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ ఇన్వెస్టిగేషన్ విభాగం ఇప్పటికే నలుగురు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను, ప్రభుత్వాధికారులను, ఈ కేసుతో సంబంధమున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు.. ఈనెల 15లోగా పూర్తి వివరాలను అందజేయాలని సంబంధిత విభాగాన్ని ఆదేశించింది. కాగా, ఈ కుంభకోణంలో పూర్తి నిజాలు బయటకి రావాలంటే ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ డిమాండ్ చేశారు.

**ఎన్జీటీ సిబ్బంది నియామకంపైనా...**

దేశవ్యాప్తంగా ఉన్న 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్'ల (ఎన్జీటీ కోర్టు) కోసం తగిన సంఖ్యలో న్యాయ, పర్యావరణ నిపుణులను నియమించకపోవడంపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీచేసింది. అలాగే ఎన్జీటీ బెంచ్‌లు పూర్తిస్థాయిలో పనిచేయడానికి సభ్యులను నియమించే వరకూ పర్యావరణ సంబంధిత పిటిషన్లను ఆయా రాష్ట్రాల హైకోర్టులు విచారించాలని ఆదేశించింది.

బెంగాల్‌కు చెందిన సుభాష్ దత్తా అనే సామాజిక కార్యకర్త 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్'లను ఏర్పాటు చేసినప్పటికీ, వాటిల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనీ, ఇప్పటివరకూ అనేక రాష్ట్రాల్లో పర్యావరణ సంబంధిత కేసులు అనేకం పెండింగ్‌లో ఉండటానికి ఇదొక కారణం అంటూ ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే ఈ విధంగా సిబ్బందిని నియమించకుండా పరోక్షంగా పర్యావరణ కాలుష్యాన్ని సంబంధిత ప్రభుత్వ శాఖలు ప్రోత్సహిస్తున్నాయంటూ పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం న్యాయమూర్తులు ఎన్.వి.రమణ, సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. దీనిపై ప్రభుత్వం తమ స్పందనను తెలపాలని ఆదేశించింది.

## బెంగాల్ వ్యాప్తంగా మార్క్సిస్టు సాహిత్య అమ్మకాలు

**కోల్‌కతా :** రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అభ్యుదయ, మార్క్సిస్టు సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఐ(ఎం) బెంగాల్ శాఖ నిర్ణయించింది. అందుకోసం వెయ్యికిపైగా అవుట్‌పోస్టులు ఏర్పాటుచేసింది. వీటిల్లో అధికభాగం కోల్‌కతా నగరంలోనే ఉన్నాయి. వీటిల్లోనే ఎన్నార్సీ వాస్తవాలను వివరించే సాహిత్యాన్ని అమ్మాలని నిర్ణయించారు. ఎన్నార్సీ సమస్యతో వేలమంది ప్రజలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. లక్షలమంది ప్రజలు వారి భారతీయ పౌరసత్వాన్ని రుజువు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై బీజేపీ అధ్యక్షులు అమిత్‌షా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు దిలీప్‌ఘోష్ చేసిన ప్రకటనలు ప్రజలను మరింత ఆందోళనలోకి నెడుతున్నాయి. కోల్‌కతాలో 200 స్టాళ్లు ఏర్పాటు చేయగా, మరో 109 స్టాళ్లు మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఏర్పాటుచేశారు. వీటితోపాటు సీపీఐఎంఎల్ లిబరేషన్, ఎస్‌యూసీఐ, ఆర్ఎస్‌పీ, ఫార్వార్డ్‌బ్లాక్, సీపీఐ వంటి ఇతర వామపక్ష పార్టీలు రాష్ట్రంలో అభ్యుదయ సాహిత్య కేంద్రాలను ఏర్పాటుచేశాయి. వామపక్షాలు పుస్తక కేంద్రాలను ఏర్పాటు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తృణమూల్, కాంగ్రెస్, బీజేపీ వంటి పార్టీలు కూడా బుక్‌స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. టీఎంసీ స్టాళ్లన్ని మమతా బెనర్జీ రచనలు, ఆమె గీసిన చిత్రాలతో నిండిపోయాయి. బీజేపీ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జీవితచరిత్రపై ప్రచారం చేస్తోంది.

## చెట్ల కూల్చివేతపై పిటిషన్లను తోసిపుచ్చిన కోర్టు

**ముంబయి :** అయిరే సమీపంలోని మిథి నది ప్రాంతాన్ని రక్షించుకోవాలని నగరమంతటా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో బాంబే హై కోర్టు వేలాది మంది ముంబయి ప్రజలను నిరాశ పరిచింది. ఈ ప్రాంతాన్ని అటవీ ప్రాంతంగా రక్షించడానికి దాఖలు చేసిన అన్ని అభ్యర్థనలను తోసిపుచ్చింది. ఈ ప్రాంతంలోని దాదాపు 2500 చెట్లను కూల్చివేస్తూ బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన "ట్రీ అథార్టీ" ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి, వరదల నుండి కాపాడాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి ప్రదీప్ నందరాజగ్, న్యాయమూర్తి భారతి డాంగ్రేతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఇదే సమయంలో శివసేన కార్పొరేటర్ యశ్వంత్ జాదవ్‌కు. రూ.50 వేలు జరిమానా విధించింది. హై కోర్టును ఆశ్రయించిన ట్రీ అథార్టీ సభ్యులలో ఈయన ఒకరు. పర్యావరణాన్ని కాపాడటం, అభివృద్ధి చెందడం రెండూ తమకు అవసరమేనని ధర్మాసనం పేర్కొంది. రెండింటిని పోల్చి చూడాల్సి ఉంటుందని పేర్కొంది.

---

# అర్ధరాత్రి సోదాలు.. మహిళలపై దాడులు

## రక్షించాల్సిన పోలీసులే హింసిస్తున్నారు

- కాశ్మీర్‌లోని రెయినావారీలో భద్రతా సిబ్బంది తీరు
- స్థానికుల ఆగ్రహం



**శ్రీనగర్ :** ఆర్టికల్ 370రద్దుపై కేంద్రం ఏకపక్ష నిర్ణయం అనంతరం కాశ్మీర్ ప్రజలకు రక్షణ కరువైంది. భద్రత కల్పించాల్సిన పోలీసులే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తాగిన మైకంలో అర్ధరాత్రి సమయాల్లో ప్రజల ఇండ్లల్లో సోదాలు నిర్వహిస్తూ.. మహిళలను అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడులకు దిగుతున్నారని రెయినావారీలోని జోగిలాంకర్ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. స్థానిక పోలీసు అధికారి(ఎస్‌హెచ్‌ఓ) రషీద్‌ఖాన్ నేతృత్వంలోని పోలీసు బృందం తమ చర్యలతో ప్రజలను హింసిస్తున్నదని ఆరోపిస్తున్నారు. పోలీసుల తీరుపై అక్కడి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'రషీద్‌ఖాన్ అర్ధరాత్రి సమయాల్లో మా ఇండ్లల్లో సోదాలు నిర్వహించడానికొస్తారు. తాగిన మైకంలో ప్రత్యేకించి మహిళలనే లక్ష్యంగా చేసుకొని దాడికి దిగుతారు. ఇండ్లల్లో సామాన్లను చిందరవందరగా పడేస్తారు' అని బాధితురాలు ఒకరు తెలిపారు. ఇదే ప్రాంతంలో తన ఇద్దరు కూతుర్లతో ఒక మహిళ నివసిస్తున్నది. ' వికలాంగురాలైన నా కుమార్తెపై రషీద్ ఖాన్ దాడిచేశారు. మా ఇంటి గేటును కూలదోశారు. బలవంతంగా లోనికి వచ్చి మాపై దూషణలకు దిగుతూ బెదిరించారు' అని ఆ మహిళ తెలిపింది. కాగా, ఈ ప్రాంతంలో భద్రతను మరింత విస్తృతం చేసి చెక్‌పోస్టుల వద్ద వచ్చిపోయే మార్గాల గుండా ఫెన్సింగ్ వైర్లను పోలీసులు ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్రాంతంలో తిరగకుండా మగవారిపై పోలీసులు ఆంక్షలను విధించారు. అయితే మహిళలను మాత్రం ఉద్దేశపూర్వకంగా ఆ ఫెన్సింగ్ వైర్ గుండా వెళ్లాలని పోలీసులు ఆదేశించేవారు. దీంతో ఫెన్సింగ్ వైర్లకు తట్టి మహిళల దుస్తులు చిరిగిపోయేవి. దాంతో పోలీసులు, భద్రతాధికారులు వారి అచేతనస్థితిని తమకు అనుకూలంగా మలచుకొని వారిపై అసభ్యంగా ప్రవర్తించేవారని కొందరు మహిళలు ఆరోపించారు. అయితే పోలీసులు తీరును ప్రశ్నించినందుకు తమ ప్రాంత అధ్యక్షుడు నజీర్ అహ్మద్ హకాక్‌ను పోలీసులు నిర్బంధించారని స్థానికులు వాపోయారు.

కొన్నిరోజుల క్రితం ఆస్పత్రికి వెళ్తున్న ఓ గర్భిణీని ఎస్‌హెచ్‌ఓ అడ్డుకున్నారనీ, కావాలంటే ఆమె రోడ్డుపైనే ప్రసవించాలనీ, తాను మాత్రం ఆమెను ఆస్పత్రికి అనుమతించే అవకాశమే లేదని ఎస్‌హెచ్‌ఓ నిర్దయగా చెప్పినట్టు స్థానికులు ఆరోపించారు. కాగా, స్థానికుల ఆరోపణలను శ్రీనగర్(నార్త్) ఎస్పీ సాజద్ షా ఖండించారు. ఈ ప్రాంతంలో రాళ్లదాడి చేసేవారిని ఏరిపారేయడానికే పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారనీ ఆయన తెలియజేయడం గమనార్హం.

భద్రతా సిబ్బంది క్యాంప్ ఏర్పాటు చేసుకోవడం కోసం ఇల్లు ఖాళీ చేయాలనీ అలా కాకుంటే ఇంటిలోని మొదటి అంతస్తును కేటాయించాలని ఫయాజ్ అహ్మద్ అనే వ్యక్తిని సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు కొన్ని రోజుల క్రితం బెదిరించారనీ స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించివారినే లక్ష్యంగా చేసుకుంటున్న పోలీసులు అక్కడి అమాయకులను జైళ్లలో నిర్బంధిస్తున్నారని వాపోతున్నారు. ఆర్టికల్ 370 రద్దు జరిగి 50 రోజులు గడిచినప్పటికీ కాశ్మీర్‌లో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో తెలపడానికి ఇది ఒక తార్కాణం. కాశ్మీర్‌లో ఎలాంటి ఆంక్షలు లేవనీ.. త్వరలో అక్కడి పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటాయని కేంద్ర శాఖ మంత్రి అమిత్‌షా ఇటీవల ప్రకటించి విషయం తెలిసిందే. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో లోయలో సాధారణ పరిస్థిలు నెలకొనడం అసాధ్యమని పలువురు రాజకీయ విశ్లేషకులు, పౌరసంఘాల నాయకులు అంటున్నారు.

### మహిళలకు భద్రతా బలగాల నుంచి వేధింపులు

కాశ్మీర్‌లోయలో మోహరించిన భద్రతా బలగాలు తమను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాయనీ అక్కడి మహిళలు ఆరోపిస్తున్నారు. బయటకు వెళ్తున్న తమపై లైంగిక వేధింపులకు దిగడం, తమను ఫోటోలు తీయడం, సూటిపోటి మాటలతో వ్యక్తిగత దూషణలకు దిగడం వంటి అనైతిక చర్యలకు దిగుతున్నాయని లోయలోని పలువురు మహిళలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. భద్రతా దళాల నుంచి బెదిరింపుల నేపథ్యంలో చాలా మంది యువతులు కాశ్మీర్‌ను వీడి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారనీ దక్షిణ కాశ్మీర్‌కు చెందిన జిక్రా అనే ఓ టీనేజర్ తెలిపారు. రోడ్ల మీద వెళ్తున్న సమయంలో సైనికులు ఉద్దేశపూర్వకంగా తమను పేర్లు పెట్టి పిలుస్తున్నారనీ, వారి చర్యలు తమలో భయాందోళనలు కలిగిస్తున్నాయని షోపియాన్‌కు చెందిన ఘజియా అనే మహిళ వాపోయారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సైనికుల దుశ్చర్యలపై అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పోయిందనీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1991లో కాశ్మీర్‌లో ఒక భారీ ఆపరేషన్‌ను జరిపిన సమయంలో అక్కడ 30 మంది మహిళలపై భారత సైనికులు లైంగికదాడి జరిపారనే ఆరోపణలూ ఉన్నాయి.

సంపాదకీయం

# దిద్దుబాటు హర్షణీయం

భారత సర్వోన్నత న్యాయస్థానం ఎట్టకేలకు తన తీర్పును సరిదిద్దింది. దేశంలోని కోట్లాది దళిత, గిరిజనులకు ఆలంబనగా, అండగా ఉన్న ఎస్సీ-ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చుతూ గత ఏడాది తాను వెలువరించిన ఉత్తర్వులను మంగళవారం వెనక్కు తీసుకుంది. ఈ చట్టం కింద ఫిర్యాదు వచ్చినప్పుడు నిందితులను వెంటనే అరెస్టు చేయరాదని, దాఖలైన కేసు ఈ చట్టపరిధిలోనికి వస్తుందా, రాదా అన్నది తొలుత పరిశీలించాలనీ, ప్రాథమిక సాక్ష్యాధారాలు లేని పక్షంలో ముందస్తు బెయిలు ఇవ్వవచ్చనీ గత ఏడాది సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో దేశంలోని దళిత, గిరిజన సమూహం భగ్గుమంది. ఈ ఆదేశాలకు వ్యతిరేకంగా గత ఏడాది ఏప్రిల్ 2న జరిగిన దేశవ్యాప్త బంద్ హింసాత్మకంగా మారి 11మంది మరణించారు. ఆస్తినష్టమూ అపారంగానే జరిగింది. దీంతో ఈ తీర్పును పున:సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం రివ్యూపిటిషన్ దాఖలు చేసింది. పలు సంఘాలు కూడా సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్లను విచారించిన జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ భూషణ్ గవాయ్‌ల నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను వెనక్కు తీసుకుంది.

**అగ్రకుల దురహంకారులు దళిత, గిరిజనుల రక్తం కండ్లజూస్తున్నారు. అత్యాచారాలకు, హత్యాకాండకూ పాల్పడుతున్నారు. ఈ స్థితిలో న్యాయవ్యవస్థపై, మరీ ముఖ్యంగా సర్వోన్నత న్యాయస్థానంపై గొప్ప బాధ్యత ఉంది.**

ఇప్పటికీ దేశంలో అంటరానితనం బలంగా ఉన్నదని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశంలో దళిత, గిరిజనులు ఇప్పటికీ సామాజిక వివక్ష ఎదుర్కొంటున్నారని, సమానత్వం కోసం వారు చేస్తున్న పోరాటం ఇంకా ముగియలేదని స్పష్టం చేసింది. ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు జరపడం పోలీసుల విధి అని పేర్కొంది. అరెస్టుకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని గతంలో ఇచ్చిన ఆదేశాలను వెనక్కు తీసుకుంటూ, ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే ప్రాథమిక విచారణ అవసరమన్న ఆదేశాలను సమీక్షిస్తామని ధర్మాసనం తెలిపింది. ఈ పరిణామం ఎంతైనా హర్షణీయం.



పాలకులు నియంత ధోరణిలో వ్యవహరిస్తూ, ప్రజల్ని ఇబ్బందుల పాల్జేసే చట్టాలను రూపొందిస్తున్నప్పుడు ఆ ప్రజలు అనివార్యంగా కోర్టులనే ఆశ్రయిస్తారు. అలాంటి చట్టాలు ప్రజల మెడలకు చుట్టుకోకుండా వారిని కాపాడాల్సిన బాధ్యతా అధికారం కోర్టులకే ఉంటుంది. అందులో సర్వోన్నత న్యాయస్థానానిది మరింత బాధ్యత, మరింత అధికారం. అందుకే ప్రజలు సుప్రీం కోర్టు వైపు ఆశగా చూస్తారు, దాని గడప తొక్కుతారు. కానీ ఒక్కోసారి అక్కడా న్యాయం జరగని పరిస్థితి. అటవీ హక్కు పత్రాలు తిరస్కరించబడిన ఆదివాసులను వెళ్లగొట్టాలని సుప్రీం కోర్టు ఆదేశించడంతో యూపీఏ హయాంలో వామపక్షాల చొరవతో రూపొందించిన అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చింది. ఈ హక్కు పత్రం ఇచ్చేది ప్రభుత్వం. ఆ ప్రభుత్వానికి అనుకూలంగా లేని, అడుగులకు మడుగులొత్తని, లేదా అధికారులూ నాయకులూ ఆశించినంత లంచం ఇవ్వని, ఇవ్వలేని ఆదివాసులకు వారు హక్కుపత్రాన్ని ఎలా మంజూరు చేస్తారు. ఇందుకు పాలకులను, అధికారులను బాధ్యులను చేయాలి కానీ బాధితులైన ఆదివాసులను అడవితల్లి వొడి నుంచి వెళ్లగొట్టడమేమిటి!? ఈ ఆదేశంపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యింది. ఈ ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఇంకా ఈ తీర్పు పూర్తిగా రద్దు కాకపోవడంతో ఆదివాసీలకు ప్రమాదం పొంచే ఉంది. అటవీహక్కుల చట్టాన్ని సవరించేందుకు మోడీ ప్రభుత్వం పన్నాగాలు పన్నుతున్న నేపథ్యంలో, ఈ ఆదేశాలను కూడా తక్షణం వెనక్కు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దళిత, గిరిజనుల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా ఆచరణలో అవి విఫలమవుతూనే ఉన్నాయి. ఒక ఎన్నికల ఎత్తుగడగా, ఓట్లు రాబట్టుకోవడం కోసం అణగారిన ప్రజలపై ఏ మాత్రం అభిమానం లేకుండా పాలకులు చేస్తున్న చట్టాలు ఆచరణలో వారి కనుసన్నలలోనే నీరుగారుతున్నాయి. దేశ వ్యాప్తంగా దళితులు, గిరిజనులపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని సాక్షాత్తూ జాతీయ క్రైమ్ రికార్డుల బ్యూరోనే చెబుతోంది. ఎస్సీ ఎస్టీ చట్టం కింద వచ్చే ఫిర్యాదులలో 50శాతం వరకూ అసలు న్యాయస్థానం ముందుకే వెళ్లడం లేదని నాలుగేండ్ల క్రితం ప్రముఖ పత్రిక ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ జరిపిన అధ్యయనంలో వెల్లడయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

విద్వేష రాజకీయాలను నడుపుతూ ఉన్న కాషాయ పాలకులకు దళిత, గిరిజనుల మీద ఏమాత్రం ప్రేమ, బాధ్యత లేదన్నది యథార్థం. వారి దృష్టిలో దళిత, గిరిజనులు ఓట్లేసే యంత్రాలే తప్ప మనుషులు కారు. కాబట్టి కాషాయ పాలనలో దళిత, గిరిజనుల తిండిపై, బట్టపై, నడకపై, నడతపై దారుణమైన ఆంక్షలు అమలవతూ ఉన్నాయి. ఆత్మగౌరవం ప్రదర్శించిన చోట, అన్యాయాన్ని ఎదిరించిన చోట పాలకుల అండతో అగ్రకుల దురహంకారులు దళిత, గిరిజనుల రక్తం కండ్లజూస్తున్నారు. అత్యాచారాలకు, హత్యాకాండకూ పాల్పడుతున్నారు. ఈ స్థితిలో న్యాయవ్యవస్థపై, మరీ ముఖ్యంగా సర్వోన్నత న్యాయస్థానంపై గొప్ప బాధ్యత ఉంది. ఆ బాధ్యతను న్యాయవ్యవస్థ, సుప్రీంకోర్టులు నిలుపుకుంటాయని ఆశిద్దాం.

# స్వాతంత్య్రోద్యమంలో పాల్గొనని 'దేశభక్తులు!'



డాక్టర్ దేవరాజు మహారాజు

దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు భగత్‌సింగ్, సచ్చీంద్రనాథ్ సన్యాల్, చంద్రశేఖర ఆజాద్, సుఖ్‌దేవ్ థాపర్‌లు. వీరంతా కలిసి, నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి 1928లో న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లలో ఒక విప్లవ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దాని పేరు హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్ఎస్ఆర్ఏ) దీన్నే హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ-అని కూడా వ్యవహరించేవారు. నాటి యువకులంతా ఎక్కువ సంఖ్యలో ఆకర్షింపబడి ఇందులో భాగస్వాములయ్యేవారు. అలా సభ్యుడయినవాడే కేశవ్

**అబద్ధాల కోరులు, ఆర్థిక నేరగాళ్లు, తీవ్రవాదులు, దేశద్రోహులు అంతా కలిసి తమను తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటూ ఉంటే అసహ్యంగానూ వికారంగానూ ఉంది. పైగా వాళ్ళే దేశభక్తులనేది నిర్ణయించి చెప్పడం వికృతాలలో కెల్లా వికృతం! అసలు వీళ్లు దేశభక్తి అనే పదానికి అర్థమే మార్చేశారు. అందువల్ల ఇలాంటి వారిని అన్ని రకాలుగా ఎదుర్కోవడం, వారి కుట్రలను ఛేధించటం.. ఈ దేశ ప్రజల తక్షణ కర్తవ్యం!**

బలిరామ్ హెడ్గేవర్. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే మనస్తత్వమున్న హెడ్గేవర్ త్వరలోనే తన బుద్ధి బయట పెట్టుకున్నాడు. తన ఉన్న హెచ్ఎస్ఆర్ఏ వివరాలన్నీ రహస్యంగా బ్రిటిష్ అధికారులకు చేరవేయడం ప్రారంభించాడు. ఆరకంగా బ్రిటిష్ గూఢచారిగా మారిపోయాడు. నాటి బ్రిటిష్‌వారి ప్రోద్బలంతో 27 సెప్టెంబర్ 1925న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) స్థాపించాడు. ఇది నాటి బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా పనిచేయడానికి ఏర్పడిన సంఘం. హిందూత్వను బలపరచడం దాని ధ్యేయం. హెచ్చెస్ ఆర్ఏ-కు పూర్తి వ్యతిరేకం! బ్రిటిష్‌కు వ్యతిరేకంగా ఎవరూ ఏ విధమైన ఉద్యమాలు చేయకుండా అరికట్టడం ఆనాటి ఆర్ఎస్ఎస్ విధి. అందువల్ల నాటి స్వాతంత్య్రోద్యమాన్ని దొంగదెబ్బ తీసినవాడు కేశవ్ బలరామ్ హెడ్గేవర్. దొంగే దొంగా.. దొంగా.. అని గగ్గోలు పెట్టినట్టు ఆనాటి నుంచి ఈనాటి వరకు ఇలాంటి దేశద్రోహులే తమని తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటున్నారు. పైగా మిగతా వారెవరూ దేశభక్తులు కారని, అది తమకు మాత్రమే చెందిన పేటెంట్ హక్కయినట్టు వ్యవహరిస్తున్నారు.

9 ఆగస్టు 1925న జరిగిన 'కకోరి రైలు దోపిడీ'కి సంబంధించిన విచారణలో హెడ్గేవర్ బ్రిటిష్ వారికి పూర్తి సహకారం అందించాడు. రామ్‌ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్‌సింగ్, రాజేంద్రనాథ్ లహరి, అశ్ఫఖుల్లా ఖాన్‌లకు 19 డిసెంబర్ 1927న మరణశిక్షలు పడడానికి కారణమయ్యాడు. మరో 16మందికి దీర్ఘకాలిక జైలు శిక్షలు, మరో 40మందికి వివిధ శిక్షలు పడటానికి కారణమయ్యాడు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఈ ఆర్ఎస్ఎస్ దేశభక్తులు నేడు దేశభక్తి మీద భాషణలిస్తున్నారు. హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ప్రకటించిన మ్యానిఫెస్టో 'ద రెవల్యూషనరీ' కకోరి కుట్రకేసులో బ్రిటిష్ వారికి ఒక సాక్ష్యమైంది. మరణశిక్షను అనుభవించిన బిస్మిల్, అశ్ఫఖుల్లాలు విప్లవకవులు. వీరి రచనల్ని భగత్‌సింగ్ అభిమానించేవాడు. స్వాతంత్య్ర సమరంలోకి దూకి తమ ప్రాణాల్ని సైతం అర్పించడానికి సిద్ధపడ్డ భారతీయ యువకుల్ని అదుపు చేయడానికి, వారి ధ్యేయాన్ని, గమ్యాన్ని మార్చడానికి హెడ్గేవర్ అనే ఆ 'దేశభక్తుడు' చాలా శ్రమించాడు. అహింసా సిద్ధాంతంతో బ్రిటిష్ తుపాకి తూటాలకు సైతం భయపడక ఎదురొడ్డి నిలబడ్డ దేశ ప్రజల మనోధైర్యం ముందు హెడ్గేవర్ ఆర్ఎస్ఎస్ కుట్రలు పనికిరాలేదు. స్వాతంత్య్రం ప్రకటింపబడింది. మూడు రంగుల జెండాను జాతీయ పతాకంగా స్వీకరించడం జరిగింది. విధిలేక మొదటి సంవత్సరం జాతీయ జెండాను ఎగరేసిన ఆర్ఎస్ఎస్ చీఫ్ హెడ్గేవర్, మరుసటి సంవత్సరం నుంచి దాన్ని పూర్తిగా వ్యతిరేకించడం ప్రారంభించాడు. ఆర్ఎస్ఎస్ అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' 14 ఆగస్టు 1947 సంచికలో ఈ విధంగా ప్రకటించుకున్నారు.

"ఏదో అదృష్టం కలిసొచ్చి స్వాతంత్య్రం సాధించుకున్న వీరికి మరో ముఖ్యమైన విషయమేదీ కనబడలేదు. ఓ మూడు రంగులజెండాను జాతీయ జెండాగా ఆమోదించుకున్నారు. ఆ జెండాను హిందువులు ఎన్నటికీ గౌరవించరు. మూడు అనే సంఖ్య చాలా అశుభమైంది. జాతీయ పతాకంలో ఉన్న మూడు రంగులు దేశ ప్రజల మానసిక స్థితి మీద తీవ్రమైన వ్యతిరేక ప్రభావం చూపగలదు. ఫలితంగా దేశ భవిష్యత్తు దుర్భరంగా ఉంటుంది" అని! త్రివర్ణ పతాకంతో భారతదేశం ఎప్పుడూ ఎక్కడా కష్టాలు ఎదుర్కోలేదు. స్వతంత్ర దేశంగా గర్వంగానే నిలబడింది. కష్టాలంటే అది ఆర్ఎస్ఎస్ - బీజేపీల అనాలోచిత నిర్ణయాల వల్ల వచ్చినవే. వస్తున్నవే. జాతీయ జెండాపై ఆర్ఎస్ఎస్ అభిప్రాయం ఆ విధంగా ఉంది. కాబట్టే, ప్రధాని మోడీ ఒక యోగాడే సందర్భంగా జాతీయ జెండాతో చెమట తుడుచుకుని దేశాన్ని, దేశ ప్రజల మనోభావాల్నీ అవమానపరిచారు. ఎంతైనా ఆయన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కదా? కేశవ్ బలిరామ్ హెడ్గేవర్ తర్వాత మాధవ్ సదాశివ్ (ఎమ్మెస్) గోల్వాల్కర్ సంఘ్ చాలక్ బాధ్యతలు (1940) తీసుకున్నాడు. ఈయన హెడ్గేవర్ కన్నా మరో అడుగు ముందుకేశాడు. బ్రిటిష్ ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తడంతో పాటు, దేశ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటాడు. దేశంలో అత్యధికులు హిందువులు కాబట్టి, వారిని ఏకం చేయడం కోసం అల్పసంఖ్యాకులు పట్ల ద్వేషభావం వ్యాప్తి చేశాడు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం దేశభక్తి కాదని, హిందూమతాన్ని, సంస్కృతిని పరిరక్షించుకోవడమే దేశభక్తి - అని నూరిపోశాడు. దేశమంతా క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతూ ఉంటే.. అందులో పాల్గొనగూడదని తన సంఘ్ పరివార్ సభ్యులకు గోల్వాల్కర్ పిలుపునిచ్చాడు. అది కొంత వరకు పనిచేసింది. ఫలితంగా 1942లో బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటును అణచివేయడంలో రాష్ట్రీయ స్వయం సేవకులు అందించిన తోడ్పాటు చాలా గొప్పది" అని నాటి బ్రిటిష్ ప్రభుత్వం బొంబాయిలో ఆర్ఎస్ఎస్‌కు ఒక ప్రశంసాపత్రం అందించింది. ఇవి చరిత్రలోని వాస్తవాలు. పుస్తకాలు చదివినా, ఇంటర్నెట్‌లో వెతికినా ఈ విషయాలన్నీ దొరుకుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ఆర్ఎస్ఎస్-బీజేపీ ఆ మూలసూత్రాలతోనే పనిచేయడం మనం చూస్తున్నాం. ఆర్ఎస్ఎస్ చరిత్రను గ్రంథస్థం చేసిన సి.పి. భిషకర్ పుస్తకం చదివినా ఈ విషయాలన్నీ తెలుస్తాయి. అడోల్ఫ్ హిట్లర్, బెనిటో ముస్సోలినీల భావజాలాన్ని సంఘ్ పరివార్ ప్రముఖులు ఇష్టపడే వారని తెలియజేసింది ఆయనే.

గాంధీజీ హత్య నేపథ్యంలో 4 ఫిబ్రవరి 1948న ఆర్ఎస్ఎస్ రెండోసారి నిషేధానికి గురయ్యింది. అప్పుడు 'భారత రాజ్యాంగానికి విధేయులమై ఉంటామనీ, జాతీయ పతాకాన్ని గౌరవిస్తామని, ప్రతిజ్ఞ చేసి, గోల్వాల్కర్ నేతృత్వంలో 11 ఏప్రిల్ 1949న నిషేధాన్ని ఎత్తివేయాల్సిందిగా అభ్యర్థించి ఆర్ఎస్ఎస్ ప్రాధేయపడింది. మూడు నెలల తర్వాత నెహ్రూ ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తేసింది. అయినా కూడా తన ప్రతిజ్ఞకి తానే విలువలేకుండా చేసుకున్న సంఘ్ పరివార్, ఈ రోజుకు కూడా జాతీయ జెండాను గౌరవించదు. రాజ్యాంగానికి



విరుద్ధంగా తీవ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉంది. దేశాన్ని ఆనాడు ముక్కలు చేయడంలో ఆర్ఎస్ఎస్ ముఖ్య భూమికను పోషించింది. విభజన తర్వాత కూడా దేశంలో అశాంతి నెలకొల్పుతూ వస్తోంది. స్వాతంత్య్ర ఉద్యమంలో కలిసి పోరాడిన హిందూ ముస్లింల మధ్య ద్వేషాన్ని రగిలించి మత కలహాల్ని సృష్టించింది. ఇంకా ఆ ప్రయత్నంలోనే ఉంది. స్వాతంత్య్రం సాధించుకుని ఏడు దశాబ్దాలైపోయిన తర్వాత కూడా, ఆరెఎస్ఎస్ అభివృద్ధి నిరోధక శక్తిగా నిలబడింది.

భారత రాజ్యాంగం పట్ల ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి అభిప్రాయం ఉందో చూద్దాం. వారి అధికారిక పత్రిక ఆర్గనైజర్ 30 నవంబర్ 1949 నాటి సంచికలో ఇలా ప్రకటించుకున్నారు.. "భారతదేశానికి కొత్తగా రాజ్యాంగం రాయాల్సిన అవసరమే లేదు. పురాతన కాలంలో మనువురాసిన గొప్పగొప్ప సూత్రాలు మనకు ఉండనే ఉన్నాయి. నేటి రాజ్యాంగంలో వాటి ప్రస్తావన లేకపోవడం విచారించదగ్గ విషయం. ప్రపంచానికి దారి చూపగల 'మనుధర్మశాస్త్రం' ఈ రాజ్యాంగ నిపుణులకు కనీసం గుర్తుకు రాకపోవడం ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం! అని ఆర్ఎస్ఎస్ అంతటితో ఆగలేదు. 6 ఫిబ్రవరి 1950 నాటి సంచికలో 'హృదయాలను పరిపాలించే మనువు' శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించింది. అందులో ఇలా ఉంది.. "ఈ దేశంలో మనువుకు రోజులు చెల్లిపోయాయి.. అని అంబేద్కర్ బొంబాయిలో అన్నట్టు తెలిసింది. కానీ, అది జరగని పని. దాన్ని జరగనివ్వం కూడా! మనువు ప్రతి హిందువైన వాడి మనసులో ఎల్లప్పుడూ ఉంటాడు. మనువు సూత్రాలు జన జీవితంలో కొనసాగుతాయి. శూద్రులు కూడా మనువుని పూజిస్తారు. సమానత్వం గనక ఆచరణలోకి వస్తే, దేశం బలహీన పడుతుంది. వ్యక్తులు దుర్బలులవుతారు." 26 జనవరి 1950న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంలో బాబా సాహెబ్ అంబేద్కర్ "మన రాజ్యాంగం దేశంలో సమానత్వాన్ని సాధిస్తుంది" అని అన్నందుకు ఆర్ఎస్ఎస్ పై విధంగా స్పందించింది. రాజ్యాంగ వ్యతిరేకతను బాహాటంగా ప్రకటించింది. తమకు మనుధర్మ శాస్త్రమే అనుసరణీయమని చెప్పుకుంది. అందుకే చూడండి. బలహీన వర్గాలు ఆర్ఎస్ఎస్ కోసం ఎన్ని త్యాగాలు చేసినా, దాని అధినేతలుగా మాత్రం కేవలం బ్రాహ్మణులే కొనసాగుతూ ఉండటం మనం ఇప్పటికీ చూస్తున్నాం.

స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొనకుండా, పాల్గొనేవారిని అడ్డగించి, ఎంతోమంది దేశభక్తుల మరణానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన ఆర్ఎస్ఎస్ వారు తమకు తాము దేశభక్తులమని చెప్పుకోవడాన్ని దేశ ప్రజల్ని ఒప్పుకుంటారా? వారు చేసే దేశభక్తి ఉద్బోధలు, ఉపన్యాసాలు ఎంత అసంబద్ధమైనవన్నది ఆలోచించకుండా ఉంటారా? గాంధీజీ హంతకుడికీ తమ సంస్థకూ ఎలాంటి సంబంధమూ లేదని ఆనాడు ప్రకటించుకుని, తర్వాత కాలంలో మరి ఎందుకు నాథూరామ్ గాడ్సేను ఆరాధిస్తున్నారూ? ఆర్ఎస్ఎస్‌కు - పాకిస్థాన్ ఐఎస్సైకి సంబంధాలున్నాయన్న వాదన బలంగానే వినిపిస్తోంది. వికీలీక్స్ బయటపెట్టిన స్విస్ బ్యాంక్ ఖాతాల్లో ఎక్కువ శాతం సంఘ్ పరివార్ నాయకులవే ఉన్నాయనీ, అందుకే బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ జాబితా కనబడకుండా మాయం చేసిందనీ ఒక వాదన ఉంది. 'వంద రోజుల్లో నల్లధనం వెనక్కి తెస్తానన్న' దేశ ప్రధాని మోడీ, ఆ పని చేయలేకపోవడానికి కారణం ఇదే అయి ఉంటుందని జనం అనుకుంటున్నారు. ఇవన్నీ చూస్తే దేశంలో ఉగ్రవాదం పెచ్చరిల్లి పోవడానికీ, దేశ ఆర్థిక ప్రగతి నానాటికీ దిగజారుతూ పోవడానికీ, అతి పెద్ద ఆర్థిక నేరగాళ్ల దేశం నుంచి పారిపోవడానికీ కారణం ఆర్ఎస్ఎస్ - బీజేపీలు కలిసికట్టుగా ఆ పనులు చేస్తున్నాయా? అనే అనుమానం ఈ దేశ ప్రజలకు కలుగుతూ ఉంది.

అబద్ధాల కోరులు, ఆర్థిక నేరగాళ్ళ, తీవ్రవాదులు, దేశద్రోహులు అంతా కలిసి తమను తాము దేశభక్తులుగా ప్రకటించుకుంటూ ఉంటే అసహ్యంగానూ వికారంగానూ ఉంది. పైగా వాళ్ళే దేశభక్తులనేది నిర్ణయించి చెప్పడం వికృతాలలో కెల్లా వికృతం! అసలు వీళ్ల దేశభక్తి అనే పదానికి అర్థమే మార్చేశారు. అందువల్ల ఇలాంటి వారిని అన్ని రకాలుగా ఎదుర్కోవడం, వారి కుట్రలను ఛేధించటం.. ఈ దేశ ప్రజల తక్షణ కర్తవ్యం! వారిని సమాయత్తం చేసే బాధ్యత మేధావులది. భిన్నత్వంలో ఏకత్వం సాధించుకున్న దేశం, తన అస్తిత్వాన్ని కోల్పోకముందే మేల్కోవాల్సి ఉంది. దేశ ప్రజలంతా అప్రమత్తతతో ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. భారత్ ఇప్పుడు మతరాజ్యంగా మారిపోవాలా? లేక సర్వహిత, సమభావంతో సమున్నతంగా నిలవాలా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి.

**వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీ వేత్త, బయాలజీ ప్రొఫెసర్.**
devaraju.maharaju@gmail.com

## ఫిక్స్‌డ్ వేతనం సాధనకు
# ఆశాల పోరాటం



పి. జయలక్ష్మి

మన పక్కనే ఉన్న ఏపీ ప్రభుత్వం ఆశాలకు పారితోషికాల పద్ధతి రద్దుచేసి, నెలకు రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించింది. కానీ తెలంగాణ ప్రభుత్వం నేటికీ పారితోషికాలు మాత్రమే చెల్లించటం అన్యాయం.. ఈ పారితోషికాలు కూడా సగానికి తగ్గించి, 5, 6 నెలలకోసారి చెల్లిస్తున్నారు. పైగా పైసలిచ్చేటప్పుడేమో కేసులుంటేనే యిస్తామం టున్నారు. కానీ పని చెప్పేటప్పుడేమో పైసలు లేని, పారితోషికం రాని పనులు చేయిస్తున్నారు. పేరేమో పనిని బట్టి పారితోషికం. కానీ పని మాత్రం ఫిక్స్‌డ్ జీతాలు తీసుకునే కార్మికుల్లాగా ఉదయం నుంచి రాత్రి వరకు రోజుకు 12, 13 గంటలు చేయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వ్యతిరేక విధానాలు మానుకోవాలని, ఆశాల పట్ల ఏపీలో మాదిరిగా తెలంగాణలోనూ రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించా లని రాష్ట్రంలోని ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఆశా వర్కర్లకు నెలకు రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయం చేస్తూ ఆగస్టు 7న జీఓ ఎంఎస్ 87 జారీ చేసింది. షరతుల్లేకుండా ఆశాలందరికీ రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తామని ఆగస్టు 26న ఆశాలు నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వం మరోసారి హామీ ఇచ్చింది. పక్క రాష్ట్రంలో తమ సోదరీమణులు ఫిక్స్‌డ్ వేతనం అందుకుంటున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తూ తెలంగాణలో నేటికీ ఫిక్స్‌డ్ వేతనం లేకపోవటంతో ఆశాలు ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.18,000 ఇవ్వాలని కోరుతూ 2015 సెప్టెంబర్ 2 నుంచి డిసెంబర్ 16 వరకు 106 రోజులు ఆశాలు సమ్మె చేశారు. అనంతరం 18 నెలల తర్వాత 2017 మే 5న ప్రగతిభవన్‌లో ఆశాల సమావేశం ఏర్పాటుచేసి, ఆశాలకు రూ.6,000 ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. ఆ తర్వాత హామీలకు భిన్నంగా కేవలం పారితోషికాలను మాత్రమే పెంచుతూ జీఓ 167 జారీ చేసింది. ఈ పద్ధతిని ఉపసంహరించు కోవాలని, ప్రకటించిన ఫిక్స్‌డ్ వేతనం రూ.6,000 అయినా చెల్లించాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినా స్పందించలేదు. 2018 సెప్టెంబర్‌లో అసెంబ్లీని రద్దుచేసిన రోజు ఆశాలకు మరో రూ.1,500 పారితోషికాలు పెంచుతూ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో ఆశాలకు రూ.7,500 ఇస్తున్నామని ఎంతో ఆర్భాటంగా ఎన్నికల్లో ప్రచారం చేశారు. కానీ ఆ తర్వాత ఆశాల పరిస్థితి అత్యంత దయనీయం. పారితోషికాలు సగానికి సగం తగ్గించి యిస్తున్నారు. ఇవి కూడా 5, 6 నెలలకొకసారి చెల్లించటంతో ఆశాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారు. ఆశాలను వెట్టిచాకిరీకి గురిచేస్తున్న పారితోషికాల పద్ధతిని ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలి. రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం వెంటనే అమలుచేయాలి.

పనిని బట్టి పారితోషికాలు అంటున్న ప్రభుత్వం ఆచరణలో ఇందుకు భిన్నంగా పారితోషికం లేని లెప్రసీ, టీబీ, ఎన్‌సీడీ సర్వేలు, కంటివెలుగు, ఎలక్షన్ డ్యూటీలు తదితర అనేక పనులను ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ చేయిస్తున్నది. రోజూ డ్యూటీలో ఉండాలని ఆదేశాలు జారీచేస్తున్నారు. ఒకవైపు పారితోషికం అంటూ, మరోవైపు జీతం చెల్లించే కార్మికులకు చెప్పినట్టు పని చెప్పడం అత్యంత దుర్మార్గం. ఈ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. పారితోషికం లేని పనులు ఆశాలతో చేయించకూడదు. ఆశాలు ఏమేమి పనులు చేయాలో వెంటనే జాబ్ చార్ట్ ప్రభుత్వం విడుదల చేయాలి.

ఏపీలో రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం ప్రభుత్వం పెట్టిన భిక్ష కాదు. రాష్ట్రం విడిపోయిన నాటి నుంచీ పారితోషికాలు వద్దని, ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని ఏపీలో అనేక పోరాటాలు చేశారు. ఈ పోరాటాల ఫలితంగానే అక్కడి ప్రభుత్వం రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించింది. అయితే ఈ ప్రకటనకే అక్కడి ఆశాలు సంబర పడలేదు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందా? లేదా? అని ఆలోచించారు. ఆశాలు భావించినట్టే ఏపీ ప్రభుత్వం ప్రకటించిన వేతనాన్ని పారితోషికాలకు లింకు పెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా, ఎలాంటి షరతుల్లేకుండా ఫిక్స్‌డ్ వేతనం రూ.10,000 ఆశాలందరికీ చెల్లించాలని వేలాదిమందితో 'చలో విజయవాడ' నిర్వహించారు. ప్రభుత్వం దిగివచ్చి పారితోషికాల పద్ధతిని రద్దుచేసి, ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తానని అంగీకరించింది.

తెలంగాణలోనూ 106 రోజులు సమ్మె చేసినప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి రూ.6,000 ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తామని ప్రకటించీ, దీనికి భిన్నంగా చెల్లించే డబ్బులను మళ్ళీ పారితోషికాలకే ముడిపెట్టారు. ఇప్పటికైనా ఆశాలు మేల్కొనాలి. ఆశాలందరూ పోరాటాలకు సిద్ధం కావాలి.

**సెల్: 9490098605**

# వారసత్వం కోసం ఆరెస్సెస్ వెంపర్లాట



సీతారాం ఏచూరి

(నిన్నటి సంచిక తరువాయి)

స్వాతంత్య్రోద్యమ వారసత్వం కోసం ఆరెస్సెస్ బీజేపీలు వెంపర్లాడుతున్నాయి. అందులో భాగంగా సర్దార్ పటేల్‌కు తామే వారసులమని చెప్పుకునేందుకు చేయని పని లేదు. ముందుకు తేని వాదనలేదు. 1948 ఫిబ్రవరి నాల్గో తేదీన జారీ చేసిన ఆదేశంలో నాటి భారత హోం మంత్రిగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ "ఆరెస్సెస్ యొక్క అభ్యంతరకరమైన, ప్రమాదకరమైన కార్యక్రమాలు నేటికీ విస్తరిస్తూనే ఉన్నాయి. ఆరెస్సెస్ ప్రేరేపిత హింసోన్మాదానికి అనేకమంది బలయ్యారు. అలాంటి ఉన్మాదుల చేతుల్లో బలైన అత్యంత విలువైన వ్యక్తుల్లో గాంధీజీ కూడా ఒకరు." అని హెచ్చరిస్తూ ఆరెస్సెస్‌పై నిషేధం విధించారు.

హోం మంత్రి పటేల్‌కు, నాటి ఆరెస్సెస్ అధినేత గోల్వాల్కర్‌కు మధ్య జరిగిన చర్చలు సంప్రదింపుల్లో ఆరెస్సెస్ అనేక మోసపూరిత వాగ్దానాలు చేసింది. ఈ సంప్రదింపుల గురించి 1948 నవంబరు 14న కేంద్ర ప్రభుత్వం ఓ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ 'ఆరెస్సెస్ నేతలు చేసే వాగ్దానాలకు, వారి శ్రేణులు సాగించే కార్యక్రమాలకు మధ్య పొంతన కుదరటం లేదు" అని హెచ్చరిస్తుంది. ఆరెస్సెస్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసేందుకు పటేల్ తిరస్కరించాడు. మరోసారి కలిసేందుకు అవకాశం ఇవ్వాలన్న గోల్వాల్కర్ విజ్ఞప్తిని సర్దార్ పటేల్ తోసిపుచ్చాడు. అంతేకాదు. తక్షణమే ఢిల్లీ వదిలి నాగపూర్ వెళ్లాల్సిందిగా గోల్వాల్కర్‌ను ఆదేశించాడు. అంతిమంగా ఆరెస్సెస్ కేంద్ర ప్రభుత్వం విధించిన షరతులను అంగీకరించిన తర్వాతనే 1949 జనవరి 11న సంఘ్‌పై విధించిన నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఆరెస్సెస్‌కు రాజకీయాలకు ఎటువంటి సంబంధం ఉండరాదనీ, కేవలం అది ఓ సాంస్కృతిక సంస్థగా మాత్రమే ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వం విధించిన షరతు.

**"ఈ నేపథ్యంలో గాంధీజీని స్మరించుకోవటం అంటే ఆయన ఏ విలువల కోసం జీవితం అంకితం చేశారో ఆ విలువల పరిరక్షణ కోసం మనలను మనం కర్తవ్యబద్ధులను చేసుకోవటమే. ఈ విలువలను సవాలు చేస్తున్న హైందవ జాతీయవాదాన్ని నిలువరించే కర్తవ్యాన్ని స్వీకరించటమే. మహాత్మ గాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా లౌకిక ప్రజాతంత్ర గణతంత్ర భారతదేశాన్ని ఫాసిస్టు బీజేపీ/ఆరెస్సెస్‌లు ధ్వంసం చేయకుండా కాపాడుకోవటానికి కంకణబద్ధులమవుదాం."**

## వైరుధ్యం

ఇప్పుడు మనం మొదలు పెట్టిన చర్చకు తిరిగి వద్దాం. పైన ప్రస్తావించుకున్న వైరుధ్యాన్ని వివరిస్తూ ఇఎంఎస్ నంబూద్రిపాద్ "మితవాదిగా ఉన్న గాంధీ దేశంలో ఓ విప్లవాత్మక ధోరణికి అంకురార్పణ చేశాడని - గ్రామీణ ప్రజలను సైతం ఆధునిక ప్రజాతంత్ర జాతీయోద్యమంలో భాగస్వాములను చేయటం - చెప్పటం పరస్పర వైరుధ్యంతో కూడిన అంశం. ఈ వైరుధ్యం మన జాతీయ రాజకీయ జీవితంలో ఉన్న వైరుధ్యాలకు ప్రతిరూపమే. వ్యక్తీకరణే. భూస్వామ్య వ్యవస్థతో మిలాఖత్ అయిన జాతీయ బూర్జువా వర్గం ఈ దేశంలో ప్రజాతంత్ర జాతీయోద్యమానికి నాయకత్వం వహించటంలోనే ఈ వైరుధ్యం ఇమిడి ఉంది" అంటారు.

వలస వ్యతిరేక పోరాటంలోకి విశాలమైన జనబాహుళ్యాన్ని సమీకరించగల శక్తి మాత్రమే కాదు. వారిలో ఉన్న సమరశీల స్వభావాన్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు అదుపులో ఉంచి, ఆయా దోపిడీ వర్గాల దోపిడీకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసే శక్తి గాంధీజీకి ఉన్నందునే ఓ వైపున పెట్టుబడిదారులు, మరోవైపున భూస్వాములు గాంధీజీ నాయకత్వాన్ని అంగీకరించారు. ఆరాధించారు. ఈ సామర్థ్యాన్ని గాంధీ పదే పదే ప్రదర్శిస్తూ వచ్చారు. అహ్మదాబాద్ బట్టల పరిశ్రమ కార్మికులు సమ్మెకు దిగి మిల్లు యజమానుల ఇండ్ల దగ్గర ఆందోళనకు సిద్ధమయ్యారు. కార్మికులను నిలువరించటానికి గాంధీ నిరాహారదీక్షకు పూనుకున్నారు. చౌరీ చౌరాలో పోలీసు స్టేషన్‌పై రైతాంగం ఆందోళనకు దిగటంతో అది హిమాలయాలంత తీవ్రమైన పొరపాటు అని అలిగి శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపి వేశారు. గతంలో ఏ ఉద్యమం కంటే ఎక్కువగా శాసనోల్లంఘనోద్యమం భారతీయులను కదిలించింది. అటువంటి ఉద్యమాన్ని హఠాత్తుగా నిలిపివేయటాన్ని ప్రశ్నిస్తూ నెహ్రూతో సహా అత్యున్నత స్థాయి కాంగ్రెస్ నాయకులు జైల్లో నుంచే గాంధీజీకి లేఖలు కూడా రాశారు. నిజానికి గాంధీ శాసనోల్లం ఘనోద్యమాన్ని అర్థాంతరంగా నిలిపి వేసిన తర్వాతనే అప్పటివరకు అఖండ ఉద్యమంగా ఉన్న భారత స్వాతంత్య్రోద్యమం అనేక పాయలుగా చీలిపోయింది. భగత్‌సింగ్, ఆయన సహచరులు సోషలిజం, వామపక్ష భావజాలం వైపు ఆకర్షితులయ్యారు. సుందరయ్య, నంబూద్రిపాద్, రామ్మూర్తి, హరికిషన్‌సింగ్ సూర్జిత్ వంటి అనేక మంది స్వాతంత్య్రోద్యమ యోధులు సోషలిస్టు దృక్పథం పట్ల ఆకర్షితులై తర్వాత కాలంలో దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి అద్వితీయ నాయకత్వం అందించారు. ప్రజలను కదన రంగంలోకి నడిపించటం లోనూ, వారి సమరశీల శక్తిని అదుపులో ఉంచటంలోనూ గాంధీజీకి ఉన్న సామర్థ్యం కారణంగానే స్వాతంత్య్రానంతరం ఈ దేశంలో తమ వర్గపాలన సుస్థిరం చేసుకున్న పెట్టుబడిదారులకు ఆయన ప్రియమైన నాయకుడుగా మారాడు. ఒకసారి స్వతంత్ర భారతంలో ఈ పాలక వర్గాల ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకున్నాక బూర్జువా భూస్వామ్య వర్గాలు గాంధీయిజం, ఆయన పద్ధతులు లాభాలు పోగేసుకోవటానికి ఆటంకంగా కనిపించాయి. అందువల్లనే ప్రజల్లో పెరుగుతున్న సమరశీలతను నియంత్రించేందుకు గాంధీజీ పెద్దగా ఉపయోగ పడని వాడిగా మారాడు. అటువంటి కర్తవ్యం నెరవేర్చటానికి ఇప్పుడు వారి చేతుల్లో పోలీసు యంత్రాంగం, సైన్యం సిద్ధంగా ఉంది. చివరి రోజుల్లో సైతం గాంధీజీ తన విలువలకు కట్టుబడి ఉన్నప్పటికీ హిందూ ముస్లిం ఐక్యత వంటి అనేక విలువలను సరికొత్త పాలకులు తిరస్కరించే పరిస్థితి వచ్చిందని నంబూద్రిపాద్ సరిగ్గానే వక్కాణించారు.

1947 ఆగస్టు 15 నెహ్రూతో సహా జాతి యావత్తూ స్వాతంత్య్ర సాధన సంబరాలు చేసుకుంటూ నెహ్రూ ఎర్రకోటపై త్రివర్ణ పతాకం ఎగురవేస్తున్న సమయంలో ఈ ఉత్సవాల్లో గాంధీ మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఆయన ఎక్కడున్నాడు అన్నది ఈ తరానికి తెలియక పోవటం దురదృష్టం. ఆయన ఆ సమయంలో ఎక్కడున్నాడు? నౌఖాలి (ఇప్పుడు బంగ్లాదేశ్)లో ఉన్నాడు. దేశ విభజన సందర్భంగా జరిగిన దారుణ మతకలహాలను నియంత్రించేందుకు ఆయన నౌఖాలి వెళ్లారు. అప్పటికే ఉత్తరభారతదేశంలో మొదలైన మతోన్మాద అగ్ని కీలలు కలకత్తాను కూడా ఆక్రమించాయి. ఈ మతోన్మాద హత్యాకాండను అదుపులోకి తేవటానికి కలకత్తాలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నాడు. ఈ విషయాల గురించి నేటి యువతరం తెలుసుకోక పోవటం దురదృష్టం.

**గాంధీ జయంతి జరపటం అంటే అర్థం ...**

గాంధీజీ నాలుగు విలువల కోసం జీవితం అంకితం చేశాడన్న విషయాన్ని పైన చెప్పుకున్నాం. ఈ విలువలే భారత రాజ్యాంగానికి పునాది విలువలుగా మారాయి. ఈ విలువలపై కొత్త పాలకులు బరితెగించి దాడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాంధీజీని స్మరించుకోవటం అంటే ఆయన ఏ విలువల కోసం జీవితం అంకితం చేశారో ఆ విలువల పరిరక్షణ కోసం మనలను మనం కర్తవ్యబద్ధులను చేసుకోవటమే. ఈ విలువలను సవాలు చేస్తున్న హైందవ జాతీయవాదాన్ని నిలువరించే కర్తవ్యాన్ని స్వీకరించటమే. మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా లౌకిక ప్రజాతంత్ర గణతంత్ర భారతదేశాన్ని ఫాసిస్టు బీజేపీ/ఆరెస్సెస్‌లు ధ్వంసం చేయకుండా కాపాడుకోవటానికి కంకణబద్ధులమవుదాం.

**అనువాదం : కొండూరి వీరయ్య**
**సెల్: 9871794037**

epaper.navatelangana.com

# మానవి
నవతెలంగాణ

5
హైదరాబాద్
శనివారం 5-10-2019
manavi@navatelangana.com




## పూలపండుగ



కరువు తీర వాన చినుకులు కురిసాయి
చెరువులు చెలమలు కళకళలాడాయి
పచ్చని చేలు పలకరించినాయి
చెట్లు చేమలు హరిత హారమైనాయి
పూవులు పుడమిని అలంకరించాయి
తూనీగలు పూవుల జాతర చేశాయి
సింగిడి రంగులు నేలను ఈనాయి
తీరు పూలు బతుకమ్మలో చేరాయి
పసుపు ముద్దల గౌరమ్మగ నిలిపాయి
ఇంతుల గొంతులు పాటలు పాడాయి
వీధులన్ని హరివిల్లుగ విరిసాయి
పల్లెలన్ని బతుకమ్మను కొలిచాయి
తారలు కూడా జాబిలితో బతుకమ్మలాడాయి
దీవెనలిచ్చి బతుకమ్మలు పుట్టిళ్ళను ఒదిలాయి
తీరు తీరుగా తొమ్మిది రోజులు గంగను చేరాయి
పూవుల పండుగతో
తెలంగాణ ప్రత్యేకత చాటాయి

- పాల్వంచ హరికిషన్
9502451780

# చట్టాలు తెలుసుకోవాలి

**అనితకు మూడునెలల నుంచి జీతం లేకపోవడంతో ఇంట్లో ఆర్థికఇబ్బందులు ఎక్కువయ్యాయి. పిల్లల చదువులకు ఆటంకం రావద్దని ఆమె చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమే అవుతున్నాయి. ఈ ప్రపంచంలో ఏ మూలకు వెళ్ళినా, ఏ రంగంలో చూసినా మహిళలకు అన్యాయమే తప్ప న్యాయం జరగడం లేదన్న వాస్తవం ఆమెకు ఆందోళన కలిగిస్తోంది. ప్రతిరోజూ పోరాటమే.. ప్రతి అడుగు ఎదురీతే. పోరాడితే పోయేదేమి లేదు అన్న పెద్దల మాట ఆమెకు స్ఫూర్తి నిచ్చింది. తన సమస్య పరిష్కారం కోసం 'ఐద్వా అదాలత్' కు వచ్చింది.**

అనిత ఇంటర్ చదువుతున్నప్పుడే పెండ్లి అయ్యింది. ఇద్దరు మగపిల్లలు. తాగుడుకు బానిసైన భర్త ఐదేండ్ల కిందట చనిపోయాడు. అమ్మవాళ్లింట్లోనూ పెద్దగా సపోర్ట్ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. అప్పటికీ పెద్దవాడు తొమ్మిదో తరగతి, చిన్నవాడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఇక ఊరిలో బతకడం కష్టమని పిల్లలిద్దరినీ తీసుకుని హైదరాబాద్ వచ్చింది. దూరపు బంధువు ద్వారా ఒక కంపెనీలో ఉద్యోగంలో చేరింది.

### నిజం తెలిసి...

బస్తీలో చిన్న గది అద్దెకు తీసుకుని పిల్లలను బడిలో వేసింది. భర్త చనిపోయినా, వదిలేసినా వచ్చే ఇబ్బందులను ముందుగానే గుర్తించిన అనిత తను వేరే ఊరిలో ఉంటాడని అందరికీ చెప్పేది. ఇంటి చుట్టుపక్కల వాళ్లకు, కంపెనీలో తోటి ఉద్యోగులకు కూడా అలాగే చెప్పింది. కొద్దినెలల తర్వాత సూపర్‌వైజర్ రాఘవతో పరిచయమైంది. అనితకు ఎంతో సహాయంగా ఉండే వాడు. పిల్లల చదువు విషయంలోనూ సూచనలు ఇచ్చే వాడు. పెద్దబాబును కాలేజీలో చేర్చడంలోనూ సహకరించాడు. కొన్ని రోజుల తర్వాత అనిత భర్త చనిపోయాడన్న విషయం అతనికి తెలిసింది. తమ కుటుంబంపై ఆదరణ చూపిస్తున్న అతనిని అన్నలా భావించింది అనిత. కానీ, రాఘవ మాత్రం ఆమెపై ఇష్టం పెంచుకున్నాడు.

### తోడుంటానని..

రాఘవకు పెండ్లి అయ్యింది. భార్యపిల్లలు కూడా ఉన్నారు. అయినా అనితకు భర్త లేడని తెలిసిన తర్వాత అతని మనసులో దుర్బుద్ధి పుట్టింది. 'నీకు తోడుంటాను. పిల్లల బాగోగులు చూసుకుంటాను. నా కోరిక తీర్చు' అంటూ అనితను వేధించడం ప్రారంభించాడు. కంపెనీలో పని సాకుతో మీద చేతులు వేయడం, అసభ్యంగా ప్రవర్తించడం, లైంగికంగా వేధించడం భరించలేకపోయింది. ఎవరికీ చెప్పాలో తెలియక క్షణక్షణం బాధపడింది. వేధింపులకు భయపడి ఉద్యోగం మానేద్దామని అనుకుంది. కానీ, పిల్లల చదువులు మధ్యలో ఆగిపోతాయి అన్న భయం ఆమెను వెంటాడింది. కుటుంబ పరిస్థితి గమనించి ఉద్యోగం వదల లేకపోయింది. కంపెనీలో ఉన్నంత సేపు ముళ్ళమీద ఉన్నట్లుగా ఉండేది. రాఘవను తప్పించుకోవడానికి శతవిధాల ప్రయత్నం చేసేది. ఆమె అశక్తత అతనికి మరింత శక్తినిచ్చింది. దాంతో అసభ్యప్రవర్తనతో ఆమెను అడ్డుకునేవాడు. కోరిక తీర్చమని వేధించడం ఎక్కువైంది.

> 'మీ కంపెనీలో లైంగిక వేధింపుల నివారణ కోసం కమిటీ ఉందా? మహిళలు పనిచేసే ప్రదేశంలో తప్పనిసరిగా కమిటీని ఏర్పాటు చేయాలన్న నిబంధన గురించి మీకు తెలుసా? తప్పు చేసిన రాఘవను ఉద్యోగంలో ఉంచి.. వేధింపులను ఎదిరించిన అనితను ఉద్యోగం నుంచి ఎలా తీసేశారు?'అని అడిగారు.

### ఉద్యోగం పోవడంతో..

తన పరిస్థితి తలచుకుని కుమిలికుమిలి పోతున్న అనితను పెద్దకొడుకు గమనించాడు. ఏం జరిగిందో చెప్పమని తల్లిని అడిగాడు. రాఘవ ప్రవర్తన చెప్పింది. దాంతో పోలీస్‌కంప్లెయింట్ ఇద్దామన్నాడు. వద్దని ఎంత వారించినా వినకుండా వెళ్ళి కంప్లెయింట్ ఇచ్చాడు. పోలీస్‌లు కంపెనీకి ఫోన్ చేయడంతో మేనేజర్‌కు కోపం వచ్చింది. 'మా కంపెనీలో ఇప్పటివరకు పోలీస్ అడుగు పెట్టలేదు. ఇప్పుడు నీ కారణంగా పోలీస్‌లు వస్తున్నారు' అంటూ అనితను ఉద్యోగం నుంచి తీసేసాడు. పోలీస్‌లు అడిగితే రాఘవను కూడా ఉద్యోగం నుంచి తీసేశామని చెప్పారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగ లేక కేసు వాపస్ తీసుకున్నారు. నెల రోజుల తర్వాత రాఘవను తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. అనిత కుటుంబం వీధిన పడింది. వేధింపులను ఎదిరించినందుకు ఉద్యోగం పోవడం ఆమెను బాగా కలచివేసింది. పెద్దకొడుకు చదువు మానేసి ఉద్యోగం చేస్తానన్నాడు. తను చేయనితప్పుకు శిక్ష ఎందుకు భరించాలన్న ఆలోచనతో అనిత ఐద్వా సహాయం కోసం వచ్చింది.

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

### వ్యక్తిగత సమస్యగానే ..

అనిత చెప్పిన విషయాలన్ని విన్న తర్వాత కంపెనీ మేనేజర్‌కు ఫోన్ చేశారు ఐద్వా బాధ్యులు. 'మీ కంపెనీలో లైంగిక వేధింపుల నివారణ కోసం కమిటీ ఉందా? మహిళలు పనిచేసే ప్రదేశంలో తప్పనిసరిగా కమిటీని ఏర్పాటు చేయాలన్న నిబంధన గురించి మీకు తెలుసా? తప్పు చేసిన రాఘవను ఉద్యోగంలో ఉంచి.. వేధింపులను ఎదిరించిన అనితను ఉద్యోగం నుంచి ఎలా తీసేశారు?' అని అడిగారు 'రాఘవ కూడా మా కంపెనీలో లేడు మేడమ్. అతనిని కూడా తీసేశాం. మా కంపెనీలో ఎలాంటి వేధింపులు లేవు. ఇదే మొదటిసారి ఇలాంటి ఆరోపణలు రావడం. అనిత చాలా విషయాలు దాచి మా కంపెనీలో చేరింది. ఆమె కుటుంబ పరిస్థితి మాకు ఎవ్వరికీ తెలియదు. ఇప్పుడు రాఘవ వేధిస్తున్నాడు అంటూ, తన భర్త ఎప్పుడో చనిపోయాడు అన్న విషయం చెప్పింది. ఇది వాళ్ళిద్దరి వ్యక్తిగత సమస్యగానే భావించి ఉద్యోగం నుంచి తీసేశాం. కంపెనీలో ఇలాంటి గొడవలు జరిగితే ఇతర ఉద్యోగు లకు ఇబ్బందిగా ఉంటుంది. అంతకుమించి మేం ఆమె పట్ల ఎలాంటి అన్యాయం చేయలేదు' అన్నాడు మేనేజర్.

### కార్మిక చట్టాల అమలు ..

'కార్మికుల కోసం, ఉద్యోగుల కోసం ప్రభుత్వం చేసిన చట్టాలను అమలు చేయకపోగా లైంగిక వేధింపులను ఎదిరిస్తే ఉద్యోగంలో నుంచి తీసివేయడం మీరు చేసిన పెద్ద తప్పు. అనిత కొన్ని ఏండ్లుగా మీ కంపెనీలో పనిచేస్తుంది. ఆమెకు కార్మికులకు వర్తించే పథకాలు ఏవీ కూడా మీరు వర్తింపచేయలేదు. ఇఎస్ఐ, పిఎఫ్ లాంటివి ఇచ్చి ఉంటే ఆమె భర్త చనిపోయాడన్న విషయం తెలిసేది. కేవలం రోజూ కూలీ మాదిరిగా వాళ్ళతో పనిచేయించుకున్నారు. పైగా మహిళా ఉద్యోగులే ఎక్కువగా ఉన్న చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటుచేయలేదు. అన్యాయాన్ని ప్రశ్నించినందుకు ఆమెను ఉద్యోగం నుంచి తీసివేసి ఆమె కుటుంబాన్ని ఇబ్బందుల పాలు చేశారు. మీరు వెంటనే అనితకు ఉద్యోగం ఇవ్వకపోతే మీ మీద, మీ కంపెనీ మీద చట్టం ప్రకారం ఫిర్యాదు తీసుకోవల్సి వస్తుంది' అన్నారు బాధ్యులు.

> 'అనిత, చదువుకున్నావు. ఉద్యోగంలో నుంచి తీసేశాం అనగానే ఎలా అంగీకరిస్తావు? పనిచేసే చోట ఉద్యోగులకు కొన్ని హక్కులు ఉంటాయి. మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు చట్టం ఉంది. కార్మిక చట్టాలు తెలుసుకోవాలి. ప్రశ్నించడం నేర్చుకోవాలి. నువ్వు రాఘవ వేధింపులను ప్రారంభం లోనే ఎదిరించాల్సింది. ఇన్ని రోజులు బాధపడే అవసరం ఉండేది కాదు. నీ పెద్దకొడుకు చేసింది కరెక్ట్. చట్టాలు ఉన్నది బాధితుల కోసమే అన్నది గుర్తుంచుకో. ధైర్యంగా ఉండు. రెండు రోజుల తర్వాత కంపెనీకి వెళ్ళి మీ మేనేజర్‌ను కలువు. ఉద్యోగం ఇవ్వకపోతే మాకు ఫోన్ చేయి' అన్నారు బాధ్యులు.

### ప్రశ్నించడం నేర్చుకోవాలి..

'లేదు మేడమ్. అనిత సమస్య పూర్తిగా మాకు తెలియదు. వారిద్దరీ గొడవ వల్ల మిగతా ఉద్యోగులకు ఇబ్బంది అని ఉద్యోగం నుంచి తీసేశాం. ఆమె కుటుంబానికి ఈ ఉద్యోగమే ఆధారమని మాకు తెలియదు. మా డైరెక్టర్ సార్‌తో మాట్లాడి తప్పకుండా అనితకు ఉద్యోగం ఇచ్చేలా చూస్తాను' అన్నాడు మేనేజర్.

'అనిత, చదువుకున్నావు. ఉద్యోగంలో నుంచి తీసేశాం అనగానే ఎలా అంగీకరిస్తావు? పనిచేసే చోట ఉద్యోగులకు కొన్ని హక్కులు ఉంటాయి. మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు చట్టం ఉంది. కార్మిక చట్టాలు తెలుసుకోవాలి. ప్రశ్నించడం నేర్చుకోవాలి. నువ్వు రాఘవ వేధింపులను ప్రారంభం లోనే ఎదిరించాల్సింది. ఇన్ని రోజులు బాధపడే అవసరం ఉండేది కాదు. నీ పెద్దకొడుకు చేసింది కరెక్ట్. చట్టాలు ఉన్నది బాధితుల కోసమే అన్నది గుర్తుంచుకో. ధైర్యంగా ఉండు. రెండు రోజుల తర్వాత కంపెనీకి వెళ్ళి మీ మేనేజర్‌ను కలువు. ఉద్యోగం ఇవ్వకపోతే మాకు ఫోన్ చేయి' అన్నారు బాధ్యులు. 'తప్పకుండా మేడమ్. మీ మాటలు ఎంతో ధైర్యానిచ్చాయి. ఇకమీద సమస్యలు వస్తే బాధపడను. ఎదిరిస్తాను' అంది అనిత.

✍ వి.యశోద

---

## సెల్ఫ్ డిఫెన్స్

# ఫోన్‌తో వేధిస్తే..!

**ప్రస్తుతం మనం ఉన్న సమాజంలో మహిళలకు భద్రత కరువైంది. స్కూల్స్, కాలేజీలు, పార్క్‌లు, బస్‌స్టాప్‌లు చివరికి ఇంట్లో కూడా రక్షణ లేకుండా పోయింది. అందుబాటులోకి వచ్చిన మొబైల్ మరిన్ని కొత్త సమస్యలను తీసుకువచ్చింది. ఫోన్‌లలో మహిళల వ్యక్తిగత అంశాలను రికార్డు చేసి వేధించేవారి సంఖ్య పెరిగిపోతుంది. ఎవరైనా ఫోన్‌లో రికార్డు చేస్తున్నారన్న అనుమానం వస్తే వారికి తగిన బుద్ధి చెప్పాలి. పార్క్‌లో వ్యాయామం చేస్తున్న ఒక అమ్మాయిని ఫోన్‌లో రికార్డు చేస్తున్న వ్యక్తి నుంచి ఫోన్ ఎలా తీసుకుని తగిన బుద్ధి చెప్పాలో ఈ వారం తెలుసుకుందాం.**




పార్క్‌లో వ్యాయామం చేస్తున్న అమ్మాయి వెనుక వైపు కూర్చొన్న ఒక వ్యక్తి తన ఫోన్‌తో ఫోటోలు, వీడియో తీసుకున్నాడు. అది గమనించిన ఆ అమ్మాయి అతని వద్దకు వెళ్ళి మర్యాదగా ఫోన్ ఇవ్వమని అడిగింది.




అతను ఫోన్ ఇవ్వడానికి నిరాకరించడంతో రెండుచేతులతో అతని చేతిలోని ఫోన్ లాక్కోంది.




ఒక చేతిలో ఫోన్ పట్టుకుని, రెండో చేతితో అతని జుట్టు పట్టుకొని ముందుకు వంచుతూ ముఖంపై మోకాలిలో బలంగా కిక్ చేసింది. దాంతో అతను నొప్పి భరించలేకు ఫోన్ వదిలేశాడు.
ఫోన్ తీసుకుని అందులో ఉన్న ఫోటోలు, వీడియోలు డిలిట్ చేయాలి. ఒకవేళ డిలిట్ చేయడం సాధ్యం కాకపోతే ఫోన్ పగలగొట్టాలి. పోలీస్‌లకు పట్టించాలి.




సుప్రియ జాడి
జెన్‌షిటోరియా కరాటే
సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనర్
ఫోన్. 9849237307


---

# ఇలా చేస్తేసరి!

**వంటలో అన్నీ సమపాళ్లలో కుదిరితే ఓకే. ఏవైనా తక్కువ పడినా ఫర్వాలేదు. కానీ చిటికెడంత ఉప్పు ఎక్కువైనా.. ఆ పదార్థం వ్యర్థమే అవుతుంది. కాస్త కారం ఎక్కువ పడినా కష్టమే. అందుక అలవాటులో జరిగే పొరపాట్లను ఇలా సరిదిద్దుకుందాం..**



కూరల్లో ఉప్పు ఎక్కువైతే.. ముద్దదిగదు. ఇలాంటప్పుడు గోధుమ పిండి ముద్దను గులాబ్‌జామ్ సైజులో చేసి కూరలో పదిహేను నిమిషాలు ఉంచాలి. ఎక్కువైన ఉప్పునంతా ఆ పిండి ముద్దలాగేసుకుంటుంది. ఉప్పు మరీ ఎక్కువైందను కోండి.. పిండి ముద్ద సైజును, సంఖ్యను పెంచేస్తే చాలు.

ఉడికించిన ఆలుగడ్డ ముక్కలను కూరలో వేసి పదిహేను నిమిషాలు ఉంచితే పెరిగిన లవణ ప్రభావం తగ్గుతుంది.

ఉప్పు కాసింత పెరిగితే.. పెరుగు, పాలు, మీగడ, ఉడికించిన కూరగాయ ముక్కలు వేసి మళ్లీ కాసేపు స్టవ్ మీద ఉంచితే కర్రీ టేస్టీగా మారిపోతుంది. కాస్త శనగపిండి వేసి మళ్లీ పొయ్యి మీద ఉంచినా రుచికరమైన వంటకం తయారైపోతుంది.

సాంబారులో ఉప్పు ఎక్కువైతే కొన్ని బొగ్గులను ఓ బట్టలో కట్టి.. ఓ పదిహేను నిమిషాలు అందులో ఉంచాలి. బొగ్గులు ఉప్పు గాఢతను గ్రహిస్తాయి. కాసేపయ్యాక సాంబార్ రుచి సమపాళ్లకు చేరుకుంటుంది.

వంటలో కాస్తంత కారం పెరిగినా.. అడ్జస్ట్ అవుతాం. కానీ మరీ ఎక్కువైతే కష్టం. ఇలాంటి సందర్భాల్లో ఆ వంటకానికి మరిన్ని కూరగాయ ముక్కలు కలిపి ఉడికిస్తే మంచిది. పాలు, పెరుగు కలిపినా కారం ప్రభావం కాస్త తగ్గుతుంది.

మసాలా వంటకాల్లో కారం పెరిగితే.. అప్పటికప్పుడు పల్లీలు, కాజు, బాదాం, రెండు యాలకులు.. మిక్సీ పట్టి, పేస్ట్‌లా తయారు చేసుకుని కర్రీకి యాడ్ చేయాలి. ఆ తర్వాత పచ్చిదనం పోయేవరకు ఉడికించాలి. దీంతో కారం తగ్గడంతో పాటు మీ వంటకు కొత్త ఫ్లేవర్ జతకలుస్తుంది.

వెనిగర్, నిమ్మరసం కలిపినా.. కారం ప్రభావం కొంత తగ్గుతుంది. ఒక టేబుల్ స్పూన్ చెక్కర కలిపినా.. గుణం కనిపిస్తుంది.

---

# దూరంగా ఉంచుతున్నారా?

పిల్లలు సున్నితమనస్కులే కావచ్చు. అలా అని గగుర్పాటు కలిగించే విషయాలకూ, ప్రమాదాలు జరిగిన ప్రదే శాలకూ దూరంగా ఉంచాలనుకుంటే ఎలా? వాస్తవానికి తొలుత భయం గొలిపే విషయాలే పిల్లల్లో ఆ తర్వాత ధైర్యాన్ని నింపుతాయి. ఆ సంఘటనలు చూసినప్పుడు, అలాంటి ప్రదేశాలకు దగ్గరగా వె ళ్లడం వల్ల పిల్లలు కొంత ఇబ్బంది పడే మాట నిజమే అయినా, ఒకటికి రెండుసార్లు అలాంటి అనుభవాలు ఎదురయ్యాక వారిలో ఆ పరిస్థితుల్ని జీర్ణించుకునే శక్తి పెరుగుతుంది. నిజానికి పుట్టుకతో ఎవరూ ధైర్యవంతులూ కారు, పిరికివారూ కారు. వారి బాల్యంలో జరిగే సంఘటనలు, పరిచయమైన పరిస్థితులే వారిని ఏదో ఒకటి చేస్తాయి. మనసు గందరగోళానికి గురిచేసే ఏ ఒక్క విషయమూ వారి చెవిన పడకుండా, ఏ ప్రమాదమూ వారి కంట పడకుండా దూరంగా ఉంచితే, మున్ముందు వారు పిరికివారయ్యే ప్రమాదం ఉంది. అందుకే అలాంటి సంఘటనలను వారికి అప్పుడప్పుడూ చూపిస్తుం డాలి. అలాంటి ప్రమాదాలు, ఇబ్బందులు ఎదురైనప్పుడు వాటిని అధిగమించే మార్గాల గురించి చెబుతూ ఉండాలి. దీనివల్ల ఆ సంఘటనలకు భయంతో వణికిపోవడం కాకుండా, భవిష్యత్తులో తనకు అలాంటి పరిస్థి తులు ఎదురైతే ఏం చేయాలనే ఆలోచనలు వారిలో మొదలవుతాయి.



---


### మానవి మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు ఇ-మెయిల్ navamaanavi@gmail.com కు తెలియ జేయండి.

మా చిరునామా

మానవి, నవతెలంగాణ దినపత్రిక,
ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, 1-8-664, అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.

## మున్సిపోల్స్‌పై మళ్లీ హడావుడి

- 9న ఎస్ఈసీతో సీడీఎంఏ సమావేశం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని హైకోర్టు అనుమతించిన నేపథ్యంలో మళ్లీ హడావుడి ప్రారంభమైంది. జులై మాసాంతానికి, ఆగస్టు మొదటి వారానికల్లా మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసి కొత్తపాలక వర్గాలను ఏర్పాటు చేయాలని చేపట్టిన ప్రక్రియపై హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. వీటిని విచారణకు స్వీకరించిన హైకోర్టు పలు వాయిదాల్లో వాదనలు విన్నది. వార్డుల పునర్విభజన శాస్త్రీయంగా చేపట్టలేదని పురపాలక శాఖపైన, ఓటర్ల తుది జాబితాలో తప్పులు దొర్లాయనీ, అభ్యంతరాల స్వీకరణకు తగినంత సమయం ఇవ్వలేదనీ, స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరించలేదని ఆరోపిస్తూ పిటిషన్‌దారులు ఆరోపించారు. ఈ కేసులపై వాదనలను వినడం ముగించి హైకోర్టు ఎన్నికల నోటిఫికేషన్ జారీ మినహా మిగిలిన ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపింది. తీర్పును దసరా సెలవుల అనంతరం వెల్లడించేలా వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం అప్రమత్తమైంది. కోర్టు కేసుల నేపథ్యంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఎన్నికల ప్రక్రియపై సమీక్షించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు సీఎండీఏతో పాటు పురపాలక శాఖ అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్, ఇతర అధికారులు సమావేశమై సమాయాత్తంపై చర్చించనున్నారు. సమీక్షించే విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీడీఎంఏ కు లేఖ రాసినట్టు తెలిసింది. సమావేశానికి ముందు చేపట్టాల్సిన చర్యలను కూడా ఎన్నికల సంఘం సీఎండీఏకు ఆ లేఖలో సూచించింది. గతంలో జరిగిన పొరపాట్లు తిరిగి దొర్లకుండా సరి చూసుకోవాలని సూచించింది. వార్డుల పునర్విభజన తదితర విషయాలన్నింటిని నిశితంగా పరిశీలించాలని, ఇలాంటి వాటిపై గతంలో పలువురు అభ్యంతరాలు తెలిపిన నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమయ్యే పుస్తకాల ప్రింటింగ్‌తో ఇతర పనులను కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి కాకుండానే అధికారులు సెలవుల్లోకి వెళ్లారు. దీంతో అనుకున్న మేరకు హైకోర్టు దసరా సెలవులు ముగిసే నాటికి ఏ మేరకు ప్రక్రియను పూర్తి చేయగలుగుతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

## బి.ఆర్.కె.ఆర్ భవన్‌లో ఎస్‌బీఐ సేవలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

బి.ఆర్.కె.భవన్ లో ఎస్ బీఐ సేవలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె.జోషి ప్రారంభించారు. బూర్గుల రామకృష్ణా రావు భవన్‌లోని ఉద్యోగుల సౌకర్యార్థం ఎస్‌బీఐ బ్రాంచిని నేటి నుంచి ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. ఈమేరకు అభినందనలు తెలుపుతూ బ్రాంచిలో సౌకర్యాలు ఉద్యోగుల కు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్ మిశ్రా, అధర్ సిన్హా, చీఫ్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాశ్ మిశ్రా, జనరల్ మేనేజర్ వి. రమేష్ , డీజీఎం రవీంద్ర గౌరవ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (సికిందరాబాద్ బ్రాంచ్) ఎస్. సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యలో ఈ- ఆఫీస్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పాఠశాల విద్యాశాఖలో ఈ ఆఫీసు ప్రవేశపెట్టనున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి బి జనార్ధన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో కోర్టు కేసులు, సర్వీస్ అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఆఫీసు వల్ల ఫైళ్లు ఎక్కడున్నాయో తెలుసుకోవడం సులభమవుతుందని అన్నారు. జాప్యానికి కారణాలు తెలుస్తాయని చెప్పారు. ఫైళ్ల ఆలస్యం చేసే అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల విద్యాశాఖలో అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. కోర్టు కేసులు, సర్వీస్ అంశాలను పరిశీలించాలని కోరారు. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఎక్కడైనా వినియోగించడానికి వీలవుతుందని అన్నారు. ఇలాంటి చర్యల వల్ల ఎక్కువ పర్యవేక్షణ అవుతుందని చెప్పారు. అధికారులు పారదర్శకంగా పనిచేయడానికి అవకాశముంటుందని అన్నారు. విద్యాశాఖలో సుపరిపాలన అందించవచ్చని సూచించారు. కోర్టు కేసులు, సర్వీస్ అంశాలకు సంబంధించి జీహెచ్ఎంసీలో తాను తీసుకున్న చర్యలు గురించి వివరించారు. పరిష్కరించిన అంశాల గురించి చెప్పారు. కోర్టు కేసులు, సర్వీస్ అంశాలపై సీనియర్ న్యాయవాది సురేశ్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ కన్సల్టెంట్ ప్రియదర్శిని, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టి విజయ్‌కుమార్, హైకోర్టులో ప్రభుత్వ ప్లీడర్ పి కార్తిక్ తదితరులు ప్రసంగించారు.

## ఆందోళకరంగా టీబీ కేసులు

- గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో టీబీ కేసులు పెరగడం పట్ల రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్ భవన్ లో శుక్రవారం ది ట్యూబర్క్యులసిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మెన్ డాక్టర్ టి.వి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 70వ టీబీ సీల్ సేల్ క్యాంపెయిన్ ను ఆమె ప్రారంభించి రూ.15 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 ఏడాదికల్లా టీబీ రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం అంకితభావంతో ఉన్నారని తెలిపారు. అప్పటికల్లా తెలంగాణ కూడా టీబీరహిత తెలంగాణగా అవతరించాలని ఆమె ఆకాంక్షించారు. అయితే ఇప్పటికే 61 వేల కేసులున్నాయనీ, అంటే రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు సరాసరిగా 2000 మంది ఉన్నారన్నారు. మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ కేసులు కూడా పెరగడాన్ని తీవ్రంగా పరిగణించాలని చెప్పారు. టీబీ రోగులకు పౌష్టికాహారం కోసం అందిస్తున్న డబ్బులు పౌష్టికాహారానికే కచ్చితంగా పౌష్టికాహారానికే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆమె టీబీ సీల్ సేల్ ను ఎక్కువగా చేసిన రంగారెడ్డికి ప్రథమ ఉత్తమ జిల్లా అవార్డును, సంగారెడ్డికి రెండవ ఉత్తమ జిల్లా అవార్డుతో పాటు వివిధ సంస్థలకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధీర్ ప్రసాద్, గవర్నర్ కార్యదర్శి సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మూర్తులకు బతుకమ్మ ఆదర్శం

- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మహిళా మూర్తులకు బతుకమ్మ ఆదర్శ పండుగని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో టీఎన్జీవో ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు అందరూ ఒకే చోట కలిసి జరుపుకునే పూల పండుగని కొనియాడారు. తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించుకునే గొప్ప పండుగ దేశంలో మరొకటి లేదన్నారు. అందుకే తెలంగాణలోని బతుకమ్మ సాంప్రదాయాలను చూసి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. తెలంగాణ మహిళలకు ఎంతో గౌరకారణమన్నారు. ప్రతి సంవత్సరం టీఎన్జీవో ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటూ, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, మహిళా స్త్రీ శిశు సంక్షేమాధికారి మోతీ, జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి మహిళలున్నారు.

# 3 వేల కోట్లు నిలిపివేత

### సీఎం జగన్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కేంద్రం అనూహ్య నిర్ణయం



**అమరావతి:** పోలవరం ప్రాజెక్టును వివాదాలు వదలడం లేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో మరో అంశం ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టు పనుల కోసం సిద్ధమై, రాష్ట్ర ఖజానాకు చేరడం ఖాయమని భావించిన 3 వేల కోట్ల రూపాయల మొత్తాన్ని కేంద్రం నిలిపివేసింది. రాష్ట్ర ఆర్థికస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో ఈ మొత్తం విడుదలైతే కొంతమేరకైనా ఊరట లభిస్తుందని ఆర్థికశాఖ భావించింది. అనూహ్యంగా దానికి సంబంధించిన ఫైలును ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారైన తరువాత ఈ పరిణామం చోటుచేసుకోవడం అధికారయంత్రాం గాన్ని విస్మయపరిచింది. దీంతో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం ప్రధాని మోడీతో జరగనున్న భేటీలో ఈ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తారని భావిస్తున్నారు. ఆ సమావేశంలో చర్చకు వచ్చినా, రాకపోయినా కేంద్ర ప్రభుత్వానికి ఈ విషయమై పూర్తి వివరాలతో ఒక లేఖ రాయాలని ఆర్థికశాఖ అధికారులు భావిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పర్యవేక్షిస్తున్న పోలవరం అథారిటీకి కేంద్రం నుంచి దాదాపు ఆరు వేల కోట్ల వరకు పాత బకాయిలు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చాలా కాలంగా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూనే ఉంది. ఈ నిధుల్లో దాదాపు మూడు వేల కోట్లను రాష్ట్రానికి ఇచ్చేందుకు కేంద్రం సిద్ధమైనట్టు సమాచారం. దీనికి సంబంధించిన ఫైలు కూడా జలశక్తి శాఖ నుండి కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ ఆమోదానికి వెళ్లినట్టు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో నిధులు విడుదల అవుతాయని భావిస్తుండగా, ఆ ఫైలును ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారైన తరువాత ఈ పరిణామం చోటుచేసుకోడవం విశేషం. రాష్ట్రంలో వివిధ పనులకు సంబంధించిన టెండర్లను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేంద్రానికి ఇష్టం లేదు. ఈ జాబితాలో పోలవరం కూడా ఉంది. దీనికి సంబంధించిన వివాదం న్యాయ స్థానంలో ఉండటంతో నిధులను ఇప్పటికిప్పుడు ఇవ్వాల్సిన అవసరం లేదని భావిస్తున్నట్లు సమాచారం. నవయుగకు కేటాయించిన పోలవరం టెండర్ రద్దు పట్ల ప్రాజెక్టు అథారిటీ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్త ంచేసిన సంగతి తెలిసిందే. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక కూడా నిధులు నిలిపివేతకు కారణమని అంటున్నారు.

# ఎస్ఎఫ్ఐ నేతల దీక్ష భగ్నం

- విశాఖలో విద్యార్థి నాయకులపై విరిగిన లాఠీ
- 14 మంది అరెస్టు
- ఆరుగురికి గాయాలు



ఎస్ఎఫ్ఐ నాయకుడిని అరెస్టు చేస్తున్న పోలీసులు

**విశాఖ:** తాము చదువుకుంటున్న కళాశాల స్థలాలను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు చేపట్టిన 36 గంటల నిరవధిక నిరాహార దీక్షను ప్రభుత్వం భగ్నం చేసింది. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి విద్యార్థులపై పోలీసులను ఉసిగొల్పింది. దీంతో, దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలపై పోలీసులు విరుచుకుపడ్డారు. దీక్షా శిబిరం నుంచి విద్యార్థులను కొట్టుకుంటూ, ఈడ్చుకుంటూ తీసుకెళ్లి జీపుల్లో పడేశారు. అనంతరం స్టేషన్‌కు తరలించి పిడిగుద్దులు గుద్దారు. బూటు కాళ్లతో తన్నారు. విద్యార్థులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వమే ఇలా కర్కశంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖలోని విఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల స్థలాలను పరిరక్షించాలని కోరుతూ ఇప్పటి వరకూ వివిధ రూపాల్లో విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో శుక్రవారం నుంచి దీక్షలు చేపట్టారు. దీక్షా స్థలిలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. శాంతియుతంగా దీక్ష చేస్తున్న విద్యార్థులను కొట్టుకుంటూ తీసుకెళ్లి జీపుల్లో స్టేషన్‌కు తరలించారు. 14 మందిని అరెస్టు చేసి 13 మందిపై కేసులు నమోదు చేశారు. వారిలో నలుగురు విద్యార్థినులు ఉన్నారు. పోలీసుల దాడిలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, కె.ప్రభుదాస్, వెంకటేష్, అజయ్, శ్యామ్, కిషోర్‌లకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా ఎల్‌జె నాయుడు, కృష్ణా కళాశాల కమిటీ కార్యదర్శి కుసుమ మాట్లాడుతూ శాంతియుతంగా దీక్షలో కూర్చున్న తమను జీపులో వేసి తీవ్రంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధులంతా అమ్ముడుపోయారా? అని ప్రశ్నించారు. కళాశాల స్థల రక్షణకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**దాడిని ఖండించిన రాష్ట్ర కమిటీ**

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై లాఠీఛార్జి, అరెస్టుల పట్ల ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, రమేష్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సమస్యను పరిష్కరించాల్సి పోయి, దీక్షలోను భగ్నం చేయడం అమానుషమని పేర్కొన్నారు.

# అసెంబ్లీకి తప్పని వాస్తు తిప్పలు

### దర్వాజాల స్థానంలో కిటికీలు

- బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజులకే మరమ్మతులు
- వాస్తు భయంతో ప్రజాధనం వృథా

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ప్రజలకు ఆదర్శంగానూ, శాస్త్రీయ భావాలకు కేంద్రంగా ఉండాల్సిన అసెంబ్లీకి సైతం వాస్తు తిప్పలు తప్పడం లేదు. వాస్తు బాగలేదనే పేరుతో ఆ గదులకు దర్వాజాల స్థానంలో కిటికీలు, కిటికీల స్థానంలో దర్వాజాలు మార్చుకుంటున్నారు. గతంలో టీడీపీఎల్పీ, బీజేపీఎల్పీ కార్యాలయాలుగా పని చేశాయి. రాష్ట్రంలో టీడీపీ ఉనికి కోల్పోవడం, బీజేపీ ఓడిపోవడంతో ఆ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తే తమకు అదే పరిస్థితి వస్తున్న భయం పట్టుకుంది. తాజాగా ఈ గదులను శాసనమండలి విప్ కర్నె ప్రభాకర్, శాసనసభ విప్ గువ్వల బాలరాజులకు ఈ గదులను కేటాయించారు. వాస్తు భయంతో ఆ గదులకు మరమ్మతులు చేయిస్తూ, ప్రజాధనం వృథా చేస్తున్నారు. ఇటీవల మంచి ముహూర్తం చూసుకుని, ఆ గదులను ఆలకరించి, పూజలు నిర్వహించి ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఇంతలోనే ఏమైందో తెలియదుగానీ ఆ గదులకే మరమ్మతులు చేపడుతున్నారు. దీనిపై అధికారులను సంప్రదించగా వాస్తు బాగోలేదని మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. సొంత ఇంటికి ఎన్నిసార్లయినా మరమ్మతులు చేసుకునే అవకాశం ఉన్నది. కానీ శాస్త్రీయ భావాలను ప్రచారం చేయాల్సిన ప్రజాప్రతినిధులు అశాస్త్రీయ భావాలను వెదజల్లుతున్నారనీ విమర్శలున్నాయి. వాస్తుకు అనుకూలంగా మార్పులు చేసేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. ముఖ్యంగా శాసనమండలి విప్ కర్నె ప్రభాకర్...ఆ ప్రాంగణంలో కార్యాలయం ఏర్పాటు చేసుకునే సంప్రదాయం ఉన్నది. అందుకు భిన్నంగా శాసనసభ ఆవరణలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో శాసనమండలి పక్ష నేత షబ్బీర్ అలీ ఇక్కడ కార్యాలయానికి అనుమతి ఇవ్వాలని కోరితే అసెంబ్లీ సచివాలయం తిరస్కరించినట్టు తెలిసింది. సీఎల్పీ కార్యాలయం వెనక భాగంలో డ్రయినేజీ పొంగిపొర్లుతున్నది. ఆ సమస్యను పరిష్కరించాలని నాలుగైదు సార్లు లేఖ రాసినా పట్టించుకోవడం లేదని ఆవర్గాలు తెలిపాయి.



## విద్యాశాఖ సలహాదారుగా ఆకునూరి మురళి

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**



రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ (మౌలిక సౌకర్యాలు) సలహాదారుగా నియమిస్తూ అక్కడి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేసిన విషయం తెలిసిందే.

## ఆప్షన్లపై జస్టిస్ ధర్మాధికారి ఆక్షేపణ

- నేడు తుది భేటీ

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

తెలంగాణ విద్యుత్ సంస్థల ఉద్యోగుల ఆప్షన్లపై జస్టిస్ ధర్మాధికారి కమిటీ అభ్యంతరం వ్యక్తంచేసినట్టు సమాచారం. ఆప్షన్ల ఎంపికలో కమిటీ గైడ్‌లైన్స్‌ను యాజమాన్యాలు పాటించలేదని ఆక్షేపించినట్టు తెలిసింది. ఆప్షన్ల కోసం కమిటీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యుత్ సంస్థల ప్రతినిధులతో ద్విసభ్య కమిటీలను నియమించింది. తెలంగాణలో ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీ స్థానికత ఆధారంగానే ఆప్షన్లను ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీన్ని జస్టిస్ ధర్మాధికారి తప్పుపట్టినట్టు సమాచారం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీలు భేటీ అయ్యి దీనిపై ఏకాభిప్రాయానికి వస్తే, దాన్ని పరిగణనలోకి తీసుకుంటామని చెప్పినట్టు సమాచారం. సమావేశ ప్రారంభానికి ముందు కమిటీ విద్యుత్ ఉద్యోగ సంఘాల ప్రతినిధుల నుంచి విజ్ఞాపన పత్రాలు స్వీకరించింది. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ శివాజీ, తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ రత్నాకర్ తదితరులు విజ్ఞాపన పత్రాలు అందచేశారు. శనివారం మరోసారి కమిటీ ఇరు రాష్ట్రాల విద్యుత్ ఉన్నతాధికారులతో భేటీ కానుంది. అనంతరం నివేదికను సుప్రీంకోర్టుకు అందచేస్తారని సమాచారం.

## ఆర్టీసీ సమ్మెకు సర్కారుదే బాధ్యత : జీవన్‌రెడ్డి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**



ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీస్ ఇచ్చి 60 రోజులు గడుస్తున్నా...ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. ఆర్టీసీ సమ్మెకు సర్కారే బాధ్యత వహించాలని హెచ్చరించారు. వెంటనే సమ్మె నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరుపుతూనే...మరోవైపు సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికులకు గౌరవాధ్యక్షులుగా ఉండి ఉద్యమాన్ని నడిపించిన హరీశ్‌రావు...ఆర్టీసీ కార్మికులు కష్టాల్లో ఉంటే ఎందుకు నోరు మెదపడటం లేదని ప్రశ్నించారు. ఆర్థిక శాఖ మంత్రిగా కనీసం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సచివాలయ నిర్మించాలనే ఆలోచనను విరమిస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. సచివాలయ నిర్మాణం పట్ల ఉన్న దృష్టి ఆర్టీసీ కార్మికులపై లేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన టీఆర్ఎస్...అధికారంలోకి వచ్చాక దానిని నాశనం చేయడానికి పూనుకుందని విమర్శించారు. ఈ ఐదేండ్ల కాలంలో ఆర్టీసీలో ఉన్న ఖాళీలను నింపలేదన్నారు. ఇప్పటికే ఆరువేల మంది కార్మికులు పదవీవిరమణ పొందారనీ, వారి స్థానంలో నియామకాలు చేపట్టలేదన్నారు. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశ పెడతామంటూ ప్రగాల్భాలు పలికిన కేసీఆర్...ఆ బస్సులతోనే కాలగ డుపుతున్నారని చెప్పారు. ఇప్పటికే అనేక బస్సులు ప్రమాదాలకు గురి అవుతున్నాయని చెప్పారు. ఆర్టీసీ కార్మికులకు అనేక హామీలు ఇచ్చినా ఏ సమస్య పరిష్కరించలేదని విమర్శించారు.

**హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి: జనసేన పార్టీని కోరిన వీహెచ్**

హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని జనసేన పార్టీని మాజీ ఎంపీ వి హనుమంతరావు కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీకి కార్యాలయానికి వెళ్లి నేతలను కలిశారు. పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అందుబాటులో లేరనీ, ఆయనతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## ఇదే చివరి హెచ్చరిక

- రవాణాశాఖ మంత్రి పువ్వాడ

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ఆర్టీసీ కార్మికులకు ఇదే చివరి హెచ్చరిక అని, ప్రభుత్వం మాట వినకుంటే జరిగే నష్టాలకు వారే బాధ్యులు అవుతారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రితో భేటీ అనంతరం రాత్రి 11 గంటలకు ఆయన ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉద్యోగాలకు వచ్చేవారికి పూర్తి రక్షణ కల్పిస్తామని చెప్పారు. శనివారం సాయంత్రం 6 గంటలలోపు విధులకు హాజరైనవారే ఆర్టీసీ ఉద్యోగులుగా ఉంటారని, కానివారు స్వచ్ఛందంగా ఉద్యోగాన్ని వదులుకున్నట్టేనని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మిక సంఘాల విషయంలో సీరియస్‌గా ఉన్నారని, వారి మాటలు విని అమాయక కార్మికులు నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారని చెప్పారు. ఉమ్మడిరాష్ట్రంలోకంటే స్వరాష్ట్రంలోనే ఆర్టీసీకి ఎక్కువ నిధులు ఇచ్చామని తెలిపారు.

## ఆర్టీసీ ఉద్యోగులను మోసం చేసిన కేసీఆర్

- సమ్మెకు మద్దతు తెలిపిన టీయుఎంహెచ్ఈయూ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీతభత్యాలు ఇస్తామన్న హామీ అమలు చేయకుండా సీఎం కేసీఆర్ ఆర్టీసీ ఉద్యోగులను మోసం చేశారని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) విమర్శించింది. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె న్యాయమైనదని యూనియన్ అధ్యక్షులు కె.యాదానాయక్, ఉపాధ్యక్షులు భూపాల్, ప్రధాన కార్యదర్శి కె.బలరాం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రావిర్భావం నుంచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నఉద్యోగుల డిమాండ్‌ను పట్టించుకోడవం లేదని తెలిపారు. 2017 నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయడం లేదని, బకాయిలు చెల్లించకుండా, రియంబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వకుండా, క్రమంగా అద్దె బస్సులు పెంచుతూ ప్రయివేటీకరణ విధానాలు అమలు చేస్తూ ఆర్టీసీని నీరుగార్చే చర్యలు చేపట్టిందని ఆరోపించారు.

# మన యుద్ధ విమానాన్ని కూల్చింది.. మనవాళ్లే

### వైమానికదళం చీఫ్ భదౌరియా

- బాలాకోట్ దాడి వీడియో దృశ్యాలు విడుదల

**న్యూఢిల్లీ :** భారత వైమానిక దళం ప్రయోగించిన క్షిపణి వల్లనే ఎంఐ-27 వీ5 హెలికాప్టర్ కూలిందని వైమానికదళం చీఫ్ మార్షల్ రాకేష్ కుమార్‌సింగ్ భదౌరియా అన్నారు. ఫిబ్రవరి 27న నియంత్రణ రేఖ వద్ద భారత్, పాకిస్తాన్ యుద్ధ విమానాలు కాల్పులకు దిగిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో పాక్ క్షిపణి వల్లే ఈ హెలికాప్టర్ కూలిందని అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘట నలో ఆరుగురు వాయుసేన సిబ్బంది, ఓ పౌరుడు మరణించిన సంగతి తెలిసిందే. ఇది తమ పొరపాటేననీ, దీన్ని తాము అంగీకరించామనీ వైమానికదళం చీఫ్ శుక్రవారం మీడియాముఖంగా స్పష్టం చేశారు. బాలాకోట్ దాడి వీడియో దృశ్యాలను విడుదల చేశారు. మన క్షిపణే యుద్ధ విమానాన్ని ఢీ కొందనీ, ఈ ఘటన కు బాధ్యులైన ఇద్దరు అధికారులపై చర్యలు చేపడతామనీ చెప్పారు. గత వారంలో ఈ ఘటనపై విచారణ జరిగిందనీ, దీనిపై నిర్వహణపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామనీ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని చెప్పారు. ఇటీవల డ్రోన్ల ద్వారా భారత్‌లోకి పాక్ ఆయుధాల్ని చేరవేస్తోందని వస్తున్న వార్తలపై స్పందిస్తూ దీన్ని ఎదుర్కోవడానికి అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు.



# నమ్మకం పోతున్నది

### మోడీ సర్కారుపై తరుగుతున్న విశ్వాసం

- ఆరేండ్ల కనిష్టానికి పడిపోయిన సీసీఐ
- ఆర్బీఐ నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనం, తాజా పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారులు మోడీ సర్కారుపై నమ్మకాన్ని కోల్పోతున్నారు. ప్రస్తుతం పెట్టుకున్న అంచనాలే గాక భవిష్యత్తుపైనా సర్కారుపై వారికి విశ్వాసం సన్నగిల్లుతున్నది. రిజర్వ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకోసారి జరిగే మానిటరీ పాలసీ నివేదికలో ఇది స్పష్టమైంది. వినియోగదారుల విశ్వాస సూచీ (కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్)గా పిలిచే ఈ సూచీ.. గతనెలలో 89.4 గా నమోదైంది. ఇది ఆరేండ్ల కనిష్టానికి చేరడం గమనార్హం. 2013 సెప్టెంబర్ తర్వాత సీసీఐ ఈ స్థాయిలో పతనమవడం ఇదే ప్రథమం. మూడు నెలలకోసారి దేశంలోని ప్రముఖ నగరాల్లో సుమారు 5వేల మంది వినియోగదారులతో ఆర్బీఐ ఈ సర్వేను నిర్వహిస్తున్నది. ప్రధానంగా ఐదు అంశాలు.. ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగిత, ధరల స్థాయి, ఆదాయం, వ్యయం ఆధారంగా ఆర్బీఐ దీనిని చేపట్టింది. ఈ సూచీ 100 కంటే ఎక్కువగా ఉంటే ప్రజలు ఆశావాదంలో ఉన్నారనీ, తక్కువగా ఉంటే నిరాశవాదంలో ఉన్నట్టు లెక్కిస్తారు. సెప్టెంబర్ ముగింపు నాటికి విడుదలైన ఈ సూచీలో సర్కారుపై ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 2013 సెప్టెంబర్‌లో ఈ సూచీ 88 పాయింట్లకు పడిపోయింది. 2014 నుంచి 2016 నవంబర్ దాకా ఈ సూచీ 103 పాయింట్లకు పైగా నమోదైంది. కానీ ఆ నెలలో మోడీ సర్కారు తీసుకున్న పెద్దనోట్ల రద్దు నిర్ణయంతో ఇది 100కు పడిపోయింది.



కాగా, ఈ ఏడాది సాధారణ ఎన్నికలకు ముందు (మార్చి) నాటికి సీసీఐ 104.6కు చేరుకున్నది. కానీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఇది మళ్లీ క్రమంగా పడిపోతున్నది. మే నెలలో 97.3.. జులైలో 95.7 పాయింట్లకు చేరింది. భవిష్యత్ అంచనాలలోనూ ఈ ఏడాది జులైలో 124.8 పాయింట్లున్న సూచీ.. గతనెలలో 118కి చేరడం గమనార్హం. కాగా మోడీ సర్కారు తీసుకుంటున్న ఆర్థిక అనాలోచిత నిర్ణయాలతోనే ప్రజలకు సర్కారుపై నమ్మకం సడలుతున్నదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనం నుంచి గట్టెక్కడానికి కార్పొరేట్లకు తాయిలాలు ప్రకటిస్తున్నదే తప్ప నిధులను ప్రజలకు అందించకపోవడం కూడా దీనికి కారణమని వారు విశ్లేషిస్తున్నారు. ఓవైపు పెట్రో ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలూ కొండెక్కుతుంటే.. వాటిని తగ్గించాల్సిన కేంద్రం కార్పొరేట్ల సేవలో తరిస్తుండంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని వారు ఆరోపిస్తున్నారు.

# వర్ష బీభత్సం

- దేశవ్యాప్తంగా 1900 మంది మృతి : కేంద్ర ప్రభుత్వం వెల్లడి



**న్యూఢిల్లీ:** గతకొంతకాలంగా దేశంలో కురుస్తున్న భారీవర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. జనజీవనం స్తంభించిపోతున్నది. అనేక ప్రాంతాలు నీట మునిగాయి. సుమారు 1900 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల ఇండ్లు నేలమట్టమయ్యాయి. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ముంపు ప్రాంతాలనుంచి చాలా మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సేవలందిస్తున్నాయి. ఎక్కడ చూసినా కన్నీటివ్యధలే దర్శనమిస్తున్నాయి. కేంద్రహోం శాఖ వెల్లడించిన లెక్కల ప్రకారం.. దేశవ్యాప్తంగా 1,874 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 46 మంది నీట మునిగి గల్లంతయ్యారు. వరదల ప్రభావం 22 రాష్ట్రాల్లో సుమారు 25 లక్షల మందిపై ఉన్నట్టు నివేదించింది. మహారాష్ట్రలో అత్యధికంగా 382 మంది మరణించగా, పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాలు, వరదలు కారణంగా 227 మంది ప్రాణాలు కోల్పోయారు. 738 మంది గాయపడినట్టు అధికారులు తెలిపారు. వరదల్లో దాదాపు 20 వేల జంతువులు కొట్టుకుపోయాయి. 1.09లక్షల ఇండ్లు నేలమట్టం కాగా, 2.05 లక్షల ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సుమారు 14.14 లక్షల హెక్టార్ల పంట నష్టం జరిగినట్టు అధికారులు ప్రకటించారు. భారత్‌లో 1994 తర్వాత ఈ ఏడాది సెప్టెంబర్‌లో అత్యధిక వర్షపాతం నమోదైనట్టు భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

# జో బిడెన్‌పై 'దర్యాప్తు ప్రారంభించండి'

## ఉక్రెయిన్, చైనాలకు ట్రంప్ వినతి



**వాషింగ్టన్:** ప్రత్యర్థుల గుట్టును చేజిక్కించుకునేందుకు విదేశీ సాయం తీసుకుంటున్నట్టు వెలువడిన వార్తలపై ఇప్పటి వరకూ పెదవి విప్పని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు బయటపడ్డారు. వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తనకు ప్రత్యర్థిగా బరిలోకి దిగేందుకు ప్రయత్నిస్తున్న మాజీ ఉపాధ్యక్షుడు జో బిడెన్‌పై వెంటనే 'దర్యాప్తు ప్రారంభించాల'ని ఆయన ఉక్రెయిన్, చైనా ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. విదేశీ ప్రభుత్వాలతో సంప్రదించిన అభియోగంపై తనను అభిశంసించేందుకు సిద్ధమవుతున్న డెమొక్రాట్‌లకు అడ్డుకట్ట వేసేందుకే ఆయన ఈ విజ్ఞప్తి చేసినట్టు పరిశీలకులు భావిస్తున్నారు. ఫ్లోరిడాలో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తనను నిందించే వారంతా 'మేనియాక్స్' అని, ప్రతినిధుల సభలో అభిశంసన ఎదుర్కొన్న ఏకైక అధ్యక్షుడిగా తనను నిలిపేందుకే వారు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గతంలో విదేశాంగశాఖ బాధ్యతలను నిర్వర్తించిన బిడెన్ ఉక్రెయిన్ కుంభకోణంలో నిర్వహించిన పాత్ర కాంగ్రెస్ రహస్య భేటీలో నిర్ధారణ కావటంతో ఆయనపై దర్యాప్తు చేయాల్సిందిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్‌లను కోరటం ద్వారా ట్రంప్ తన ప్రయత్నాల జోరును మరింత పెంచారు. గురువారం సాయంత్రం ఆయన వైట్‌హౌస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ బిడెన్‌లపై దర్యాప్తును ముమ్మరం చేయాల్సిందిగా తాను జెలెన్స్కీని కోరుతున్నానన్నారు. అదే విధంగా బిడెన్‌లపై చైనా ప్రభుత్వం కూడా దర్యాప్తు ప్రారంభించాలని తాను కోరుతున్నానని, ఉక్రెయిన్‌లో జరిగిన కుంభకోణమే ఇక్కడ కూడా జరగటమే ఇందుకు కారణమని ఆయన వివరించారు.



2014లో తాను ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉక్రెయిన్‌లో తన కుమారుడు హంటర్ వ్యాపార భాగస్వామి అవినీతిపై జరిగే దర్యాప్తును అడ్డుకున్నట్టు వచ్చిన ఆరోపణలను జో బిడెన్ ఖండించారు. తమ

### బిడెన్ ఖండన

వ్యాపార సంస్థలో పెట్టుబడులను 150 కోట్ల డాలర్ల స్థాయికి పెంచుకునేందుకు చైనా నుంచి పెట్టుబడుల రూపంలో నిధులు సేకరించినట్టు హంటర్ బిడెన్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఈ పెట్టుబడుల రూపంలో హంటర్ లక్షల డాలర్ల మేర అవినీతికి పాల్పడ్డారని ట్రంప్ ఆరోపించారు. చైనాలో కూడా ఒక పెట్టుబడుల లైసెన్స్‌ను సంపాదించిన హంటర్ వ్యాపార భాగస్వామి ఆయన పేరు లేకుండానే లక్షలాది డాలర్ల పెట్టుబడులు సేకరించినట్టు మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

## అఫ్ఘాన్‌లో కరువైన భద్రత

- 82శాతానికి పెరిగిన చిన్నారుల మరణాలు : ఐరాస వెల్లడి



**కాబుల్:** తాలిబన్లకు, భద్రతాబలగాలకు తరచూ జరుగుతున్న అంతర్గత యుద్ధం కారణంగా అఫ్ఘాని స్తాన్‌లో భద్రతా ప్రమాణాలు దారుణంగా పడిపోయాయనీ, ఫలితంగా చిన్నారుల మరణాలు 82 శాతానికి పెరిగాయని 'ఐక్యరాజ్య సమితి' ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస వెల్లడించిన నివేదిక ప్రకారం.. నాలుగేండ్లలో చిన్నారులపై 14 వేలకు పైగా దాడులు జరిగాయి. వారిలో 35,00మంది ప్రాణాలు కోల్పో యారు. 9వేల మంది గాయాలపాలయ్యారు. దీనిని ఐరాస జనరల్ సెక్రెటరీ ఆంటోనియో గుటెరస్ తీవ్రంగా ఖండించారు. 18ఏండ్లుగా తాలిబన్లకు, ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న అంతర్గత యుద్ధంలో అనేక మంది చిన్నారులు బలయ్యారని వెల్లడించారు. తీవ్రమైన ఆందోళనల నేపథ్యంలో 2015–2018లో దాదాపు 12,600 మంది పిల్లలు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. అఫ్ఘాన్ దళాలు, తాలిబన్ల మధ్య జరిగుతన్న దాడిలో డజన్లకొద్ది పౌరులు ఇప్పటికీ మరణిస్తున్నారని తెలిపారు. ఇది గడిచిన నాలుగేండ్లతో పోల్చుకుంటే 82శాతానికి పెరిగిందని పేర్కొ న్నారు. ఈ మరణాల్లో అధికశాతం పేలుడు, వైమానిక దాడుల కారణం గానే జరిగాయాని గుటెరస్ తన నాలుగో నివేదికలో పేర్కొన్నారు. 2015–2018లో వైమానిక దాడుల వల్ల 1,049 మంది చిన్నారులు, 464 మంది యువకులు ప్రాణాలు కోల్పోయినట్టు వెల్లడించారు.

## అధైర్యమొద్దు..త్వరలోనే బదిలీలు : ట్రెసా



**నవతెలంగాణ బ్యూరో**

తహసీల్దార్లు అధైర్యపడొద్దనీ, త్వరలోనే బదిలీల ప్రక్రియ ఉంటుందని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగా రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్ భరోసానిచ్చారు. జ్వాలా గిరిరావు మృతిపైనా, తహసీల్దార్ల ఇబ్బందులపైనా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సోమేశ్ కుమార్‌ను గురువారం కలిసి వారు వివరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ...గిరిరావు మృతిపై సోమేష్ కుమార్ బాధను వ్యక్తం చేశారనీ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారని తెలిపారు. ఎన్నికల బదిలీలు, ఆర్డర్ టూ సర్వ్ బదిలీల విషయంలో చాలా లోతుగా ఆయన చర్చించారనీ, పని ఒత్తిడికి సంబంధించి సెలవులు వాడుకునేందుకు అన్ని జిల్లా కలెక్టర్లతో మాట్లాడుతానని హామీ ఇచ్చారని తెలిపారు. రెవెన్యూ కార్యాలయాల్లో ట్రెసా పిలుపునకు స్పందించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నందుకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు గిరిరావు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. సోమేష్‌కుమార్‌ను కలిసిన వారిలో అధ్యక్షులు అసోసియేట్ అధ్యక్షులు మన్నె ప్రభాకర్, కార్యదర్శి నిరంజన్, కల్చరల్ సెక్రటరీ బి. రవీందర్ కూడా ఉన్నారు.

**బదిలీలపై మనోవేదనలో తహసీల్దార్లు : లచ్చిరెడ్డి**

ఎన్నికలు పూర్తయినప్పటికీ పాత స్థానాలకు తహసీల్దార్లను పంపకపోవడంతో తహసీల్దార్లు తీవ్ర మనోవేదనలో ఉన్నారని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జ్వాలా గిరిరావు అంత్యక్రియలో శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గిరిరావు ఆత్మహత్య రెవెన్యూ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తిని నింపిందన్నారు. ఇప్పటికైనా తహసీల్దార్లను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రాథోడ్, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి ఏవీ భాస్కర్ ఉన్నారు.

## నకిలీ బీమా పత్రాల తయారీ

- ద్విచక్ర వాహనాలకు జారీ
- నిందితుడి అరెస్ట్



**నవతెలంగాణ–సిటీబ్యూరో**

నకిలీ బీమా(ఇన్సూరెన్స్) పత్రాలను తయారు చేసి వాహనాల యజమానులకు అంటగడుతున్న నిందితుడిని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పలు నకిలీ పత్రాలతోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ రాధాకిషన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ సమీద్ స్థానికంగా 'షోహ ఆన్‌లైన్ సెంటర్' పేరుతో జిరాక్స్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇదే క్రమంలో నకిలీ బీమా పత్రాలు తయారు చేయడం నేర్చుకున్నాడు. ఇందులో భాగంగా 'రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్' 'ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్' 'రాయల్ సుందరమ్ జనరల్ ఇన్సూరెన్స్'తోపాటు ఇతర బీమా సంస్థలకు చెందిన నకిలీ రబ్బర్ స్టాంప్‌ను తయారు చేయించాడు. జిరాక్స్ సెంటర్‌కు వచ్చే వారిని మాటల్లో పెట్టి వాహనాలకు నిమిషాల్లో బీమా చేయిస్తానని నమ్మించేవాడు. ఆర్టీఏ, ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులున్నట్టు చెప్పి ఒక్కో వాహనానికి రూ.1000 నుంచి రూ.2వేల వరకు వసూలు చేసేవాడు. లారీలు, ఇతర వాహనాలకు రూ.5వేల నుంచి రూ.25వేల వరకు తీసుకునేవాడు. కంప్యూటర్ సహాయంతో నకిలీ సర్టిఫికెట్ల ప్రింట్ తీసి అందించేవాడు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఏడాది కాలంలో దాదాపు 800 బీమా పత్రాలను మార్కెట్‌లో విక్రయించి లక్షల్లో డబ్బులు సంపాదించాడని డీసీపీ తెలిపారు.

## శాస్త్రీయ విద్యతోనే నూతన సమాజ నిర్మాణం

- విద్యావ్యవస్థలో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న మోడీ సర్కార్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె చంద్రమోహన్



మాట్లాడుతున్న చంద్రమోహన్

**నవతెలంగాణ–సిద్దిపేటటౌన్**

శాస్త్రీయ విద్యావిధానంతోనే నూతన సమాజం నిర్మితమవుతుందని ఎస్ఎఫ్ ఐ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కోయ చంద్రమోహన్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివమ్స్ గార్డెన్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించగా 'విద్యార్థి ఉద్యమ నిర్మాణం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. మోడీ సర్కార్ ఓ వైపు స్వదేశీ నినాద జపం చేస్తూనే విద్యారంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టు బడులకు తివాచీలు పరుస్తోందని విమర్శించారు. విదేశీ యూనివర్సిటీలను ఏర్పా టు చేస్తూ స్వదేశీ విద్యా విధానాన్ని ధ్వంసం చేస్తోందని విమర్శించారు. విద్యా వ్యాపారీకరణకు బీజేపీ సర్కార్ కుట్ర పన్నుతోందనీ, జాతీయవాదం మతం పేరు తో దేశంలో హింసోన్మాదాన్ని ప్రేరేపిస్తోందనీ అన్నారు. భారత రాజ్యాంగం, దేశ ఆర్థిక వ్యవస్థ, సమైక్యతలపై దాడి చేస్తూ తన ఎజెండాను అమలు చేస్తోందన్నారు. విద్యలోకి పాత కాలపు ఛాందస్స భావాలను జొప్పించి ఆధునిక కాలాన్ని ఆదిమ కాలంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబించే మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో వామపక్ష విద్యార్థి సంఘాలను గెలిపిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ప్రపంచ పరిణా మాలు, దేశ ఆర్థిక వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. విద్యా వ్యవస్థలో వస్తున్న నిత్య పరిణామాలను అధ్యయనం చేస్తూ ప్రభుత్వం అవలం బించే విద్యావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం కులం–వర్గం అనే అంశంపై బి వెంకట్ ప్రసంగించారు. వర్క్‌షాప్ ప్రారంభసూచికంగా ఎస్ఎఫ్ఐ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి ఆవిష్కరించారు. ఇటీవల మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. వర్క్‌షాప్‌లో రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు, ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రశాంత్, ఆర్.అరవింద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోపాలస్వామి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో బాలికపై లైంగికదాడి

**నవతెలంగాణ–మెదక్**

బాలికపై ఇద్దరు బాలురు లైంగికదాడికి ఒడిగట్టారు. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పులింగాపూర్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ సీఐ స్వామిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిదేండ్ల బాలిక, మరో ఇద్దరు పదేండ్ల బాలురులు బుధవారం గాంధీ జయంతి రోజు కలిసి ఆడుకున్నారు. ఈ క్రమంలోనే మరో బాలుడి ఇంట్లో టీవీ చూసేందుకు ముగ్గురూ కలిసి వెళ్లారు. అక్కడ ఇద్దరు బాలురులు ఆ బాలికపై లైంగిక దాడి చేశారు.

# యురేనియం తవ్వకాలతో మనుగడ ప్రశ్నార్థకం

## ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ

- తవ్వకాలు చేపడితే తరిమికొడతాం: స్కైలాబ్‌బాబు



**నవతెలంగాణ–మహబూబ్‌నగర్ ప్రతినిధి**

నల్లమలలో యురేనియం తవ్వకాల వల్ల ఆదివాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4వరకు నల్లమలలో అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలోనూ బృందం సభ్యులు పదర మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఫరహాబాదు, అప్పాపూర్, బైరా పూర్, మేడిమలకల, సంగిడి గుండాల, రాంపూర్ వంటి చెంచుగూడేల్లో పరిశీలిస్తే అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. వారి సమస్యలేవీ పరిష్కరించకుండా చెంచుల వినాశనంతో పాటు వాతావరణ కాలుష్యం ఏర్పడే విషపూరితమైన యురేనియం తవ్వకాలు చేపట్టడం సరికాదన్నారు. వందల కిలోమీటర్లు వాతావరణం కలుషితమై జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు. పుట్టిన బిడ్డలు అంగవైకల్యం వచ్చే అవకాశ ముందన్నారు. 300ఫీట్ల లోతులో ఉన్న నీరు కూడా కలుషితంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు కలుషితమై తాగునీటికి సమస్య ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శోభన్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, ప్రజా సంఘాల వేదిక రాష్ట్ర కన్వీనర్ వర్ధం పర్వతాలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ యురేనియం తవ్వకాలు చేపడితే అధికా రులను తరిమికొడతామన్నారు. చెంచులు, గిరిజనులు, దళితుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. దళితులు మరణిస్తే కనీసం పూడ్చి పెట్టడానికి శ్మశాన వాటిక కూడా లేకపోవడం దారుణమన్నారు. అనేక ప్రాంతాల్లోని తాగునీరు, సరైన మౌలిక వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దళితులపై నేటికీ కుల దురహంకార హత్యలు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బృందంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కపా సాగర్, సామెల్, మణిపాల్, జిల్లా అధ్యక్షులు పరుషరాముడు, పాల్గొన్నారు.

## పెద్దపల్లి కలెక్టర్‌ను అభినందించిన సీఎస్



**నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్**

'స్వచ్ఛసర్వేక్షన్ గ్రా మం' కార్యక్రమంలో సర్వోత్తమ జిల్లాగా పెద్దపల్లి ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించిన కలెక్టర్ దేవసేనను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అభినందించారు. అవార్డు పొందిన తర్వాత తొలిసారి ఆమె బీఆర్‌కే భవన్‌లో సీఎస్‌ను శుక్రవారం కలిశారు. ఈ అవార్డు పొందటంతో తన బాధ్యత మరింత పెరిగిందని దేవసేన అన్నారు. మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా అహ్మదాబాద్‌లో సబర్మతినది ఫ్రంట్ ప్రాంతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదు ఆమె ఈ అవార్డును అందుకున్న విషయం తెలిసిందే.

## రాష్ట్రంలో అరాచక పాలన

- జాగో తెలంగాణ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



**నవతెలంగాణ–పంజాగుట్ట**

ఎన్నో పోరాటాలతో తెచ్చుకున్న తెలంగాణలో అరాచక పాలన కొనసాగుతోందని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అన్నారు. సీఎం కేసీఆర్ నియంతృత్వ విధానాలతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాగో తెలంగాణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జాగో తెలంగాణ వ్యవస్థాపకులు జిట్టా బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన వహించిన ఈ సమావేశంలో ముందుగా మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. భౌగోళిక తెలంగాణ వచ్చిందని, ప్రజా తెలంగాణ రాలేదని అన్నారు. తెలంగాణలో ఉద్యమకారులు, అమరవీరులకు న్యాయం జరగడం లేదన్నారు. కేసీఆర్‌కు ఉన్న ఆస్తులు దేశంలో ఏ ఉద్యమకారునికీ లేవన్నారు.మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణాలో రాజకీయ పార్టీలపై ప్రజలకు గౌరవం పోతోందన్నారు. ప్రజల అవసరాలకు తగినట్టుగా ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఆర్టీసీ ప్రభుత్వానికి ఏడాదికి 740కోట్ల పన్ను కడుతున్నట్టు చెప్పారు. డీజిల్‌పై వ్యాట్ తగ్గిస్తే ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించొచ్చని సూచించారు. తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు చెరుకు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారులు ఇన్నారెడ్డి, దరువు ఎల్లన్న, ఓయూ జేఏసీ నాయకులు దత్తాత్రేయ, దాసు సురేష్, సీనియర్ పాత్రికేయులు రాణి రుద్రమదేవి, విఠల్ తదితరులు ప్రసంగించారు.

## రోడ్డు ప్రమాదాల్లో 10 మంది మృతి

### మరో ఏడుగురికి తీవ్ర గాయాలు



**నవతెలంగాణ–దేవరుప్పుల /ఆత్మకూరు/కామారెడ్డి**

వరంగల్‌రూరల్, జనగామ, కామారెడ్డి జిల్లాల్లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 10 మంది మృతిచెందారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని పెట్రోల్ పంప్ సమీపంలో జనగామ నుంచి తొర్రూర్ వెళ్తున్న కారును పెద్ద మాడుర్ నుంచి జనగామ వెళ్తున్న మరో కారు ఢీకొట్టింది. దీంతో పెద్ద మాడుర్ గ్రామానికి చెందిన వర్రె మహేష్(25), కొమ్ము కృష్ణ(30), రఘునాథపల్లికి చెందిన చింతకింది మనిదీప్(18), నీర్మాల గ్రామానికి చెందిన బోగు సోమనర్సయ్య(40) మృతిచెందారు. జనగామలోని వీవర్స్‌కాలనీకి చెందిన లోగ రోహిత్, మూగ ప్రమీల, వెల్దంలకు చెందిన సుధీర్‌కుమార్, రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

**కారు, అంబులెన్స్ ఢీ**

వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూర్ మండలం కటాక్షపూర్ శివారులో రెండు కార్లు, అంబులెన్స్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో వెంకటాపూర్ నుంచి హైదరా బాద్‌కు వెళ్తున్న కారు వరంగల్ నుంచి ములుగు వైపు పోతున్న కారును గుద్ది, ఎదురు గా వస్తున్న పోలీస్ అంబులెన్స్ వ్యాన్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ములుగు జిల్లా వాజేడు, వెంకటా పూర్‌కు చెందిన దంపతులు బానోతు సోనాల్– రజిత, వారి పాపతో పాటు మరో వ్యక్తి మృతి చెం దారు. మరో నలుగురికి తీవ్ర గాయాల య్యాయి. వారిని ఎం జీఎం ఆస్పత్రికి తరలించినట్టు సీఐ మహేందర్ తెలిపారు.

**ఆర్టీసీ బస్సు.. ఆటో ఢీ**

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లి శివారు లో శుక్రవారం రాత్రి ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. కాకుల గుట్టతండాకు చెందిన భూక్య రవి(32) తన ప్యాసింజర్ ఆటోలో మండలంలోని పాల్వంచ స్టేజీ వద్ద రాజ్‌బీ(40)ను ఎక్కించుకుని కామారెడ్డికి వస్తున్నాడు. కామారెడ్డి నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. ఆరుపల్లి శివారులో ఆటోను ఢీకొనడంతో ఇద్దరూ మృతిచెందారు. ఆటో నుజ్జునుజ్జయింది.

# 'మియావాకి'తో అటవీ సాంద్రత పెంపు

## ప్రయోగాత్మకంగా యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో తంగేడు వనం

- పరిమిత వ్యయం..తక్కువ ప్రాంతం... ఎక్కువ పచ్చదనంలో విజయవంతం
- అదే పద్ధతిలో అడవులను పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు
- జీవవైవిధ్యం, భూగర్భ జలాల పెంపు కోసం రాష్ట్ర సర్కారు కృషి




**నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్**

తక్కువ భూమిలో ఎక్కువ మొక్కలు నాటడం, కొద్ది ఖర్చుతో దట్టమైన పచ్చదనాన్ని పెంచేందుకు రాష్ట్ర అటవీ శాఖ చేపట్టిన మియావాకీ విధానం విజయవంతమైంది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ సమీపంలో చేపట్టిన అర్బన్ ఫారెస్టు పెంపకం మంచి ఫలితాలను ఇస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని అటవీశాఖ అమలు చేయబోతున్నది. రాష్ట్ర వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన చెట్లను పెంచటం ఈ విధానం ప్రత్యేకత. అటవీ పునరుజ్జీవన చర్యలకు తోడు, క్షీణించిన అటవీ ప్రాంతాల్లో ఒక్కో ఎకరాను మియావాకి విధానంలో అడవులుగా మారుస్తున్నారు.

మియావాకి విధానంలో మొదట క్షీణించిన అటవీ ప్రాంతంలో పూర్తి శాస్త్రీయ పద్ధతుల్లో మట్టిని ట్రీట్‌మెంట్ చేస్తారు. ఆ భూమిలో వర్మీ కంపోస్టును వాడుతూ ఆ మట్టి స్వభావానికి అనుగుణంగా అడుగుకో మొక్క చొప్పిన ఎకరం భూమిలో సుమారు నాలుగు వేల వివిధ రకాల మొక్కలను నాటుతారు. పెరిగిన తర్వాత ఒక దానికి మరొకటి అడ్డురాకుండా ఉండేందుకు వృక్ష జాతులు, వాటి ఎత్తు, విస్తరణ ఆధారంగా ఖాళీప్రదేశాల్లో మళ్లీ చిన్నచిన్న మొక్కలు పెంచుతారు. ఆ మొక్కల ఎదుగుదలను ప్రభావితం చేసే వాతావరణ పరిస్థితులను కొన సాగించటం కూడా ఈ మోడల్ ప్రత్యేకత. దాదాపు 2.5 లక్షల రూపాయల ఖర్చుతో నలభై ఐదు రోజుల్లో ఎకరా భూమిని అటవీ ప్రాంతంగా అభివృద్ధి చేయవచ్చు.

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ దగ్గర తంగేడువనం అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో ఒక ఎకరాలో మియావాకి విధానంలో అడవిని పెంచారు. అందులో మారేడు, నేరేడు, రేల, ఇప్ప, మోదుగు, రోజ్‌వుడ్, మద్ది, వేప, శ్రీగంధం, తాని, జమ్మి, టేకు, ఉసిరి, సీతాఫలం, వెదురు, గోరింటాకు మొక్కలు ఏపుగా పెరిగాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పచ్చదనం అలుముకున్నది. ఈ ప్రయోగం ఇచ్చిన ఉత్సాహంతో రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లోని క్షీణించిన అడవుల్లో ఈ విధానం అమలు చేయాలని అటవీ శాఖ నిర్ణయించింది. ఈ ఏడాది రాచకొండ, లక్కారం, బీబీనగర్, కొండమడుగు, వీరారెడ్డిపల్లి, గజ్వేల్, మేడ్చల్, నిజామాబాద్, అదిలాబాద్ అటవీ ప్రాంతాల్లో మియావాకి విధానాన్ని అమలు చేస్తున్నారు. తక్కువ ఏరియాలో ఎక్కువ సాంద్రతతో సహజ సిద్ధమైన అడవిని సృష్టించటం, పచ్చదనం పెంపు, స్వచ్ఛమైన ఆక్సిజన్ పరిసర ప్రాంతాలకు అందించేలా ఈ కొత్త తరహా అడవుల పెంపకం వల్ల తక్షణం కలిగే లాభాలు. అలాగే పట్టణ ప్రాంతాలకు సమీపంలో లభ్యమయ్యే తక్కువ విస్తీర్ణం భూముల్లో పెంచేందుకు అనువుగా ఉంటుంది. ఈ విధానంలో ఖర్చు, నిర్వహణ వ్యయం తక్కువ, అలాగే నీరు భూమిలోకి ఇంకే గుణాన్ని పెంచటంతో వర్షపు నీటికి ఆయా ప్రాంతాల్లో ఒడిసి పట్టేవీలవుతుంది. అన్ని రకాల పక్షులు, జంతువులకు ఇవి ఆవాసంగా మారటంతో పాటు, జీవ వైవిధ్య కేంద్రాలుగా కూడా ఉపయోగపడతాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్న అన్ని అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో మియావాకి విధానంలో కొద్ది ప్రదేశంలో మొక్కలు అటవీశాఖ నాటుతోంది. అర్బన్ పార్కులకు వచ్చే సందర్శకులు, విద్యార్థులకు కూడా ఈ విధానంపై అవగాహన పెంచాలని నిర్ణయించింది.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే వృథానే..

- టీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి: కేటీఆర్



**నవతెలంగాణ–హుజూర్‌నగర్**

హుజూర్‌నగర్ నియోజకవర్గ వెనుకబాటుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని, మళ్లీ ఆ పార్టీకి ఓటేస్తే వృథా అయినట్టేనని మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి గెలుపును కోరుతూ శుక్రవారం హుజూర్‌నగర్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఐదేండ్లుగా హుజూర్‌నగర్ అభివృద్ధికి నిధులు కావాలని ఉత్తమ్ ఏ సందర్భంలోనూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కానీ, జిల్లా మంత్రిని కానీ కోరలేదని అన్నారు. హుజూర్‌నగర్ అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం రెండువేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్టు తెలిపారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉత్తమ్ పద్మావతి గెలిచినా కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేని కాంగ్రెస్ వల్ల ఏ ప్రయోజనమూ ఉండదని అన్నారు. యువకుడు, విద్యావంతుడు అయిన సైదిరెడ్డిని గెలిపిస్తేనే ఈ ప్రాంతంలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. సైదిరెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే రింగ్ రోడ్డు, రోడ్ల అభివృద్ధి, యువత కోసం స్కిల్‌సెంటర్లు, నియోజకవర్గ వ్యాప్తంగా లిఫ్టులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, కాల్వ చివరి భూములకు సాగునీరు అందించేలా కృషి చేస్తానన్నారు.

## టీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ

- మమ్మల్ని కాంగ్రెస్ అవమానించింది: చాడ

**నవతెలంగాణ–హుజూర్‌నగర్**

అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల పేరిట ఆహ్వానించి సీపీఐకి మూడు సీట్లు మాత్రమే కేటాయించి కాంగ్రెస్ పార్టీ తమను అవమానించిందని, అందు కే ఆ పార్టీతో కలిసి వెళ్లడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో శుక్రవారం టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజాకూటమిలో అన్ని పార్టీలు సమానమైనప్పటికీ.. తమ ను ముప్పు తిప్పలు పెట్టి మూడు సీట్లను మాత్రమే కాంగ్రెస్ పార్టీ కేటా యించిందని, అక్కడా ఆ పార్టీ రెబల్స్ పోటీ చేశారని ఆవేదన వ్యక్తం చేశా రు. కాంగ్రెస్ వైఖరి తమను కించపర్చే విధంగా ఉందన్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి మద్దతు ఇవ్వలేదన్నారు. హుజూర్ నగర్‌లో మతోన్మాద బీజేపీ పాగా వేయాలని చూస్తోందని, ప్రజలు వారిని తరిమి కొట్టాలని అన్నారు. టీఆర్ఎస్ పార్టీని సెక్యులర్ పార్టీగా భావిస్తు న్నామని చెప్పారు. పోడు భూముల సమస్యలు, ఆర్టీసీ, సింగరేణి కార్మి కుల సమస్యలు పరిష్కరించాలని, రెవెన్యూ చట్టం మార్పులో తమ సలహా లు తీసుకోవాలని, ప్రాజెక్టులు పూర్తి చేయాలని ప్రభుత్వానికి సూచించా మన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేయటం లేద ని, అధికార గర్వం పెరిగిందని టీజేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరా మ్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో టీ ఆర్ ఎస్ పూర్తి గా విఫలమైందని, మళ్లీ ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించడం వల్ల ఉపయోగ మేమీ ఉండదని టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ అన్నారు.

## సూర్యాపేట జిల్లా ఎస్పీ బదిలీ

- ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు

**నవతెలంగాణ–సూర్యాపేట**

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఉపఎన్నిక సందర్భంగా ఎస్పీ ఆర్ వెంకటేశ్వర్లుపై రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో బదిలీ చేస్తూ ఎన్నికల కమిషన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో 2012 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన భాస్కరన్‌ను నియమించింది. ఎస్పీ ఆర్.వెంకటేశ్వర్లును హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఎటువంటి ఎన్నికల విధులనూ అప్పగించొద్దని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎస్పీ అధికార పార్టీకి అమ్ముడు పోయారని, అతన్ని బదిలీ చేయాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఇదే నేపథ్యంలో బీజేపీ కూడా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్పీని బదిలీ చేస్తూ ఈసీ కీలక నిర్ణయం తీసుకుంది. భూపాల్‌పల్లిలో ఎస్పీగా పనిచేస్తున్న భాస్కరన్ సూర్యాపేటకు ఎస్పీగా రానున్నారు.

## ఏసీబీ వలలో మైనింగ్ అధికారులు

- ఫర్మ్ పేరు మార్పునకు రూ.లక్షా 20 వేల లంచం డిమాండ్
- వనపర్తి జిల్లాలో ఘటన



**నవతెలంగాణ – పెబ్బేరు**

కాసులకు కక్కుర్తిపడిన ఇద్దరు మైనింగ్ అధికారులు ఏసీబీ వలకు చిక్కారు. వనప ర్తి జిల్లా భూగర్భ గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జాకబ్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సాయిరాం రూ.20వేలు లంచం తీసుకుంటుండగా శుక్రవారం ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌కు చెందిన దిలీప్ ఆచారికి వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం సమీపంలో శ్రీసాయి మైన్స్ అండ్ మినరల్స్ పేరుతో పలుగురాయి పరిశ్రమ ఉంది. ఆ ఫర్మ్‌ను ఇతర ప్రాంతానికి మార్చేందుకు మైనింగ్ అధికారి జాకబ్‌ను ఆశ్రయించాడు. కానీ, ప్రస్తుతం అక్కడ రూ.18లక్షల విలువ చేసే మెటీరియల్ ఉందని, ఫర్మ్ పేరును ఇతర ప్రాంతానికి తరలించాలంటే అన్ని పత్రాలు సరిగ్గా ఉండాలని, అవి లేవని చెప్పి ఆ ప్రొడక్ట్‌పై ఐదు విడతలుగా రూ.1.13కోట్ల జరిమానా విధిస్తున్నట్టు నోటీసులు జారీ చేశారు. ఇదేమని బాధితుడు ఏడీని అడగ్గా రూ.1.20లక్షలు లంచమిస్తే ఫర్మ్‌ను ఇతర ప్రాంతానికి తరలించేలా చర్య లు తీసుకుంటామని చెప్పాడు. దాంతో దిలీప్ ఆచారి గత నెల మైనింగ్ ఏడీకి రూ.లక్ష అందజేశాడు. మరో రూ.20వేలు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం ఏడీ కార్యాలయంలో ఏడీ జాకబ్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సాయిరాంకు దిలీప్ ఆచారి రూ.20వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు అధికారులు పట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. అలాగే, హైదరాబాద్‌లో ఉన్న అధికారుల ఇండ్లల్లో కూడా తనిఖీలు చేశారు.

epaper.navatelangana.com


మమ్ముట్టి

## సరికొత్త చరిత్రను తెలిపే
# మామాంగం

"భారతదేశ సంస్కృతి విశిష్టమైనది. భాషలు మనల్ని విభజిస్తాయి. కానీ భాష వల్ల మన చరిత్ర ఇతరులకు తెలియకుండా ఉండకూడదు. కేరళ రాష్ట్ర చరిత్ర అంటే భారత దేశ చరిత్ర కూడా. సినిమా అనే మాధ్యమం ద్వారా అన్నీ భాషల ప్రేక్షకులను ఏకం చేసి, మనకి సంబంధించిన ఒక మంచి కథను చెప్పే ప్రయత్నమే 'మామాంగం' సినిమా' అని అన్నారు మమ్ముట్టి. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మామాంగం'. ఎం.పద్మకుమార్ దర్శకత్వంలో కావ్య ఫిల్మ్ కంపెనీ పతాకంపై వేణు కున్నపిళ్లి నిర్మించారు. మలయాళంలో రూపొందిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నారు. శుక్రవారం టీజర్‌ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు ఎం. పద్మకుమార్ మాట్లాడుతూ, '1695లో జరిగిన ఒక యదార్థ కథతో, గతంలో చూడనటువంటి విజువల్స్‌తో సినిమాని తెరకెక్కిస్తున్నాం. జమోరిన్‌ని చంపిన చావేర్స్ కథే ఈ సినిమా. అతి ప్రాచీనమైన కలరి విద్యలోని విశిష్టతను ఇంతకు ముందు ఎవరూ చూపించినంతగా ఈ సినిమాలో చూపించబోతున్నాం. మమ్ముట్టి ఓ కొత్త రకమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఒక 12 ఏళ్ల అబ్బాయి, చరిత్రలోని ఒక పాత్రను పోషిస్తూ భారతీయ తెరపై ఎప్పుడూ చూడనటువంటి యాక్షన్ సన్నివేశాల్లో నటించాడు' అని అన్నారు. 'శుక్రవారం విడుదల చేసిన టీజర్‌కి చాలా అద్భుతమైన స్పందన వచ్చింది. భారీ బడ్జెట్‌తో నిర్మించాం. మేకింగ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. మమ్ముట్టి గారికి తెలుగులో కూడా మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ చిత్రాన్ని నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని నిర్మాత తెలిపారు. ప్రాచి తెహెలన్, ఉన్ని ముకుందన్, మోహన్ శర్మ, అను సితార, ప్రాచీ దేశాయ్, మాళవికా మీనన్, అభిరాం అయ్యర్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పిళ్లై, సంగీతం: ఎం.జయచంద్రన్, ఎడిటర్: రాజా మొహమ్మద్.

# నవచిత్రం

## మరో సినిమాకి రంగం సిద్ధం


సల్మాన్‌ఖాన్, ప్రభుదేవా

సల్మాన్, ప్రభుదేవా కాంబినేషన్‌కి బాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. సల్మాన్ హీరోగా ప్రభుదేవా దర్శకత్వంలో వచ్చిన 'వాంటెడ్' భారీ విజయాన్ని సాధించింది. ఇది తెలుగులో వచ్చిన 'పోకిరి' చిత్రానికి రీమేక్ అనే విషయం విదితమే. ప్రస్తుతం సల్మాన్ హీరోగా ప్రభుదేవా 'దబాంగ్ 3' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇది చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. అయితే ముచ్చటగా మూడోసారి వీరి కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతుందని సమాచారం. బ్యాక్ టూ బ్యాక్ నెక్స్ట్ సినిమా కూడా ప్రభుదేవా దర్శకత్వంలోనే చేసేందుకు సల్మాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అయితే ఇది 'ది ఔట్‌లాస్' అనే కొరియన్ యాక్షన్ థ్రిల్లర్‌కి రీమేక్ అని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై కథా చర్చలు జరుగుతున్నాయి. బోనీ కపూర్ నిర్మించనున్న ఈ చిత్రానికి 'రాధే' పేరు వినిపిస్తోంది. అయితే ఈ వార్తని సల్మాన్ ఖండించారు. 'మేం మరో సినిమా చేయబోతున్నాం. దాని పేరు 'రాధే' కాదు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఈద్‌కి విడుదల కానుంది' అని ఆయన పేర్కొన్నారు. 'దబాంగ్' సిరీస్‌లో భాగంగా ప్రస్తుతం రూపొందుతున్న 'దబాంగ్ 3'లో సోనాక్షి సిన్హా హీరోయిన్‌గా నటిస్తున్నారు. చుల్‌బుల్ పాండేగా సల్మాన్, రజ్జోగా సోనాక్షి మరోసారి ఆడియెన్స్‌ని మెస్మరైజ్ చేయనున్నారు. ఈ సినిమా డిసెంబర్ 20న రిలీజ్ కానుంది.

# అంతిమంగా నచ్చాల్సింది ప్రేక్షకులకే..

'యాక్షన్ నాకిష్టమైన జోనర్. యాక్షన్‌కి స్పై నేపథ్యాన్ని మేళవించి అత్యంత స్టయిలీష్‌గా తెరకెక్కిన చిత్రం 'చాణక్య'. ఇది నా కెరీర్‌ని ఎంత వరకు మలుపు తిప్పుతుందో తెలియదు. కానీ కచ్చితంగా ప్లస్ అవుతుంది' అని అంటున్నారు హీరో గోపీచంద్. తిరు దర్శకత్వంలో గోపీచంద్ కథానాయకుడిగా రూపొందిన 'చాణక్య' చిత్రం నేడు (శనివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా గోపీచంద్ శుక్రవారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..



### కథకి కొత్త ఫ్లేవర్..

యాక్షన్‌కి స్పై బ్యాక్‌డ్రాప్ జోడించడంతో సినిమాకి కొత్త ఫ్లేవర్ వచ్చింది. వినోదం, ఎమోషన్స్, ఉత్కంఠతకు గురిచేసే అంశాలకు ఆడియెన్స్ బాగా కనెక్ట్ అవుతారు. ఇందులో ఆ మూడూ పుష్కలంగా ఉన్నాయి. మాస్ అయినా క్లాస్ అయినా యాక్షన్ ఒక్కటే. ఇందులో అది ఆద్యంతం ఆకట్టుకుంటుంది. దర్శకుడు తిరు ఈ కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. ముఖ్యంగా ఉత్కంఠతకి గురి చేసే అంశాలు బాగా నచ్చాయి. మనం చేసే సినిమాలు మనకు బాగా నచ్చుతాయి. అంతిమంగా నచ్చాల్సింది ఆడియెన్స్‌కి. ఇటీవల మాకు దగ్గరిగా ఉన్న కొంత మందికి సినిమా చూపించా. వారందరికీ బాగా నచ్చింది. దీంతో సినిమా ఫలితంపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఈ సినిమా ఎలాంటి టర్న్ ఇస్తుందో తెలియదు కానీ కచ్చితంగా కెరీర్‌కి మాత్రం ప్లస్ అవుతుంది.

### అది తెరపైనే చూడాలి..

ఇందులో నేను రా ఏజెంట్ అర్జున్‌గా కనిపిస్తాను. నా పాత్రలో రెండు షేడ్స్ ఉంటాయి. అర్జున్‌కి, రామకృష్ణకి ఉన్న సంబంధమేంటి?, రెండు షేడ్స్‌లో ఎందుకు కనిపిస్తాననేది తెరపై చూడాలి. చాణక్య అనే మిషన్ ప్రధానంగా సినిమా సాగుతుంది. మరి ఆ మిషనేంటో థియేటర్‌లో చూస్తేనే బాగుంటుంది. నేను కూడా చాణక్య లాంటి ఇంటలిజెంట్‌గా కనిపిస్తాను. ఇందులో నా లుక్ చాలా కొత్తగా ఉంటుంది. రెగ్యులర్‌కి భిన్నంగా గెడ్డంతో కాస్త స్టయిలీష్‌గా చూపించాలని దర్శకుడు తిరు ప్రయత్నించారు. లుక్ బాగా వచ్చింది. సినిమాలో ఓ అరగంట హిలేరియస్ కామెడీ ఉంటుంది. ఆయా ఎపిసోడ్స్ చేసేటప్పుడు బాగా ఎంజాయ్ చేశాను. నాకు సిగ్గు ఎక్కువ. హీరోయిన్లతోనే కాదు ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడలేను. కానీ హీరోయిన్‌తో కెమిస్ట్రీ పండించడంలో ఎలాంటి ఇబ్బంది లేదు.

### ఈ మధ్యే తెలిసింది..

సినిమా లాస్ట్ షెడ్యూల్ చివరి రోజు జెరూసలేంలో షూటింగ్ టైమ్‌లో బైక్ స్కిడ్ అయి గాయాలయ్యాయి. బాగా దెబ్బలు తగిలాయి. దీంతో సినిమా షూటింగ్ ఆలస్యమైంది. నిజానికి ఈ సినిమాని మేలోనే విడుదల చేయాలనుకున్నాం. యాక్సిడెంట్ కారణంగా పోస్ట్‌పోన్ చేయాల్సి వచ్చింది. తిరిగి షూటింగ్ ప్రారంభించాక దసరా పండక్కే రావాలని నిర్ణయించుకున్నాం. 'సైరా' కూడా ఇదే టైమ్‌లో వస్తుందని ఇటీవలే తెలిసింది. అయినా పండగ టైమ్‌లో రెండు మూడు సినిమాలకు స్కోప్ ఉంది. మంచి కంటెంట్ ఉండే ఏ సినిమా అయినా ఆడుతుంది. ఆడియెన్స్ ఆదరిస్తారనే నమ్మకం ఉంది.

### గేట్స్ ఓపెనయ్యాయి..

ఇటీవల బహుభాషా చిత్రాలు వస్తున్నాయి. పాన్ ఇండియా సబ్జెక్ట్‌తో సినిమాలొస్తున్నాయి. ఇది మంచి పరిణామం. నిజానికి అన్ని భాషలకు గేట్స్ ఓపెనయ్యాయి. ఎవరు ఎలాంటి సినిమా అయినా చేయొచ్చు. అంతిమంగా సినిమా బాగుండాలి. దేనికైనా కథ ముఖ్యం. ఇప్పుడు కథకి ప్రాధాన్యత పెరిగింది. మంచి సినిమాలు ఆదరించేందుకు ఆడియెన్స్ సిద్ధంగా ఉన్నారు. ఈ చిత్ర దర్శకుడు తిరు తమిళ దర్శకుడు అయినప్పటికీ సినిమాలో తమిళ ఛాయలేమీ కనిపించవు. నేను నలుగురు తమిళ దర్శకులతో పనిచేశాను. ఏ సినిమాకి అలాంటి సమస్య రాలేదు.

### రెండు భిన్నమైనవే..

ప్రస్తుతం బిను సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాతగా ఓ సినిమాలో నటిస్తున్నా. అడ్వెంచరస్ బేస్డ్‌గా సాగే చిత్రమిది. నాకు యాక్సిడెంట్ వల్ల ఇది కూడా వాయిదా పడింది. లేకపోతే ఈ పాటికి ఈ చిత్రం కూడా విడుదలయ్యేది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇక సంపత్ నందితో సాగే క్రీడా నేపథ్య చిత్రం త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ని జరుపుకుంటుంది. ఈ రెండూ భిన్నమైన సినిమాలే.


అలియా భట్

# చాలా పరిమితులు ఉంటాయి

'స్క్రిప్ట్ ఎంపిక చేసుకునే విషయంలో నాకు చాలా లిమిటేషన్స్ ఉంటాయి. ఎన్నో బారియర్స్ ఉంటాయి' అని అంటోంది అలియాభట్. ఇటీవల కాలంలో విభిన్న కథా నేపథ్య చిత్రాలతో, విలక్షణ నటనతో అలియా ప్రేక్షకుల్ని విశేషంగా అలరిస్తోంది. ప్రస్తుతం పలు క్రేజీ, భారీ ప్రాజెక్ట్‌ల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఈ సందర్భంగా ఎంపిక చేసుకునే స్క్రిప్ట్స్ గురించి అలియా మీడియాకి చెబుతూ, 'నేను ఓ గొప్ప నటిని కావాలని లేదు. అయితే ఓ కథని ఎంపిక చేసుకునే ప్రాసెస్‌లో చాలా ఓపెన్ మైండ్‌తో వింటాను. నేను నటించే సినిమాలు ఆడియెన్స్‌కి సర్‌ప్రైజింగ్‌గా ఉండాలనుకుంటాను. అలాగే బాగా క్రియేటివ్‌గా ఉండాలని కోరుకుంటాను. ఇలా.. పలు రకాల చాలా లిమిటేషన్స్ ఉంటాయి. ఎన్ని లిమిటేషన్స్ ఉన్నప్పటికీ అంతిమంగా నా లక్ష్యం ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయడమే' అని తెలిపింది. ప్రస్తుతం తెలుగులోకి ఎంట్రీ ఇస్తూ 'ఆర్ ఆర్ ఆర్'లో అలియా నటిస్తోంది. రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా రూపొందుతున్న చిత్రమిది. దీంతోపాటు హిందీలో 'బ్రహ్మాస్త్ర', 'సడక్ 2', 'తఖ్త్' చిత్రాల్లోనూ భిన్న పాత్రలను పోషిస్తోంది. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో 'గంగూబాయి' చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనె అతిథులుగా మెరవబోతున్నారట.


నవీన్ విజయ్ కృష్ణ

# అనుభవాన్ని కొనలేం

'దేన్నైనా కొనొచ్చు, కానీ అనుభవాన్ని కొనలేం. తెరపై హీరోగా, తెర వెనుక హీరో ఇమేజ్‌కి అతీతంగా సాధారణ వ్యక్తిలాగే ఉండాలనుకుంటాను. సింపుల్ లైఫే నాకిష్టం' అని అంటున్నారు నవీన్ విజయ్ కృష్ణ. ఆయన హీరోగా నటించిన చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. బాలాజీ సానల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం నేడు(శనివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హీరో నవీన్ విజయ్ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ, 'రామాపురం అనే గ్రామంలో ఊరు ప్రజలంతా ఓ కుటుంబంలా కలిసి ఉంటారు. సిటీలో ప్రేమించుకున్న ఓ జంట ఊరికి వచ్చినప్పుడు వారి ప్రేమ విషయం తెలుస్తుంది. అయితే వాళ్ళ పెళ్ళి జరగాలంటే ఊరు మొత్తం అంగీకరించాలి. ఒక్కరు నో చెప్పినా పెళ్ళి ఆగిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఊరంతా ఒప్పుకుందా?, వాళ్ళ పెళ్ళి జరిగిందా? అనే ఆసక్తికర సన్నివేశాల సమాహారం, పరిస్థితుల రీత్యా మనుషుల మధ్య చోటు చేసుకునే సంఘర్షణే ఈ సినిమా. మంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కూడిన డ్రామా చిత్రమిది. ఇప్పటికీ ఇలాంటి ఓ ఊరు ఉందా అనే కోణంలో ఈ సినిమా తెరకెక్కించాం. శ్రీనివాస్ అవసరాలతో పెద్దగా కాంబినేషన్ ఉండదు, ఇద్దరి లవ్ స్టోరీస్ పార్లల్‌గా సాగుతుంటాయి. ఊరులో పుట్టి సిటీకి వెళ్ళొచ్చిన అబ్బాయిగా కనిపిస్తాను. దర్శకుడు బాలాజీ చాలా బాగా తెరకెక్కించారు. "ఊరంతా అనుకుంటున్నారు' అనే టైటిలే మా సినిమాకి పెద్ద అసెట్. ఆ ఆలోచన వచ్చిన దర్శకుడిని అభినందించాలి. టైటిల్ బాగా పాపులర్ కావడంతో సినిమా అందరికి రీచ్ అయ్యింది. ఇక హీరోగా వచ్చిన తొలి చిత్రం 'నందిని నర్సింగ్ హెూమ్' తర్వాత 'విఠలాచార్య' ప్రారంభించాం. కొన్ని రోజులు షూటింగ్ తర్వాత ఆర్థిక కారణాలతో నిర్మాతలు తప్పుకున్నారు. దీంతో ఆ సినిమా ఆగిపోయింది. పైగా అది 'ఓ బేబీ'కి చాలా దగ్గరగా ఉంటుంది. అందుకే పక్కన పెట్టాం. కెరీర్ ప్రారంభంలోనూ ఓ సినిమా ఆగిపోయింది. నేను సినీ నేపథ్య కుటుంబంలో పుట్టినప్పటికీ నా లైఫ్ సాధారణ వ్యక్తిగానే సాగింది. చిన్నప్పుడే నానమ్మ విజయ నిర్మల 'వీడికి డబ్బు విలువ తెలియాల'ని ఆ రకంగానే పెంచారు. దీంతో రానా కంపెనీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా జాయిన్ అయ్యాను. ఆ తర్వాత ఎడిటింగ్‌పై ఆసక్తి ఏర్పడి కృష్ణవంశీ 'రాఖీ', 'చందమామ' వంటి చిత్రాలకు ఎడిటర్‌గా, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి 'అరుంధతి'కి సౌండ్ ఎడిటింగ్ చేశా. అప్పట్నుంచి హీరోగా విడుదలైన తొలి చిత్రం 'నందిని నర్సింగ్‌హెూమ్' వరకు ఓ పోరాటం చేశా. ఆ తర్వాత ఈ సినిమా వరకు మరో పోరాటం చేస్తూ వచ్చాను. ఈ క్రమంలో ఎంతో అనుభవం సంపాదించాను. అయితే దేన్నైనా కొనొచ్చు, కానీ అనుభవాన్ని కొనలేం. తెర వెనుక జరిగే విషయాలే సినిమాగా తీయొచ్చనిపించింది. నాకు దర్శకుడిగా రాణించడం చాలా ఇష్టం. భవిష్యత్‌లో దానిపై దృష్టిపెడతా. ప్రస్తుతం హీరోగా, నటుడిగా రాణించాలనుకుంటున్నా. అయితే హీరో జీవితం ఒంటరిగా సాగుతుంది. అలా నేను ఉండదలచుకోలేదు. నాకిష్టమైనట్టుగా ఉండాలనుకుంటున్నా. నేనిప్పుడున్న హీరోల్లో అత్యంత సంపన్నమైన హీరోనంటున్నారు. ఆ విషయం నాకూ తెలియదు, కానీ అదే నిజమైతే చాలా హ్యాపీ' అని అన్నారు.

# రష్మి రాకెట్ స్ఫూర్తివంతమైన కథ


తాప్సీ

'రష్మి రాకెట్' కోసం నా శరీరాన్ని మార్చుకునే పనిలో బిజీగా ఉన్నాను. అందుకు ప్రత్యేక శిక్షణ బృందం పనిచేస్తుంది. కచ్చితంగా ఇదొక స్ఫూర్తివంతమైన చిత్రమవుతుంది' అని అంటోంది తాప్సీ. ప్రస్తుతం 'సాండ్ కి ఆంఖ్'లో షార్ప్ షూటర్‌గా నటిస్తున్న తాప్సీ ఈ చిత్ర షూటింగ్ పూర్తి చేసుకున్న నేపథ్యంలో తాజాగా మరో స్పోర్ట్స్ ప్రధాన చిత్రానికి రెడీ అవుతుంది. కుచ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళా రన్నర్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందిస్తున్న ఫిక్షనల్ స్టోరీ 'రష్మి రాకెట్'లో నటిస్తుంది. త్వరలో ప్రారంభం కానున్న ఈ సినిమా కోసం తాప్సీ సన్నద్ధమవుతుంది. ఆ విశేషాలను పంచుకుంటూ, 'ఈ సినిమా కోసం ప్రస్తుతం నా శరీరాన్ని ట్రాన్స్‌ఫామ్ చేసుకునే పనిలో ఉన్నాను. ఇప్పుడు నా లక్ష్యం ఒక్కటే నేను క్రీడాకారిణిగా మారడం. నన్ను అథ్లెట్‌గా మార్చడానికి న్యూట్రిషనిస్ట్, సైకోథెరపిస్ట్‌లు హెల్ప్ చేస్తున్నారు. క్రీడా నేపథ్య చిత్రంలో భాగం అయ్యేందుకు ఎగ్జైటింగ్‌గా వెయిట్ చేస్తున్నా. ఫర్హాన్ అక్తర్ నటించిన 'భాగ్ మిల్కా భాగ్', ప్రియాంక చోప్రా నటించిన 'మేరీకోమ్' చిత్రాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్నా. నా వరకు ఈ సినిమాకి న్యాయం చేస్తాననే నమ్మకం ఉంది. అయితే ఇది బయోపిక్ కాదు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమవుతుంది' అని తెలిపింది.

# నయా చిత్రం మొదలైంది


విజయ్

ప్రస్తుతం 'బిగిల్' చిత్రంలో నటిస్తున్న విజయ్ నెక్స్ట్ సినిమా ప్రారంభమైంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కబోయే ఈ నూతన సినిమాని శుక్రవారం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. గ్జేవియర్ బ్రిట్టో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయ్ సేతుపతి ఇందులో విలన్‌గా నటిస్తున్నారు. మలయాళ నటుడు ఆంటని, శాంతనులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందట. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. సత్యన్, సూర్యన్ సినిమాటోగ్రాఫర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో కథానాయికలుగా కైరా అద్వానీ, రష్మిక మందన్నా పేర్లు వినిపిస్తున్నాయి. దీన్ని వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ చేస్తారట. ఇక విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'బిగిల్'కి 'థెరి', 'మెర్సల్' చిత్రాల దర్శకుడు అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సందేశాత్మక లైఫ్ స్టయిల్


నెహ్రూ విజయ్, సి.ఎల్.సతీష్, అంకం, కలకొండ నర్సింహా, డా॥వకుళాభరణం మోహనకృష్ణ

నెహ్రూ విజయ్, రోజా జంటగా సి.ఎల్.సతీష్ మార్క్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'లైఫ్ స్టయిల్'. కలకొండ ఫిల్మ్స్ పతాకంపై కలకొండ నర్సింహా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్ లాంచ్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన డా॥వకుళాభరణం మోహనకృష్ణ ఫస్ట్‌లుక్‌ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, 'సోషల్ మీడియా వల్ల యువత పెడదారులు పడుతోంది. దాని వల్ల మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. మన మనుగడని విధ్వంసం చేస్తుంది. ఈ నేపథ్యంలో మొబైల్, సామాజిక మాధ్యమాలు సమాజంపై ఎలాంటి చెడు ప్రభావాన్ని చూపుతున్నాయి. యువతని, రిలేషన్స్‌ని ఎలా చిన్నాభిన్నం చేస్తున్నాయనే సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందించారు' అని అన్నారు. 'రోజూ మనకు ఎదురవుతున్న సంఘటనల ఆధారంగా సినిమా తెరకెక్కించాను. యువత లైఫ్ స్టయిల్ లేకుండా ఉంది. వారికంటూ ఓ లైఫ్ స్టయిల్ ఉండాలని, మార్పు కోసం చేసిన ప్రయత్నమిది. షూటింగ్ పూర్తయ్యింది. త్వరలో ఆడియోని, వచ్చే నెలలో సినిమాని విడుదల చేస్తాం' అని దర్శకుడు సతీష్ తెలిపారు. హీరో విజయ్ చెబుతూ, 'సినిమా చాలా బాగా వచ్చింది. అందరిని ఆకట్టుకునే చిత్రమవుతుంది' అని చెప్పారు. 'సినిమా బాగా ఆడాలి. ఇది ఆడితే మరిన్ని సందేశాత్మక చిత్రాలను రూపొందిస్తాం' అని నిర్మాత కలకొండ నర్సింహా తెలిపారు. ఈ కార్యక్రమంలో లిరిసిస్ట్ సతీష్ బండోజి, డైలాగ్ రైటర్ ఆవుసలి ఆంజనేయులు తదితరులు పాల్గొని మరిన్ని చిత్ర విశేషాలు తెలిపారు.

# శీను, వేణు మంచి కిడ్నాపర్స్


'శీను వేణు' చిత్ర పాటల విడుదల దృశ్యం

అభిషేక్, ప్రజ్వల్ కుమార్, మధు ప్రియ, పూజిత హీరో హీరోయిన్లుగా రవి ములకలపల్లి దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'శీను, వేణు'. 'వీళ్లు మంచి కిడ్నాపర్స్' అనేది ఉపశీర్షిక. గడ్డం కృష్ణ సమర్పణలో వసుంధర క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం గురువారం జరిగింది. అతిథిగా విచ్చేసిన ప్రముఖ నిర్మాత సి కళ్యాణ్ ఆడియోని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'చిత్ర పాటలు బాగున్నాయి. కొత్త వాళ్లైనా నటీనటులు బాగా చేశారు. చిన్న చిత్రాలు తీసేటప్పుడు బలమైన కథ, కథనాలను చూసుకోవాలి. కంటెంట్ బాగా లేకుంటే ఎవరూ చూడరు. ఆ తర్వాత చిన్న సినిమాకు థియేటర్‌లు దొరకలేదంటారు. జాగ్రత్తగా తెరకెక్కించాలి. ఇవాళ చిన్న సినిమాల థియేటర్‌లకు వెళ్లి చూస్తే పది మంది కూడా ఉండటం లేదు. ఈ సినిమా మంచి ఆదరణ పొందాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'పల్లెటూరి నేపథ్యంతో సాగే చిత్రమిది. ఊరిలో గొర్రెలు కాసే ఇద్దరు అమ్మాయిలు అపహరణకు గురవుతారు. వాళ్లను ఆ ఊరి నుంచి ముంబయికి, అక్కడ్నుంచి దుబాయ్‌కి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుంటుంది. ఆ అమ్మాయిలను హీరోలు ఎలా రక్షించారనేది కథాంశం. వినోదం, భావోద్వేగాలతో కథ సాగుతుంది. ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాం' అని దర్శకుడు ములకలపల్లి రవి తెలిపారు. హీరో అభిషేక్ మాట్లాడుతూ, 'మా అందరికీ పేరు తెచ్చేలా సినిమా చేశారు దర్శకుడు. మాకిది మొదటి చిత్రమైనా ఐదారు సినిమాలంత అనుభవం ఇచ్చారు' అని చెప్పారు.

# మాకు ఉద్యోగాలివ్వండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'మా ఉద్యోగాలు మాకివ్వండి. ఇంకెంత కాలమీ నిరీక్షణ. 2017, అక్టోబర్ 21న టీఆర్టీ నోటిఫికేషన్ జారీ అయ్యింది. 2018, ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4వ తేదీ వరకు రాతపరీక్షలు జరిగాయి. జూన్‌లో మెరిట్ జాబితా విడుదలైంది. ఆ తర్వాత విడతల వారీగా అర్హులైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. కానీ 2019, అక్టోబర్ వచ్చినా ఇప్పటి వరకు టీఆర్టీ ఎస్జీటీ తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమం పోస్టులను భర్తీ చేయలేదు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మా గోడు వినిపించాలి. వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలి'అని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేశారు. టీఆర్టీ ఎస్జీటీ నియామకాలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం వందలాది మంది అభ్యర్థులు ప్రగతిభవన్‌ను ముట్టడించారు. మహిళా అభ్యర్థులు సైతం పెద్దఎత్తున పాల్గొన్నారు. టీఆర్టీ ఎస్జీటీ నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్‌చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అప్పటికే పోలీసులు భారీగా మోహరించారు. ప్రగతిభవన్ లోపలికి వెళ్లేందుకు అభ్యర్థులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు, అభ్యర్థులకు మధ్య తోపులాట జరిగింది. ప్రభుత్వంతో చర్చలు జరిపిస్తామని ఏసీపీ తిరుపతయ్య స్పష్టమైన హామీ ఇవ్వడంతో స్వచ్ఛందంగా పోలీస్ వాహనాలు ఎక్కారు. హైదరాబాద్‌లోని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒకవేళ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోతే నిరాహార దీక్ష చేపడతామని అభ్యర్థులు హెచ్చరించారు. బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో అభ్యర్థులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో అభ్యర్థులు నిరాహారదీక్ష చేపట్టారు. అంతకుముందు పలువురు అభ్యర్థులు మీడియాతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ తమ జీవితాలతో చెలగాటమాడుతున్నదని విమర్శించారు. టీఆర్టీ ఎస్జీటీ



ఫలితాలను కావాలనే కాలయాపన చేస్తున్నదని అన్నారు. పాత కేసులను సాకుగా చూపి ఫలితాలు ప్రకటించడం లేదన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం గతనెల 30 లోపు ఫలితాలు ప్రకటించాలని చెప్పారు. కోర్టు చెప్పినా ఫలితాలను ఇంతవరకు ప్రకటించలేదని ప్రశ్నించారు. ఫలితాలు విడుదల చేయకపోవడానికి బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీఆర్టీ ఎస్జీటీ తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమం పోస్టుల ఫలితాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం నియామకాల షెడ్యూల్ ప్రకటించాలని అన్నారు. ప్రగతిభవన్ వద్ద రోడ్డుపై బైటాయించిన అభ్యర్థులకు కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు.

**అరెస్టులకు ఉపాధ్యాయ సంఘాల ఖండన**

టీఆర్టీ ఎస్జీటీ నియామకాలు చేపట్టాలని కోరుతూ ప్రగతిభవన్‌ను ముట్టడించిన అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి. టీఆర్టీకి ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ గోడు చెప్పుకుందామని రాష్ట్రం నలుమూలల నుండి హైదరాబాద్‌కు తరలివచ్చిన వెయ్యి మంది అభ్యర్థులను ప్రగతిభవన్ వద్ద పోలీసులు అటకాయించి అరెస్టు చేయటాన్ని ఖండించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వై కొండలరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డి సంజీవరావు బొల్లారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి అరెస్టైన అభ్యర్థులను పరామర్శించారు.

టీఆర్టీ అభ్యర్థులకు వెంటనే నియామకాలు చేపట్టాలని డీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం రఘుశంకర్‌రెడ్డి, టి లింగారెడ్డి, టీఎస్‌పీ టీఏ అధ్యక్షులు షౌకత్‌అలీ, ప్రధాన కార్యదర్శి నాగమోని చెన్నరాములు, టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఈ రఘునందన్, ప్రధాన కార్యదర్శి రమణ, టీడీటీఎఫ్ అధ్యక్షులు ఎస్ రాజేం దర్, ఎస్జీటీయూ అధ్యక్ష కార్యదర్శులు మధుసూదన్‌రావు, మహిపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

**కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి లేఖ**

టీఆర్టీ ఫలితాలు వెలువడి రెండున్నరేండ్లు గడుస్తున్నా...ఇప్పటికీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడం విస్మయానికి గురి చేస్తున్నదని కాంగ్రెస్ ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. వెంటనే టీఆర్టీ నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రగతిభవన్ ముట్టడికి యత్నించిన అభ్యర్థులకు మద్దతు పలికిన ఆయన...ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం నిర్వహించిన టీఆర్టీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. నియామక ఉత్తర్వులు ఎప్పుడిస్తారో, అసలు ఇస్తారో లేదోనని తెలియక వారంతా తీవ్ర మనోవేదనలో ఉన్నట్టు తెలిపారు. ఇంతటి దారుణ నిర్లక్ష్యపు పాలన చరిత్రలో ఎన్నడూ చూడలేదని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వ సోమరితనానికి కచ్చితంగా గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కుతుందని పేర్కొన్నారు. 'స్కూల్ ఎడ్యూకేషన్ క్వాలిటీ ఇండెక్స్' పేరుతో ఇటీవల నీతి అయోగ్ రూపొందించిన నివేదికలో ఆంధ్రప్రదేశ్‌కు నాలుగవ స్థానం దక్కగా...తెలంగాణ రాష్ట్రానికి 14వ స్థానం వచ్చిందని గుర్తు చేశారు. ఉపఎన్నికలు, ఢిల్లీ పర్యటనలపై సీఎంకు ఉన్న ఆసక్తి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంపై లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. వెంటనే టీఆర్టీ అభ్యర్థుల ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వడంపై దృష్టి సారించాలని కోరారు.

**త్వరలోనే టీఆర్టీ సమస్యకు పరిష్కారం**
**విద్యామంత్రి సబితా ఇంద్రారెడ్డి**

త్వరలోనే టీఆర్టీ సమస్యకు పరిష్కారం చూపుతామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. టీఆర్టీ ఎస్జీటీ ఫలితాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది అభ్యర్థులు ప్రగతిభవన్‌ను ముట్టడించిన నేపథ్యంలో సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. టీఆర్టీ అభ్యర్థుల ఎంపిక జాబితాను త్వరలోనే విడుదల చేస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం చర్యలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ అధికారులతో ఆమె సంప్రదించారు. దీర్ఘకాలికంగా ఉన్న టీఆర్టీ సమస్య కోర్టులో పరిష్కారం అయినందున సరైన జాబితాను అందజేయాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించారు.

# వారిద్దరితో కేసీఆర్ ఏకాంత మంతనాలు

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శుక్రవారం ఢిల్లీలో చేపట్టిన హస్తిన పర్యటన ఆసాంతం బిజీబిజీగా సాగింది. ఒక రోజు ముందుగానే ఢిల్లీ చేరుకున్న సీఎం కేసీఆర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులను కలవడంలో తలమునకల య్యారు. రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత మోడీని కేసీఆర్ మొదటిసారి కలుస్తుండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ నేపథ్యంలో ఆయన మోడీ, అమిత్ షాలతో ఏకాంతంగా జరిపిన మంతనాలు చర్చనీయాంశ మవుతున్నాయి. కేసీఆర్ వారివురితో రహస్యంగా జరిపిన చర్చల్లో రాజకీయ సంబంధిత అంశాలున్నాయా? లేక రాష్ట్ర సంబంధిత అంశాలున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. పైన ఘర్షణ పూరిత వాతావరణం ఉన్నా లోలోపల ఆ రెండు పార్టీలు తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నాయని చెప్పడానికి ఇదే తార్కాణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కాగా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఎంపీలు నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాములు, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్, కేశవరావు, పసునూరి దయాకర్, సీఎంఓ ప్రత్యేక సలహాదారు రాజీవ్ శర్మలతో కలిసి సీఎం సమావేశమయ్యారు. మొత్తానికి ప్రధాని, హౌంశాఖ మంత్రులను ఏకాంతంగా కలిసి రాజ్‌నాథ్‌తో మాత్రం సమిష్టిగా కలవడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

**కీలక అంశాల విస్మరణ**

ముఖ్యమంత్రి తన ఢిల్లీ పర్యటనలో కీలక అంశాలను విస్మరించినట్టు తెలిసింది. ముందుగా ఆ పార్టీ నాయకులు చెప్పిన దాని ప్రకారం... గోదావరి-కష్ణా నదుల అనుసంధానంపై ప్రధానితో చర్చిస్తారని సమాచారం. ఇప్పటికే ఈ అంశంపై రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య రెండు దఫాలుగా చర్చలు జరిగిన విషయం విదితమే. రెండు జీవనదుల అనుసంధానం జరిగితే తెలంగాణ, ఏపీల్లోని బీడు భూములన్నింటికీ సాగునీరు అందించే అవకాశం ఉందని... ఇది తెలంగాణకి అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా అభివర్ణించిన టీఆర్ఎస్ సర్కారు చివరిగా ప్రధాని ముందుకు తీసుకు రాలేకపోయింది. ప్రధానిమంత్రికి సీఎం కేసీఆర్ ఇచ్చిన విజ్ఞాపన పత్రంలో ఈ కీలక అంశాన్ని విస్మరించింది. సీఎం కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా పక్కనబెట్టారా? లేక మోడీ సూచనతో డిమాండ్ల పత్రంలో నుంచి తీసివేశారా? అన్న మీమాంస నెలకొంది. డిమాండ్లకి సంబంధించిన పాయింట్లను మాత్రమే మీడియాకి విడుదల చేసి, ప్రధానికిచ్చిన విజ్ఞాపన పత్రాన్ని సైతం విడుదల చేయకపోవడం గమనార్హం.

**యురేనియం తవ్వకాలపై అసెంబ్లీ తీర్మానం..**

నల్లమల అడవుల్లో కేంద్రం ప్రభుత్వం చేపడుతున్న యురేనియం తవ్వకాలపై తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని సీఎం కేసీఆర్ ప్రధాని దృష్టికి తీసుకెళ్లలేదు. యురేనియం తవ్వకాలపై రాష్ట్రంలో సామాజిక సంఘాలు, ప్రజా సంఘాలు, యువత నుంచి తీవ్రత వ్యక్తమైన విషయం తెలిసిందే. అయితే, దీనిపై కేంద్ర ప్రభుత్వం శోధన పేరిట జరుపున్న సర్వే చర్యలను నిలిపివేయాలని ఆయన పీఎం దృష్టికి తీసుకురాకపోవడం గమనార్హం. అమిత్ షాతో భేటీలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది.

**రక్షణ శాఖ స్థలాలు రాష్ట్రానికి**
**బదలాయించడం అనివార్యం**

రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీలో రక్షణ శాఖ భూములపై చర్చ జరిగినట్టు తెలిసింది. కంటోన్మెంట్ ఏరియాలోని రక్షణ శాఖ స్థలాలను రాష్ట్రానికి బదలాయించాలని కేసీఆర్ కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాజీవ్ రహదారి విస్తరణకు కంటోన్మెంట్ భూముల అప్పగింతపై గతంలో సూత్రప్రాయంగా అంగీకారం కుదిరినా అధికారికంగా ఆమోదం పొందాల్సిన అవసరం ఉంది.

# 22 అంశాలు.. 50 నిమిషాలు

(మొదటిపేజీ తరువాయి)

ముందు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతోనూ ఆయన భేటీ కావటం గమనార్హం. తన రెండు రోజుల ఢిల్లీ పర్యటనను ముగించుకున్న సీఎం.. శుక్రవారం రాత్రికి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

**ప్రధానికి సమర్పించిన వినతులివే...**

- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం యేటా రూ.450 కోట్లు కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంది. గత ఐదేండ్లలో నాలుగు సార్లు విడుదలైనప్పటికీ, ఒక యేడాదికి సంబంధించిన నిధులను ఇంకా విడుదల చేయలేదు. వాటిని వెంటనే విడుదల చేయాలి.
- జాతీయ రహదారుల సంస్థ (నేషనల్ హైవేస్ అథారిటీ) సహకారంతో ఆదిలాబాద్ జిల్లాలో సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశ్రమను పునరుద్ధరించాలి.
- తెలంగాణ హైకోర్టులో జడ్జీల సంఖ్యను 24 నుంచి 42కు పెంచాలి.
- తెలంగాణలో ఐఐఎమ్‌ను నెలకొల్పాలి.
- తెలంగాణాకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) మంజూరు చేయాలి.
- హైదరాబాద్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)ని ఏర్పాటు చేయాలి. ఇక్కడ నెలకొల్పాలని ప్రతిపాదించిన ఎన్ఐడీని రాష్ట్ర పునర్విభజన తర్వాత విశాఖపట్నానికి తరలించారు.
- అన్ని జిల్లాల్లో నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయం మేరకు తెలంగాణలో మరో 23 నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలి. రైల్వే పనులకు అవసరమైన నిధులను విడుదల చేయాలి.
- నిటి అయోగ్ సిఫారసులకు అనుగుణంగా మిషన్ కాకతీయ పథకానికి రూ.5 వేల కోట్లు, మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు విడుదల చేయాలి.
- బయ్యారంలో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి.
- జహీరాబాద్ నిమ్జ్‌కు నిధులను విడుదల చేయాలి.
- తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసిన మేరకు... రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణను చేపట్టాలి.
- పీపీపీ పద్ధతిలో కరీంనగర్‌లో ఐఐఐటి నెలకొల్పాలి.
- తెలంగాణలో రిజర్వేషన్లను పెంచాలి. ముస్లింలలోని వెనుకబడిన కులాలకు 12 శాతం రిజర్వేషన్లతో కలిపి బీసీలకు మొత్తం 37 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం, రిజర్వేషన్లను కల్పించాలి.
- పార్లమెంటుతోపాటు అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించాలి. ఈ విషయంపై ఇప్పటికే తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది.
- హైదరాబాద్-నాగపూర్, వరంగల్-హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలి.
- వెనుకబడిన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కోసం పీఎమ్‌జీఎస్‌వై ద్వారా రూ.4 వేల కోట్లు కేటాయించాలి.
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టే రహదారుల పనులకు 60:40 నిష్పత్తిలో కాకుండా, వందశాతం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించాలి.
- సెంట్రల్ యూనివర్సిటీ తరహాలో పూర్తి కేంద్ర ఖర్చుతో వరంగల్‌లో గిరిజన యూనివర్సిటీని నెలకొల్పాలి
- వరంగల్ టెక్స్‌టైల్ పార్కు కోసం వెయ్యి కోట్ల రూపాయలను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా అందించాలి.
- రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలి.
- వరద కాలువకు సవరించిన అంచనాల ప్రకారం నిధులను విడుదల చేయాలి.
- 'యురేనియం' ప్రస్తావనేది...?
- రాష్ట్రంలో ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశమైన యురేనియం తవ్వకాల గురించి ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రధాని మోడీ వద్ద ప్రస్తావించకపోవటం గమనార్హం. నల్లమల అడవుల్లో యురేనియం తవ్వకాలను చేపట్టేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిన సంగతి విదితమే. ఇలాంటి చర్యలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీ కూడా ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ అంశంపై అవసరమైతే అందరమూ కలిసి కేంద్రంపై కొట్లాడుదామంటూ శాసనసభలో వ్యాఖ్యానించిన కేసీఆర్.. అవసరమైన సమయంలో మాత్రం ప్రధాని వద్ద ప్రస్తావించకుండా మిన్నకుండిపోయారు. మోడీకి ఆయన సమర్పించిన వినతుల్లో యురేనియం గురించి ఒక్క ముక్కా లేకపోవటం గమనార్హం.

# బస్సులు బంద్

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేశారు. ఆ కాపీని అన్ని డిపోల్లోని నోటీసు బోర్డుల్లో పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. చర్చలు విఫలం కాగానే ఐఏఎస్‌ల త్రిసభ్య కమిటీ చైర్మెన్ సోమేష్‌కుమార్, సభ్యులు రామకృష్ణారెడ్డి, సునీల్‌శర్మ విలేకరులతో మాటా ్డారు. దసరా సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆర్టీసీలోని 2,250 అద్దె బస్సుల్ని నడుపుతామని, స్కూల్ బస్సులతో పాటు అన్ని ప్రయివేటు వాహనాలకూ స్టేజీ క్యారియర్లుగా కేవలం రూ.100 కే అనుమతులు ఇస్తామని చెప్పారు. ఓలా, ఉబర్ సంస్థల ద్వారా కూడా ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే అన్ని డిపోల్లోనూ తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను రిక్రూట్ చేసుకుంటామని, రిటైర్డ్ ఉద్యోగులు, మెకానిక్‌ల సేవల్ని వినియోగించుకుంటామని చెప్పారు. అసవరమైతే పొరుగు రాష్ట్రాల నుంచి డ్రైవర్లు, సిబ్బందిని తెప్పిస్తామని, సమ్మెను విరమించుకుంటే కార్మికులకే మంచిదని చెప్పారు.

**స్ఫూర్తిదాయకంగా సమ్మె**

ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలు స్పష్టంచేశారు. జేఏసీ కన్వీనర్ ఈ అశ్వత్థామరెడ్డి, కో కన్వీనర్ థామస్‌రెడ్డి, తిరుపతి (టీఎమ్‌యూ), కో కన్వీనర్ కే రాజిరెడ్డి, ఎస్ బాబు (ఎంప్లాయిస్ యూనియన్), కో కన్వీనర్ వీఎస్ రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఓ సుధ (సూపర్‌వైజర్స్ అసోసియేషన్) మీడియాతో మాట్లాడారు. ఇలాంటి హెచ్చరికలు ఆర్టీసీ కార్మికులకు కొత్తేం కాదన్నారు. కార్మికశక్తి సత్తాను చాటేలా స్ఫూర్తిదాయకంగా సమ్మెలోకి వెళుతున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరో సకల జనుల సమ్మె తరహాలో ఈ ఆందోళన రూపుదిద్దుకోనుందని స్పష్టంచేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె కేవలం జీతాల కోసం కాదని, సంస్థ పరిరక్షణ, ప్రజా సంక్షేమం కోసమని చెప్పారు. 'ఎస్మా'ను ప్రయోగిస్తామని ప్రభుత్వం చేస్తున్న హెచ్చరికలకు తాము భయపడబోమని అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె సమయంలో తాత్కాలిక ఉద్యోగాల కోసం వస్తున్న నిరుద్యోగులు పరిస్థితుల్ని అర్థం చేసుకోవాలని, ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సమ్మెలో ఆర్టీసీలోని 50వేల మంది కార్మికులు పాల్గొంటారని తెలిపారు. టీఎస్‌ఆర్టీసీ జేఏసీ-1 కూడా సమ్మెలోకి వెళ్తున్నట్టు ప్రకటించింది. ఆ జేఏసీ కన్వీనర్ కె హన్మంతు ఇతర యూనియన్ నేతలతో కలిసి శుక్రవారం ఎర్రమంజిల్‌లో ఐఏఎస్ అధికారుల త్రిసభ్య కమిటీని కలిసి, సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వారినుంచి ఎలాంటి సానుకూల స్పందన లేనందున తాము కూడా సమ్మెలోకి వెళ్తున్నామని ప్రకటించారు.

**ప్రయాణీకుల హైరానా**

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ప్రయాణీకులు హైరానా పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేశామని ప్రకటించినా వాటిని వినియోగించుకొనేందుకు ప్రయాణీకుల సంశయిస్తున్నారు. అనుభవం లేని డ్రైవర్ల వల్ల ఏవైనా ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. ముందస్తుగా రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణీకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాము ఏ స్కూల్‌బస్సులో గమ్యానికి చేరాల్సి వస్తుందోననే ఆందోళన చెందుతున్నారు.

**తహసీల్దార్లకు బాధ్యతలు**

ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో తహసీల్దార్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ హైదరాబాద్ ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రవాణా ఏర్పాట్ల పర్యవేక్షణ, వాహనాల లభ్యత, టైం టేబుళ్ల పరిశీలన వంటి పనులు వారు చేయాల్సి ఉంటుంది. అలాగే ఆర్టీసీ నడిపే వాహనాలకు బందోబస్తు బాధ్యతల్ని కూడా వీరే నిర్వర్తించాలి. స్థానిక మెజిస్టీరియల్ అధికారాలు ఉన్నందున వారికి ఈ బాధ్యతలు అప్పగించారు.

**సమస్యలు పరిష్కరించాలి : టీఎస్‌యూటీఎఫ్**

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన



కార్యదర్శి చావ రవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్న నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమ్మె నోటీసు ఇచ్చినా చర్చలు జరిపి పరిష్కరించాలనే ఆలోచన లేకుండా నియంతృత్వంగా అణచివేయాలనే ఆలోచన చేయటం, ఎస్మా ప్రయోగిస్తామని, ఉద్యోగులను తొలగిస్తామని, పోటీ ఉద్యోగులతో బస్సులు నడిపిస్తామని బెదిరించటాన్ని తీవ్రంగా ఖండించారు. ఆర్టీసీ సమ్మె అనివార్యమైన పక్షంలో కార్మికులకు మద్దతుగా ఉపాధ్యాయులూ ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొంటారని తెలిపారు.

**ఆర్టీసీ సమ్మెకు టీపీటీఎఫ్ మద్దతు**

ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమ్మెకు టీపీటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీపీటీఎఫ్ అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దసరా పండుగ సమయంలో ప్రజల ప్రయాణాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు ఇస్తున్నామని టీటీఎఫ్ అధ్యక్షులు ఈ రఘునందన్, టీడీటీఎఫ్ అధ్యక్షులు ఎస్ రాజేందర్ పేర్కొన్నారు.

**సమ్మె తగదు-ఐఏఎస్‌ల త్రిసభ్య కమిటీ**

ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన విరమించుకోవాలని సీనియర్ ఐఏఎస్ అధికారుతో కూడిన త్రిసభ్య కమిటీ విజ్ఞప్తి చేసింది. టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలతో చర్చలు విఫలం అయిన అనంతరం త్రిసభ్య కమిటీ చైర్మెన్ సోమేష్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారెడ్డి, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి, టీఎస్‌ఆర్టీసీ ఇంఛార్జ్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌శర్మ విలేకరులతో మాట్లాడారు. సమ్మె విరమణకు తాము ఎన్నిరకాలుగా విజ్ఞప్తులు చేసినా జేఏసీ నేతలు మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. సమ్మెచేస్తే కార్మికులకే నష్టమని చెప్పేందుకు తాము ప్రయత్నించామన్నారు. ఉమ్మడి ఏపీఎస్‌ఆర్టీసీ ఐదేండ్లలో రూ.1,695 కోట్ల నిధుల్ని కేటాయిస్తే, తాము నాలుగేండ్లలో రూ.3,303 కోట్లు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ముకంటే అదనంగా ఇచ్చిందన్నారు. గడచిన రెండేండ్లలోనే కొన్ని నిధులు తగ్గాయని, అంతకుముందు ఇచ్చిన నిధులతో లాభాలు రానందున పునఃస్సమీక్షించేందుకే నిధుల్ని తగ్గించాల్సి వచ్చిందని వివరించారు. పండుగ సమయంలో సమ్మెచేస్తే ప్రజల నుంచి కార్మికులకు వ్యతిరేకత వస్తుందని, సంస్థ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. సమ్మె కాలంలో పనిచేయడానికి వచ్చేవారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంశంపై తాము అధ్యయనం చేయాల్సి ఉందని, దానికోసం 30 రోజులు, ప్రభుత్వ నిర్ణయం కోసం మరో రెండువారాలు గడువుకావాలని జేఏసీని కోరామని, వారు రాతపూర్వకంగా ఇమ్మని డిమాండ్ చేయడం సరికాదన్నారు.

**ఆర్టీసీపై కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు : లక్ష్మణ్**

ఆర్టీసీ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసి చేతులు దులుపుకున్నదనీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె.లక్ష్మణ్ విమర్శించారు. సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా, పీడీ యాక్టుల పేరుతో ఆర్టీసీ కార్మికులను వేధించడం సరిగాదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి ఇవ్వాల్సిన నిధులను సరిగా ఇవ్వకుండా అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించారు.

**సమ్మెపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి: జాజుల**

టీఆర్టీసీ సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సమ్మెపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. పండుగను దృష్టిలో ఉంచుకుని కార్మికులు సమ్మెకు పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

## లెక్చరర్ల సంఘం నేత అక్రమాస్తులు కోట్లలోనే

(మొదటిపేజీ తరువాయి)

జె.పూర్ణచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఎకనామిక్ జూనియర్ కాలేజీ సరూర్‌నగర్‌లో జూనియర్ లెక్చరర్, రాష్ట్ర జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు కూడా అయిన మధుసూదన్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడి ఆదాయానికి మించి కోట్ల రూపాయల ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీకి సమాచారం అందింది. దీంతో డీజీ ఆదేశాల మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఏపీలోని కర్నూలు జిల్లాల్లో మధుసూదన్‌రెడ్డి ఆస్తులపై శుక్రవారం ఏక కాలంలో సోదాలు చేశారు. ఇంటర్మీడియెట్ బోర్డు ఎదుట ఉన్న ఆయన కార్యాలయం, మూసారాబాద్ లోని ఒక ఇల్లు, అపార్ట్‌మెంట్ లోని ఫ్లాట్‌లపై దాడులను నిర్వహించారు. ఇల్లు, ఫ్లాట్ కలిపి దాదాపు రెండు కోట్ల రూపాయల వరకు ఉంటాయని అంచనా వేశారు. అలాగే ఇంటిలో విలువైన బంగారు నగలు, గృహోపకరణ వస్తువులు, వాహనాలు కలిపి లక్షల్లోనే ఉనాయని ఏసీబీ వర్గాలు తెలిపాయి. అలాగే హయత్‌నగర్‌లో మరో రెండు ఇంటి ప్లాట్లు, నార్సింగ్‌లో ఇతర స్నేహితులతో కలిసి తీసుకున్న మూడెకరాల భూమి కూడా ఉన్నట్టు ఏసీబీ దాడుల్లో బయటపడింది. మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్, కర్నూలులోనూ భూములున్నట్టు కనుగొన్నారు. ఈ ఆస్తులు తన పేరిట, కుటుంబసభ్యులు, స్నేహితులతో పాటు మరి కొంత మంది బినామీల పేర్లతో ఉన్నట్టు ఏసీబీ అధికారులు తేల్చారు. వాటికి సంబంధించిన విలువను ఇంకా మదింపు చేస్తున్నామని ఏసీబీ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం తేలిన ఆస్తుల విలువ మూడు కోట్ల రూపాయలకు పైనే ఉంటుందని, వాటి మార్కెట్ విలువ దీనికి రెండింతలు ఉంటుందన్నారు. మిగతా ఆస్తుల వివరాలను కూడా కలిపితే విలువ మరి కొన్ని కోట్లు పెరుగుతుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే మధుసూదన్‌రెడ్డిపై ఏసీబీ దాడులు జరపడానికి సర్కారులోని కొందరు పెద్దల ఆదేశాలు కారణమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వారితో మధుసూదన్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉండేవనీ, ఎక్కడో బెడిసికొట్టడంతోనే ఈ చర్యలు ప్రారంభమయ్యాయని జూనియర్ లెక్చరర్ వర్గాలు అనుమానిస్తున్నాయి. కాగా తాను ఎలాంటి అక్రమాలకూ పాల్పడలేదనీ, తాను ఏది ఖర్చు చేసినా వాటికి లెక్కలు ఉన్నాయని ఏసీబీ అధికారులకు రెడ్డి చెబుతున్నట్టు తెలిసింది.

**మధుసూదన్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు**

ఇంటర్ విద్యా జేఏసీ చైర్మెన్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ) అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలకు సంబంధించి పలువురు (పేరు చెప్పడానికి ఇష్టపడనివారు) రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసిన 1,250 మంది 2018-19లో రెన్యూవల్ చేయిస్తానని ప్రలోభపెట్టి ఒక్కొక్కరి నెలజీతం సుమారు రూ.21 వేల చొప్పున మొత్తం రూ.2.62 కోట్లకు ఒప్పందం కుదిరిందని తెలిపారు. ప్రిన్సిపాల్స్, డీఐఈవో/నోడల్ అధికారులకు పదోన్నతి కల్పిస్తామని రూ.లక్షల్లో వసూలు చేశారని పేర్కొన్నారు. 2007 ఇంటర్ వార్షిక పరీక్ష పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీలో మొదటి ముద్దాయిగా ఉన్నారని, సీబీసీఐడీలో కేసుందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లకు ప్రధానోపాధ్యాయులుగా, డిగ్రీ అధ్యాపకులుగా పదోన్నతులు ఇప్పించడానికి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఇంటర్మీడియెట్ బోర్డులో ఆయన అనుచరులకు డిప్యూటీ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీలుగా డిప్యూటేషన్ ఇప్పించారని పేర్కొన్నారు. సంఘ అధ్యక్షునికి వాహనం కొనుగోలుకు రూ.లక్షల్లో వసూలు చేశారని తెలిపారు. పది శాతతం బోధనేతర సిబ్బంది నుంచి అధ్యాపకులుగా పదోన్నతి పొందుటకు డబ్బులు వసూలు చేశారని పేర్కొన్నారు. బోధనేతర సిబ్బంది నుంచి లైబ్రరియన్లుగా పదోన్నతికి డబ్బులు తీసుకున్నారని తెలిపారు. 2018, డిసెంబర్ 31న అదర్ డ్యూటీ (ఓడీ) సౌకర్యం పూర్తయినా కళాశాల విధుల్లో చేరకుండా అవినీతి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అతనికి తగిన శిక్ష విధించాలని కోరారు. హైకోర్టు న్యాయమూర్తులు ఈ అవినీతి అంశాలపై సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని సూచించారు.

## ఆర్థిక పరిస్థితులు దారుణం

(మొదటిపేజీ తరువాయి)

రూ. మూడు వేలకు పెంచాలని అన్నారు.

దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ అమలుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఏచూరి విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా అస్సాంలో చేపట్టిన ఎన్ఆర్సీని బీజేపీ నాయకత్వం కమ్యూనల్ పోలరైజ్ చేసేందుకు యత్నిస్తుందన్నారు. ఎన్ఆర్సీ అమలుపై హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటనలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు. కేంద్రం నేషనల్ పాపులస్ రిజిస్టర్(ఎన్‌పీఆర్)ను ప్రవేశపెట్టేందుకు కూడా కేంద్రం సమాయత్తం అవుతుందని, దీని ఆధారంగా తమకు వ్యతిరేకంగా ఉన్నటువంటి ఓట్లను తొలగించే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ఈ చర్యలకు కేంద్రం చరమగీతం పాడి, దిగజారిపోతున్న ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టాలని కోరారు. జమ్మూ కాశ్మీర్‌లో పరిస్థితి ఇంకా దారుణంగానే ఉన్నదని ఏచూరి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్టు సవ్యంగా ఎంతమాత్రం లేదన్నారు. రాష్ట్రమంతా నిర్బంధంలో ఉండగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించ తలపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మొత్తంగా నిర్బంధం ఎత్తివేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరిస్థితి అంతా సవ్యంగా ఉంటే... తమ పార్టీ నేత తరిగామిని ఎందుకు కేంద్ర కమిటీ సమావేశాలకు హాజరు కానివ్వ లేదని ప్రశ్నించారు. త్వరలో జరగనున్న మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో లౌకిక, ప్రజాస్వామ్య, సామాజిక శక్తులను ఏకం చేస్తామన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్‌బ్యాంకును సంఘటిత పరుస్తామని తెలిపారు. కేరళలో పాలం సీటు ఎల్‌డీఎఫ్ గెలుపొందడంపై కేంద్ర కమిటీ ఆ రాష్ట్ర కమిటీని అభినందించింది.

**కలకత్తా ప్లీనంపై సుదీర్ఘ చర్చ**

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాల్లో కలకత్తా పార్టీ ప్లీనం తీర్మానాలపై చర్చించినట్టు ఏచూరి తెలిపారు. తాము తీర్మానించుకున్న అంశాలు క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందుల కారణంగా అమలు సాధ్యం కాలేదని కేంద్ర కమిటీ అభిప్రాయపడినట్టు చెప్పారు. భవిష్యత్‌లో పార్టీ అవలంబించాల్సిన పంథాపై కూడా మంతనాలు సాగించినట్టు వెల్లడించారు.

## విధుల్లో చేరకుంటే.. ఉద్యోగం వదులుకున్నట్టే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అన్ని ఆర్టీసీ డిపోల్లో శనివారం సాయంత్రం ఆరు గంటల లోపు రిపోర్టు చేసిన వారిని మాత్రమే ఇకపై ఆర్టీసీ ఉద్యోగులుగా గుర్తించాలనీ, ఆ సమయంలోగా విధుల్లో చేరని వారిని తమంతట తాముగా ఉద్యోగాలు వదిలిపెట్టిన వారిగా గుర్తించాలనీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు తేల్చిచెప్పారు. విధుల్లో చేరి, బాధ్యతలు నిర్వర్తిస్తున్న కార్మికులకు పూర్తి స్థాయిలో రక్షణ, ఉద్యోగ భద్రత కల్పిస్తామనీ, విధుల్లో చేరని వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి ఉద్యోగంలో చేర్చుకోబోమని విధాన నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కార్మిక సంఘాల నాయకులతో ఎలాంటి చర్చలు జరపబోమనీ, కార్మికులతో చర్చల కోసం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటిని కూడా రద్దు చేస్తున్నామని ప్రకటించారు. ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ సుల్తానియాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసీ సమ్మె విషయంలో కఠినంగానే వ్యవహరించనున్నట్టు ప్రకటించారు.

ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్‌లో ఆర్టీసీ సమ్మెపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులతో జరిగిన చర్చల వివరాలను సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీ సీఎం కేసీఆర్‌కు నివేదించింది. కార్మికుల డిమాండ్లను పరిశీలించి, పరిష్కరించడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందనే విషయాన్ని తెలిపినప్పటికీ కార్మిక సంఘాల నాయకులు సమ్మె కొనసాగించడానికే నిర్ణయించుకున్నట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టీసీ పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో, దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా వచ్చే ఆదాయం ఎంతో కొంత ఉపయోగపడుతుందనీ, ఈ సమయంలోనే ఆర్టీసీకి నష్టం తెచ్చే విధంగా యూనియన్లు సమ్మెకు పిలుపునివ్వడం పట్ల సీఎం తన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఆర్టీసీలో సమ్మెను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందనీ, దీన్ని ఉల్లంఘించి సమ్మె చేయడం చట్ట విరుద్ధమని అధికారులు అభిప్రాయపడ్డారు. చట్ట వ్యతిరేకంగా సమ్మె చేస్తే కార్మికులను ఉద్యోగంలోంచి తొలగించే అధికారం సంస్థకు ఉందని చెప్పారు. కార్మికుల డిమాండ్లపై ఇకపై ఎలాంటి చర్చలు ఉండవని స్పష్టం చేశారు. ఆర్టీసీలో పదివేల బస్సులు నడుస్తున్నాయనీ, ఇందులో 2100 బస్సులు ఆర్టీసీ అద్దెకు తీసుకున్న బస్సులని అధికారులు చెప్పారు. మరో ఐదు వేల మంది తాత్కాలిక డ్రైవర్లుగా చేయడానికి ముందుకు వచ్చారన్నారు. దీంతో 7వేలకు పైగా బస్సులు నడపడం సాధ్యమతుందని చెప్పారు. ఆర్టీసీలో మైలేజ్ అయిపోయిన 2,600 బస్సుల స్థానంలో అద్దె బస్సులు తీసుకోవాలనీ, శనివారమే ఇందుకోసమే నోటిఫికేషన్ జారీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

సెన్సెక్స్ ▼433
37,673

నిఫ్టీ ▼139
11,174

## భారత మార్కెట్లోకి 'బెనెల్లీ లియోన్‌సినో'



**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** ఇటలీకి చెందిన ప్రముఖ ప్రీమియర్ బైక్‌ల తయారీ సంస్థ బెనెల్లీ భారత మార్కెట్లోకి మరో సరికొత్త బైక్‌ను ఆవిష్కరించింది. యువత అభిరుచులకు తగ్గట్టుగా సంస్థ 'బెనెల్లీ లియోన్‌సినో-250' పేరుతో కొత్తబైక్‌ను మార్కెట్లో అందుబాటులోకి తెచ్చింది. దీని ధరను రూ.2.5 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్, ఇండియా) నిర్ణయించారు. బెనెల్లీ లియోన్‌సినో-250 వాహనను 249 సీసీ సామర్థ్యం కలిగిన 4-వాల్వ్ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చారు. ఈ బైక్‌ను 6 స్పీడ్ల గేర్‌బాక్స్‌తో రూపొందించారు. ఈ బైక్ బుడిద, తెలుపు, ఎరుపు, బ్రైన్ రంగులలో లభించనుంది. ఈ బైక్‌పై ఆదీశ్వర్ ఆటోరైడ్ సంస్థ మూడేండ్ల అపరిమిత వారెంటీని అందించనుంది. ఈ బైక్‌ను కేవలం రూ.6000లను మాత్రమే చెల్లించి ఇండియా.బెనెల్లీ సైట్‌లో బుక్ చేసుకోవచ్చని.. బైక్ డెలివరీలు వచ్చే దివాళీ నుంచి మొదలవుతాయని బెనెల్లీ ఇండియా సంస్థ ఎండీ శ్రీవికాస్ జబక్ తెలిపారు. ఈ బైక్ ఆవిష్కరణతో తాము భారత మార్కెట్లోకి అందుబాటు ధరల్లో లభించే సూపర్ బైక్‌ల మార్కెట్లోకి బెనెల్లీని తీసుకువచ్చినట్టయిందని తెలిపారు. ఈ బైక్‌లను యువత మనసును చూరగొనేలా అధునాతన హంగులతో అందుబాటులోకి తెచ్చినట్టుగా ఆయన వివరించారు. త్వరలోనే బెనెల్లీ నుంచి రూ.2.0 లక్షల ధరల శ్రేణిలో మరో బైక్‌ను కూడా మార్కెట్లోకి తేనున్నట్టుగా ఆయన వివరించారు. ఈ బైక్‌లను భారత్‌లో మహవీర్ గ్రూపు ఆదీశ్వర్ ఆటోరైడ్ ఇండియా హైదరాబాదు శివారులోని గుండ్లపోచంపల్లిలో కూర్పు చేస్తూ మార్కెటింగ్ చేస్తోంది.

## కార్డ్‌లెస్ పవర్‌టూల్స్‌కు ఆదరణ: బాష్



**న్యూఢిల్లీ:** నిర్మాణ రంగం, పరిశ్రమలలో పని చేసే వారికి పవర్ టూల్స్ అందిస్తోన్న బాష్ కంపెనీ తాజాగా వినూత్న ఉత్పత్తులను మార్కెట్లోకి తెచ్చింది. వివిధ రకాల వృత్తుల వారికి ఉపయుక్తంగా ఉండేలా సంస్థ విద్యుత్తు తంత్రిలేని (కార్డ్‌లెస్) పవర్‌టూల్స్‌ను మార్కెట్లోకి తీసుకు వచ్చింది. పనివారి సౌలభ్యార్థం వీటిని మార్కెట్లోకి తెచ్చినట్టుగా బాష్ రీజినల్ బిజినెస్ డైరెక్టర్ పి.కె.పనీశ్ తెలిపారు. చెక్కపని, మెటల్‌వర్క్ చేసే వారికి, నిర్మాణ రంగంలో పని చేసే వారికి కార్డ్‌లెస్ ఉపకరణాల వల్ల అనేక రకాలుగా మేలు జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ ఉపకరణాలపై అవగాహన కల్పించేందుకు గాను తాము మొబైల్ వ్యాన్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టుగా ఆయన తెలిపారు. 'కార్డ్‌లెస్ మత్‌లబ్ బాష్' పేరిట సెప్టెంబరు మాసంలో ప్రారంభమైన ఈ మొబైల్ ప్రచార కార్యక్రమం ఆరు నెలల పాటు దేశ వ్యాప్తంగా వివిధ పెద్ద 40 ప్రధాన పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లనుందని అన్నారు. నిరక్ష్యరాస్యులైన, పేద కార్మికులకు కూడా అవగాహన కల్పించేలా వాటిని ప్రదర్శించి చూపేందుకు గాను తాము ఈ వ్యాన్‌లలో తగిన ఏర్పాట్లు చేసినట్టుగా ఆయన తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల వారికి ఈ ఉపకరణాల పనితీరును వివరించి చెప్పేలా ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నట్టుగా తెలిపారు. కార్డ్‌లెస్ ఉపకరణాలను గతంలో విద్యుత్తు తంత్రితో కూడిన ఉపకరణాల సైజ్‌లోనే అందుబాటులోకి తెచ్చినట్టుగా ఆయన వివరించారు.

# ఐదో సారి వడ్డీరేట్ల తగ్గింపు

- దేశ వృద్ధి అంచనాలకు మరింత తగ్గింపు
- వృద్ధి 6.1 శాతమేనన్న పెద్ద బ్యాంక్
- కుప్పకూలిన స్టాక్ మార్కెట్
- బోరుమన్న మదుపర్లు

**న్యూఢిల్లీ:** ఊహించినట్టుగానే భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి తగ్గించింది. ఆర్థిక వ్యవస్థలో మందగమన పరిస్థితుల నేపథ్యంలో ఎకానమీకి ఊతం ఇచ్చేలా పెద్ద బ్యాంక్ రెపో రేటకు 25 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. కీలక వడ్డీరేటును ఆర్బీఐ తగ్గించడం ఇది వరుసగా అయిదోసారి తగ్గించింది. దీంతో ప్రస్తుతం 5.40 శాతంగా ఉన్న రెపో రేటు 5.15 శాతానికి దిగి రానుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) కీలక వడ్డీరేట్ల కోతకు నిర్ణయం తీసుకుందని ఆర్బీఐ తెలిపింది. మూడు రోజుల పాటు జరిగిన ఎంపీసీ భేటీ శుక్రవారంతో ముగిసింది. ఆర్బీఐ తాజా నిర్ణయంతో ప్రస్తుత ఏడాదిలో వరుసగా ఐదు సమావేశాలలో రెపో రేటును 135 బేసిస్ పాయింట్లు తగ్గించినట్టయింది. ఫలితంగా ప్రస్తుతం రెపో రేటు 5.15 శాతానికి చేరుకుంది. దీంతో 2010 మార్చి తర్వాత రెపో ఇంత కనిష్ట స్థాయికి చేరడం ఇదే తొలిసారి. దీంతో గృహ, వాహన, వ్యాపార రుణాలు చౌక కానున్నాయి. రివర్స్ రెపో రేటును కూడా 4.9 శాతానికి తగ్గించారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉందని, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఎంపీసీ వ్యవహరిస్తుందని ఆర్బీ పాలసీ కమిటీ తెలిపింది.

**మన బ్యాంకింగ్ వ్యవస్థ భద్రం**

భారత బ్యాంకింగ్ వ్యవస్థ భద్రంగా ఉందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పునరుద్ఘాటించారు. దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలోని పలు బ్యాంకులు మరీ ముఖ్యంగా సహకార బ్యాంకులు కుంభకోణాల్లో ఇరుక్కున్నాయని.. రానున్న రోజుల్లో ఇవి ఒక్కొక్కటిగా వెలుగులోకి రానున్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆర్బీఐ అధినేత ఖండించారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థ భద్రంగా, స్థిరంగా ఉందని ఆయన అన్నారు. పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార (పీఎంసీ) బ్యాంక్ కుంభకోణం విషయమై ఆర్బీఐ తీసుకున్న చర్యలను ఆయన మరోసారి సమర్థించుకున్నారు. దేశంలోని అన్ని బ్యాంకులను పీఎంసీ బ్యాంక్ మాదిరిగా పోల్చిచూడడం తగదని ఆయన అన్నారు.

**డివిడెండ్ కోరిన సంగతి తెలియదు**

రెవెన్యూ లోటు భర్తీకి రూ.30వేల కోట్లు మధ్యంతర డివిడెండ్‌ను కేంద్రం ఆర్‌బీఐని కోరవచ్చని వస్తున్న వార్తలపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పందించారు. తాను కూడా ఈ విషయాన్ని మీడియాలోనే చూశానని



వ్యాఖ్యానించారు. డివిడెండ్ కోరుతూ ప్రభుత్వం నుంచి ఎలాంటి డిమాండ్ వచ్చినట్లు తనకైతె తెలీదన్నారు. నాలుగో ద్రవ్య పరపతి విధాన సమీక్ష ప్రకటన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పన్నుల్లో భారీ స్థాయిలో కోత విధించిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి లోటు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆర్‌బీఐ నుంచి ఈ ఆర్థిక సంవత్సరం చివర్లో రూ.30వేల కోట్ల మేర మధ్యంతర డివిడెండ్ కోరవచ్చని వార్తలు వచ్చాయి. కాగా, ఇటీవలే రూ.1.76 లక్షల కోట్లు మిగుల నిధులను కేంద్రానికి ఇచ్చేందుకు ఆర్‌బీఐ బోర్డు ఆమోదం తెలిపింది.

**ఆర్బీఐ దెబ్బకు మార్కెట్లు ధమాల్**

ముంబయి : ఇప్పటికే దేశ ఆర్థిక వ్యవస్థ మందగించిన నేపథ్యంలో వృద్ధి రేటు అంచనాలకు ఆర్‌బీఐ మరింత కోత పెట్టడంతో మదుపర్లు తీవ్ర ఆందోళనకు గురైయ్యారు. మరోవైపు వడ్డీ రేట్లను తగ్గించడంతో పలు రంగాల సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సర్వీసుల పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ 19 నెలల కనిష్టస్థాయికి పడిపోవడం దలాల్ స్ట్రీట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఈ పరిణామాల మధ్య శుక్రవారం బీఎస్ఇ సెన్సెక్స్ 434 పాయింట్లు లేదా 1.14 శాతం కోల్పోయి 37,673.31 కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 139 పాయింట్లు లేదా 1.23 శాతం పతనమై 11,175కు దిగజారింది. ఒక్క ఐటీ తప్ప అన్ని రంగాలకు చెందిన షేర్లు నష్టాలను చవి చూశాయి. ముఖ్యంగా వడ్డీరేట్లకు ప్రభావితమయ్యే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్లు తీవ్ర ఒడిదుకుడులకు గురైయ్యాయి.ఇదే క్రమంలో దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు జీడీపీ 6.9శాతం నుంచి 6.1శాతంగానూ, వచ్చే ఆర్థిక ఏడాదికి గానూ జీడీఎ వృద్ధిని 7.2శాతంగా అంచనా వేసింది. ఈ పరిణామం దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనతలకు మరింత సంకేతాలు ఇవ్వడంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. సెప్టెంబర్ సర్వీసుల పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ 19 నెలల కనిష్టస్థాయికి పడిపోవడం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఈ ఏడాది ఆగస్ట్‌లో 'పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్' (పిఎంఐ) 52.4 గా నమోదు కాగా .. సెప్టెంబర్ ముగిసేసరికి 'పిఎంఐ' 50 స్థాయికి దిగువన 48.7కు తగ్గడం మార్కెట్ ఆందోళనలను మరింతగా పెంచింది.

## ప్రస్తుతానికి వృద్ధి 6.1 శాతమే..!



దేశ ఆర్థిక వ్యవస్థ అనుకున్న స్థాయిలో రాణించలేక కునారిల్లుతుందన్న విషయాన్ని ఆర్బీఐ మరోసారి పరోక్షంగా ఒప్పుకుంది. ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మన ఆర్థిక వ్యవస్థ కేవలం 6.1 శాతం మాత్రమే వృద్ధి చెందవచ్చని ఆర్బీఐ అంచనా కట్టింది. ఈ నేపథ్యంలోనే 2019-20లో జీడీజీ వద్ధి అంచనాలను ఆర్బీఐ 6.9 శాతం నుంచి 6.1 శాతానికి తగ్గించింది. అదే విధంగా 2020-21 అంచనాలను కూడా 7.2 శాతానికి కుదించింది. గడిచిన జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో దేశ వృద్ధి రేటు 5 శాతానికి పడిపోయి.. ఆరు సంవత్సరాల కనిష్ట స్థాయిని నమోదు చేసింది. మరోవైపు దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి.. పారిశ్రామికోత్పత్తి వెలవెల పోతున్న వేళ ఆర్బీఐ వృద్ధి అంచనాలను తగ్గించింది. మరోవైపు ఆర్థిక వ్యవస్థ మెరుగైన వృద్ధి సాధించడమనేది తమ పని కాదని ఆర్బీఐ ఎంపీసీ అభిప్రాయపడింది. ద్రవ్య విధానాన్ని మాత్రమే తాము సమీక్షించి ద్రవ్యోల్బణానికి అనుగుణంగా తాము వడ్డీరేట్లను సవరిస్తూ వస్తామని.. వాటిని సర్కారు, బ్యాంకులు సక్రమంగా వినియోగించుకొని వృద్ధికి బాటలు వేయాల్సి ఉంటుందని కమిటీ తెలిపింది.

# అమెజాన్ వేదికపై 5లక్షల మంది విక్రేతలు

**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** అమెజాన్ వేదికగా దేశ వ్యాప్తంగా దాదాపు ఐదు లక్షల మంది వ్యాపారవేత్తలు తమ ఉత్పత్తులను విక్రయిసున్నారని అమెజాన్ ఇండియా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, మార్కెటింగ్ విభాగం డైరెక్టర్ కిషోర్ తోట అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో కొత్తగా దాదాపు 1,20,000 మంది విక్రేతలు అమెజాన్ వేదికపైకి వచ్చి తమ ఉత్పత్తులను విక్రయించినట్టుగా తెలిపారు. అమెజాన్ భారత్‌లోకి అడుగుపెట్టిన ఆరేండ్ల స్వల్పకాలంలో అనేక రికార్డులను సొంతం చేసుకుంటోందని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా తమ సంస్థ 13 రాష్ట్రాలలో 26 మిలియన్ చదరపు అడుగుల స్టోరేజీ స్పేస్‌తో 50 ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను కలిగి ఉందని తెలిపారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న పిన్‌కోడ్ కేంద్రాలలో 99.6 శాతం పిన్‌కోడ్ ఏరియాలకు తమ విస్తృతిని పెంచుకోగలిగినట్టుగా ఆయన వివరించారు. శుక్రవారం అర్ధరాత్రితో ముగిసిన గ్రేట్ ఇండియన్ షాపింగ్ ఫెస్టివల్ ఆఫర్ భారత్‌లో అనుకున్నదాని కంటే కూడా ఎక్కువగా విజయవంతమైనట్టుగా అమెజాన్ ఫ్యాషన్ ఇండియా బిజినెస్ హెడ్ అరుణ్ శ్రీదేశ్‌ముఖ్ తెలిపారు. ఈ ఆఫర్‌లో భాగంగా తాము 10 లక్షలకు పైగా అపెరల్స్‌ను విక్రయించినట్టుగా వివరించారు. రానున్న రెండు రోజుల్లో దేశ వ్యాప్తంగా 200 ప్రధాన నగరాలలో




వీటి డెలివీర పూర్తవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ చేరుకున్న అమెజాన్ ఫెస్టివ్ యాత్రను వీరు అధికారికంగా ప్రారంభించారు. ఈ ఏడాది ఎక్కువగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నంచే దాదాపు 90 శాతానికి పైగా బుకింగ్‌లు లభించినట్టుగా ఆయన తెలిపారు.

## ప్రజల వద్దకే ఇండియన్ బ్యాంక్

**నవతెలంగాణ , వాణిజ్య విభాగం:** పండుగల సీజన్ నేపథ్యం లో సమాజంలోని వివిధ రకాల వినియోగదారులకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేసేందుకు గాను ఇండియన్ బ్యాంక్ 'కస్టమర్ అవుట్‌రీచ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో బ్యాంక్ వర్గాలు సామాన్య ప్రజలకు, ఇప్పటికే బ్యాంక్ ఖాతాదారులుగా ఉన్న వారికి ఇండియన్ బ్యాంక్ అందిస్తోన్న వివిధ రకాల సేవలను గురించి వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులైన వినియోగదారులకు వ్యవసాయ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, ఎస్‌హెచ్‌జీ రుణాలు, పెన్షన్ రుణాలు, విద్యారుణాలు, వ్యాపార రుణాలను అందజేయనున్నారు. దేశ వ్యాప్తంగా ఏడు కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టుగా బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో తెలంగాణలోని కామారెడ్డి జిల్లా కూడా ఉన్నట్టుగా బ్యాంక్ వివరించింది.

## నీట్ ద్వారానే ఎయిమ్స్, జిప్మర్‌లో మెడికల్ సీట్లు

- 14న ఎంఎన్‌సీ బోర్డు ఏర్పాటు
- అమల్లోకి ఎంఎన్‌సీ సెక్షన్లు





**న్యూఢిల్లీ :** నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం 2020 నుంచి జీపీఎంఈఆర్ (జిప్మర్), ఎయిమ్స్ సహా అన్ని మెడికల్ కాలేజీలో జాతీయ ప్రవేశ పరీక్ష(నీట్) ద్వారానే ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉంటుందని కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి హర్షవర్ధన్ శుక్రవారం ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 2వ తేదీ నుంచి ఎంఎన్‌సీలో కొన్ని సెక్షన్లు అమల్లోకి వచ్చాయనీ, కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి నామినేషన్లకు పంపాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసినట్టు మంత్రి వివరించారు. ఈ నెల 14వ తేదీన వచ్చిన నామినేషన్లను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి బోర్డు ఏర్పాటు చేస్తామని మంత్రి వివరించారు. కాగా, ఎయిమ్స్, జేపీఏఈఆర్ వంటి సంస్థలు కేంద్ర ఆరోగ్యశాఖ పరిధిలోనే ఉన్నప్పటికీ తమ సంస్థల్లో ప్రవేశాలకు సొంతంగా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం (2020) నుంచి జాతీయ వైద్యకమిషన్ చట్టం అమల్లోకి రానున్నదనీ, ఆగస్టు 8వ తేదీన ఇది రాష్ట్రపతి ఆమోదం కూడా పొందిందని మంత్రి తెలిపారు. దీని ప్రకారం ఇక నుంచి ఎయిమ్స్, జీపీఎంఈఆర్‌లో ప్రవేశాలు నీట్ ద్వారానే జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంఎన్‌సీ చట్టం ప్రకారం నీట్ ఫలితాలు ఆధారంగానే పీజీ కోర్సుల్లో ప్రవేశానికి, ప్రాక్టీస్ లైసెన్స్ పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. విదేశీ వైద్య గ్రాడ్యుయేట్లకు స్క్రీనింగ్ పరీక్షగా కూడా పనిచేస్తుందని అన్నారు. నిపుణులందరితో చర్చించిన అనంతరం అవసరమైన సైద్ధాంతిక, క్లినికల్ స్కిల్ సెట్స్ రెండింటి ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని నీట్‌ను అమలు చేస్తామని తెలిపారు. ఇది మరో మూడేండ్లలో అమల్లోకి వస్తుందనీ, ఈ పద్ధతిలో విద్యార్థులు వేర్వేరు కౌన్సిలింగ్‌లకు వెళ్లాల్సిన అవసరం ఉండదని తెలిపారు. నీట్‌లో విద్యార్థులు నేరుగా నమోదు చేసుకోవచ్చనీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు ఎన్నిసార్లైనా పరీక్షలు రాసుకునే వెసులుబాటు ఉన్నదని మంత్రి వివరించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో తీసుకొచ్చిన ఎంఎన్‌సీ వైద్య రంగంలో మెరుగైన విద్యను అందించేందుకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు.



హైదరాబాద్‌లోని ఎస్వీకే వద్ద నియోకర్సర్ ఆధ్వర్యంలో
బతుకమ్మ సంబురాలు

# మోడీకి లేఖ రాసిన ప్రముఖులపై దేశద్రోహం కేసు



- శ్యాం బెనెగల్, రామచంద్ర గుహ, మణిరత్నం, అనురాగ్ కశ్యప్, అపర్ణ సేన్‌లు సహా 49 మందిపై ఎఫ్ఐఆర్

**ముజఫర్‌పూర్ :** కేంద్రంలోని బీజేపీ సర్కారును, ప్రధాని మోడీని విమర్శించినవారిని దేశద్రోహులుగా చిత్రిస్తున్నారు. మూకదాడులను నిలువరించాలని విజ్ఞప్తి చేసినందుకు, ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు తప్పక చోటుంటుందని గుర్తుచేసినందుకు తాజాగా 49 మంది ప్రముఖులపై దేశద్రోహం కేసు నమోదైంది. బీజేపీ సర్కారుపట్ల విమర్శనాత్మక వైఖరి ఉన్న స్వామి అగ్నివేశ్‌నూ జార్ఖండ్‌లో ఓ మూక దాడి చేసింది. ఆ దాడిలో 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేశారు. 'జై శ్రీరాం' అంటూ.. బాధితులూ దాన్ని నినదించాలని బలవంతపెడుతూ.. మతోన్మాద మూకలు' దేశవ్యాప్తంగా అనేక దాడులకు పాల్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే 'జై శ్రీరాం' ఇప్పుడు దాడులను ప్రేరేపించే రణ నినాదమైందని, దళితులు, ముస్లింలపై మూకదాడులను నిలువరించేందుకు సర్కారు వెంటనే చర్యలు తీసుకోవాలని 49 మంది ప్రముఖులు బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖపై ప్రముఖ సినీ దర్శకుడు మణిరత్నం, అనురాగ్ కశ్యప్, శ్యాం బెనెగల్, అపర్ణ సేన్, ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ, యాక్టర్ సౌమిత్ర ఛటర్జీ, వోకలిస్ట్ శుభా ముద్గల్‌లు సహా పలువురు సంతకాలు పెట్టారు. ఈ లేఖపై బీహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన ఓ స్థానిక న్యాయవాది సుధీర్ కుమార్ ఓఝా మెజిస్ట్రేట్‌లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ రెండు నెలల క్రితం ఆదేశాలు జారీ చేశారు. తాజాగా ముజఫర్‌పూర్‌లో 49 మందిపై ఐపీసీలోని దేశద్రోహానికి సంబంధించి, పబ్లిక్ న్యూసెన్సు, మత భావనలకు భంగం, శాంతికి విఘాతం కలిగించే చర్యల చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. మోడీని విమర్శించినందుకే మణిపూర్ జర్నలిస్టు కిశోర్‌చంద్ర వాంగ్‌ఖేమ్‌పై దేశ భద్రత చట్టం కింద కేసు పెట్టి నెలలపాటు జైలులో ఉంచిన విషయం తెలిసిందే.

**నియంతృత్వం వైపు ప్రయాణిస్తున్నామా? : రాహుల్**

49 మంది ప్రముఖులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. 'ప్రధాని మోడీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడినా.. ఏ సమస్యను లేవనెత్తినా జైలులో పడేసి దాడి చేస్తున్నారు. మీడియాను అణచివేస్తున్నారు. దేశంలో జరుగుతున్న విపరీతాలను అందరూ గమనిస్తున్నారు. ఇందులో రహస్యమేమీ లేదు. ప్రపంచమంతా చూస్తూనే ఉంది. మనం నియంతృత్వం వైపునకు ప్రయాణిస్తున్నాం. ఇది స్పష్టం.' అని వివరించారు. ఎఫ్ఐఆర్‌పై లేఖ రాసినవారిలో ఒకరైన ఆదూరు గోపాలక్రిష్ణన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ లేఖకు సంబంధించి దేశద్రోహం కేసుకు ఒక కోర్టు అనుమతినివ్వడాన్ని తాను నమ్మలేకపోతున్నానని చెప్పారు.

# నల్లమలకు బాసటగానిలబడదాం



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

తెలుగు ప్రజలకు ఊపిరితిత్తులైన నల్లమలను కాపాడుకోవడం బుద్ధిజీవుల కర్తవ్యమని ప్రముఖ కవి శివారెడ్డి నొక్కి చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యువ రచయితల ఆధ్వర్యంలో మేధావులు, కవులు, రచయితలు, సినీ కళాకారులు, ప్రొఫెసర్లు సేవ్ నల్లమల పేరుతో చేసిన సంతకాలతో కూడిన బహిరంగ లేఖను ఏపీ, తెలంగాణ గవర్నర్లకు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ..నల్లమల వైవిధ్యమైన మహారణ్యమనీ, ఆదిమ వాసులకు పుట్టినిల్లు అని వివరించారు. నల్లమల పరిరక్షణ ఉద్యమంలో అన్ని రంగాల వారూ పాలుపంచుకునేలా పోరాట ఆవశ్యకతను విడమర్చి చెప్పాలని ఉద్యమకారులకు సూచించారు. భావజాలాలు ఏవైనప్పటికీ భేషజాలకు పోకుండా అంతా ఒక్కటై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకొచ్చి నల్లమలను రక్షించుకోవాల్సిన సందర్భమనీ, అయితే, పాలకుల నుంచి వచ్చే ఒత్తిళ్లకు మాత్రం బెదరవద్దని సూచించారు. కేంద్రసాహిత్య పురస్కార అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ మాట్లాడుతూ..పాలకులు సహసిద్ధంగా ఉన్న అడవులను ధ్వంసం చేస్తూ..మరోపక్క హరితహారం పేర చెట్లు నాటడం విడ్డూరంగా ఉందన్నారు. సామాజిక వేత్త సజయ మాట్లాడుతూ...తీర్మానంతో యురేనియం సర్వే పనులు ఆగిపోలేదనీ, పెద్దగట్టు-లంబాపూర్ ప్రాంతాల్లో ఇంకా ప్రమాదం పొంచే ఉందని చెప్పారు. విప్లవ కవి నిఖిలేశ్వర్ మాట్లాడుతూ నల్లమలను ధ్వంసం చేసుకోవడమంటే మనల్ని మనం ధ్వంసపరుచుకోవడమని అన్నారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్. వినయకుమార్ మాట్లాడుతూ...శాసనసభలో తీర్మానం చేస్తే సరిపోదనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి సర్వేలకు ఇచ్చిన అనుమతులన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కవులు యాకూబ్, భూపతి వెంకటేశ్వర్లు, ఇంద్రవెల్లి రమేష్, కుప్పిలి పద్మ, నవతెలంగాణ కార్టూన్ ఎడిటర్ నర్సిం, ప్రొఫెసర్ కాశీం, సత్యవతి, సేవ్ నల్లమల ప్రచారకర్తలు అరవింద్, విప్లవ్ పాల్గొన్నారు.

## డిజిటల్ డోర్ నెంబరింగ్‌పై అధ్యయనానికి కమిటీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

క్యూఆర్ కోడ్ ఆధారంగా రాష్ట్రంలో డిజిటల్ డోర్ నెంబరింగ్ అమలు చేసేందుకు అవసరమైన విధి విధానాలను సూచించేందుకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ సభ్య కార్యదర్శిగా ఒక ఉన్నత స్థాయి కమిటీని వేశారు. ఈ కమిటీ న్యూఢిల్లీ, బెంగుళూరు, విజయవాడలలో డిజిటల్ డోర్ నెంబరింగ్ అమల్లో ఎదురైన సమస్యలపై అధ్యయనం చేసి అక్టోబర్ 30 నాటికి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కమిటీలో పురపాలక శాఖ సంచాలకురాలు డాక్టర్ టి.కె.శ్రీదేవి తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఆదాయపు పన్ను, టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం తదితర వాటికి డోర్ నెంబరింగ్ ను అనుసంధానం చేయగల అవకాశాలపై కూడా కమిటీ సూచనలు చేయనున్నది.

# వారికి జీవితఖైదు సరైన శిక్షే...

మహబూబాబాద్ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

చేతబడి చేశారనే నెపంతో ఇద్దరిని హత్య చేసిన 11 మంది నిందితులకు జీవిత కారాగార శిక్ష విధిస్తూ మహబూబ్‌బాద్ కోర్టు 2012లో ఇచ్చిన తీర్పు విషయంలో జోక్యం చేసుకునేదీ లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. మహబుబాబాద్ అడిషినల్ సెషన్స్ జడ్జి ఇచ్చిన తీర్పును ఇటీవల ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ సమర్థించింది. మహబూబాబాద్ సమీపంలోని సిరోల్ అనే గ్రామంలో చింతల జనార్దన్ 2003లో చనిపోయాడు. దశదిన కర్మలకు హాజరైన అతని బంధువుల్లో చింతల సత్యం ఆ తర్వాత రోజు 2003 ఏప్రిల్ 30న అనారోగ్యంతో కన్నుమూశాడు. తక్కువ రోజుల్లో ఇద్దరు చనిపోవడంతో ఎవరో చేతబడి చేశారని భావించిన కుటుంబసభ్యులు అదే రోజు



రాత్రి మామిడిపల్లి రాములును పట్టుకుని కట్టేసి కొట్టారు. రాములు చెప్పాడనే సమాచారం ఆధారంగా గోపయ్య, ముత్తయ్యలను కూడా పట్టుకుని కొట్టారు. ఆ దెబ్బలకు అదే రాత్రి గోపయ్యచనిపోగా, రాములు గాయాలతో వైద్యం పొందుతూ మరణించాడు. పోలీసులు పెట్టిన కేసులో చింతల నర్సయ్య సహ పదకొండు మందికి కింది కోర్టు జీవితకారాగార శిక్ష విధించింది. దీనిని రద్దు చేయాలన్న వాళ్ల క్రిమినల్ అప్పీల్‌ను హైకోర్టు తోసిపుచ్చుతూ జీవితకారాగార శిక్షను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.

**ఎక్స్ షోరూం ధర మేరకు... లైఫ్ ట్యాక్స్ వసూలు చేయరాదు**

ఏదైనా వాహనం కొంటే ఎక్స్ షోరూం ధర మేరకు లైఫ్ ట్యాక్స్ వసూలు చేయరాదన్న గతంలోని తీర్పును మరోసారి హైకోర్టు వెలువరించింది. ఒక వ్యాపారి జాగ్వార్ ఎక్స్‌ఎఫ్ కారును ఇన్వాయిస్ రేటు రూ.41.70 లక్షలకు కొన్నాడు. రూ.5.56 లక్షలు పన్నుగా చెల్లించారు. రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీఏ అధికారుల దగ్గరకు వెళ్లినప్పుడు.. ఇన్వాయిస్ ధర మేరకే పన్నుకట్టాలని చెప్పారు. ఎక్స్ ఫోరూం ధర రూ.55 లక్షలకు అనుగుణంగా చెల్లించాలని పేర్కొనడాన్ని ఆ వ్యాపారి హైకోర్టులో సవాల్ చేశారు. వాహన ఇన్వాయిస్ రేటు ప్రకారమే లైఫ్ ట్యాక్స్ వసూలు చేయాలని, ఎక్స్ షోరూం ప్రైస్ మేరకు కాదని న్యాయమూర్తి జస్టిస్ పి. నవీన్‌రావ్ ఇటీవల తీర్పు చెప్పారు. ఈ మేరకు తెలంగాణ రవాణ అధికారులను ఆదేశాలు జారీ చేశారు.

## ముందే చెప్పాం...చర్యలు లేవు

- రైల్‌సేఫ్టీ కమిషన్‌కు మెట్రోపై ఫిర్యాదు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**



నాణ్యత లేని నిర్మాణ పనుల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశముందని ముందే హెచ్చరించినా చర్యలు తీసుకో లేదని వెల్‌టెక్ ఫౌండేషన్ కేంద్ర మెట్రోరైల్ సేఫ్టీ చట్టబద్ధ విచారణ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. మౌనిక మరణంపై విచారణకు వేసిన కేంద్ర మెట్రో రైల్‌సేఫ్టీ కమిషనర్ జెకె గార్గ్‌కు వెల్‌టెక్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ చిలుపూరి వీరాచారి తదితరులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. మెట్రో రైల్ అన్ని స్టేషన్లలో వాటర్ లీకేజిలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపినా ప్రయోజనం లేకపోయినదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లీకేజీల వల్ల పెచ్చులు ఊడే ప్రమాదం ఉందని రేలింగ్‌కి ఉపయోగించిన షీట్స్ కూడా ఊడిపోయే ప్రమాదం ఉందని తెలిపామని, ఇది ముమ్మాటికీ ఎల్ అండ్ టీ సంస్థ మరియు ప్రభుత్వ పర్యవేక్షణ లోపమేనని పేర్కొన్నారు. పిల్లర్స్ మధ్యలో డివైడర్ గ్యాప్‌లలో డిస్‌మెంటల్ మట్టిని నింపి నిబంధనలు ఉల్లంఘించారని వివరించారు. నాణ్యతపై ప్రభుత్వేతర సంస్థలతో విచారణ జరిపించాలని కోరారు.



స్మార్ట్‌ఫోన్ ప్రతి ఒక్కరి చేతిలో ఉండే నిత్యావసర వస్తువు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్ మీదనే ఆధార పడుతున్నారు. టికెట్ బుకింగ్, బిల్ పేమెంట్, మనీ ట్రాన్స్‌ఫర్ ఇలా ఏ పని చేయాలన్నా, ఏ సమాచారం తెలుసుకోవాలన్నా.. అన్నింటికీ ఆండ్రాయిడ్ ఫోన్ తప్పనిసరి. అవసరానికి తగినట్టు యాప్స్ వినియోగించుకుంటూ వెళ్తే స్మార్ట్‌ఫోన్‌లో స్పేస్ సరిపోదు. అంతేకాదు, ఆండ్రాయిడ్ ఫోన్‌తో పాటు కొన్ని యాప్స్, సాఫ్ట్‌వేర్‌లు వస్తుంటాయి. వాటిలో చాలా వరకు మనం ఉపయోగించనివే. సాధారణంగా వాటిని తొలగించడం సాధ్యం కాదు. అది కేవలం రూటింగ్ పద్ధతిలోనే తొలగించడం సులువవుతుంది. రూటింగ్ అంటే ఏంటి? దీని వల్ల ఏయే ఉపయోగాలు ఉన్నాయో, ఏ విధంగా చేసుకోవచ్చో తెలుసుకుందాం..

# ఓఎస్ మార్చేస్తే..!!

ఎక్కువ మంది ఉపయోగించే మొబైల్ ఫోన్‌లలో ఉండే ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్) ఆండ్రాయిడ్.. ఆండ్రాయిడ్ అంటే మనిషిలా పని చేసే రోబో అని, అంటే హ్యూమనాయిడ్ రోబో అని అర్థం. ఆండ్రాయిడ్ సింబల్ కూడా పేరుకు తగినట్టుగానే ఉంటుంది. కొనుగోలు చేసేప్పుడే ఫోన్‌తో పాటు కొన్ని రకాల యాప్స్, సాఫ్ట్‌వేర్‌లు వస్తుంటాయి. వాటిని ఎక్కువగా వినియోగించం. అయితే ఫోన్ వినియోగిస్తుంటే, ఈ తరహా యాప్స్ బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతూ ఉంటాయి. ఇవి బ్యాటరీ సామర్థ్యంపై ప్రభావం చూపిస్తుంటాయి. అందుకే ఆండ్రాయిడ్‌లలో ఈ సమస్యను అధిగమించేందుకు అదనపు ఫీచర్లను పొందేందుకు రూటింగ్‌ను ఉపయోగిస్తుంటారు. ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ఈ మధ్యనే ఈ పేరు కొత్తగా వినిపిస్తోంది. రూటింగ్ చేస్తే ఫోన్‌ను కొత్త దానిలా మార్చుకోవచ్చు. మనకు అవసరం అనుకున్న యాప్స్‌ను మాత్రమే ఫోన్‌లో ఉండేలా చేసుకోవచ్చు. బ్యాటరీ సామర్థ్యం పెరుగుతుంది. ఇలా ఎన్నో లాభాలున్నాయి.

### రూటింగ్ అంటే..

రూటింగ్ అంటే.. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లోని కొన్ని అదనపు ఫీచర్లను ఉపయోగించడానికి అవకాశం కల్పించే పద్ధతి. మనకు కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్‌లలో ఆపరేటింగ్ సిస్టం మనకు కావాల్సినది మార్చుకున్నట్టే.. ఆండ్రాయిడ్ ఫోన్‌లలోనూ ఆపరేటింగ్ సిస్టమ్‌ను మార్చుకోవడమే. రూటింగ్ చేసుకుంటే, ప్లేస్టోర్ నుంచి లింక్ టూ ఎస్డీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పెద్ద సైజులో ఉండే అప్లికేషన్‌లను ఎస్డీ కార్డుకు మూవ్ చేసుకోవచ్చు. తక్కువ ఇంటర్నల్ స్టోరేజీ ఉన్న మొబైల్స్‌కు ఇలా చేస్తే ఫోన్ వాడకంలో సమస్య ఏర్పడదు. నచ్చనివి లేదా అవసరం లేదనుకున్న అప్లికేషన్‌లను అన్‌ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. మొబైల్ తయారీ కంపెనీలు ప్రమోషన్‌లో భాగంగా అందించే కొన్ని రకాల అప్లికేషన్‌లు మనకు రోజువారీ వినియోగంలో పనికి రావు. వాటి వల్ల మొబైల్ బ్యాటరీ వినియోగం అవుతుంటుంది.



### ఎలా చేయాలి..

రూటింగ్ చేయడానికి ఫోన్ డేటా కేబుల్‌ను కంప్యూటర్‌కు అనుసంధానం చేయాలి. వన్‌క్లిక్ రూట్ విండోస్ సాఫ్ట్‌వేర్‌ను ఓపెన్ చేయాలి. అందులో ఫోన్ మోడల్ పేరుతో గూగుల్ రూటింగ్ సెర్చ్ చేస్తే, అవుతుందో లేదో తెలుసుకోవచ్చు. అవుతుంది అనుకుంటే ప్రారంభించుకోవచ్చు. సాంకేతిక సమస్యలు తలెత్తే ప్రమాదముంటే రూటింగ్ ఆపేసుకోవచ్చు. ఫోన్‌లో మెయిల్ సెట్టింగ్స్‌లో అబౌట్ ఫోన్ అనే లాస్ట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడే బిల్డ్ నెంబర్ అనే ఆప్షన్‌పై ఎనిమిది సార్లు టచ్ చేయాలి. దీనిని మెయిల్ సెట్టింగ్స్‌లో డెవలపర్ ఆప్షన్స్ అనే దానిపై క్లిక్ చేయాలి. ఈ డెవలపర్ ఆప్షన్స్‌ను పైన ఆఫ్ చేసిన యూఎస్‌బీ డీబగ్గింగ్ అనే ఆప్షన్‌ను ఎనేబుల్ చేయాలి. ఇలా చేస్తే ఫోన్‌లో చేయాల్సినంత వరకు పూర్తయినట్టే. తర్వాత మెయిన్ సెట్టింగ్స్‌లో సెక్యూరిటీపై క్లిక్ చేయాలి. అందులో అన్‌నోన్ సోర్సెస్ ఆప్షన్ వస్తుంది. దానిని ఎనేబుల్ చేయాలి. లేదంటే ఇంటర్నెట్‌లో ఆండ్రాయిడ్ అప్లికేషన్ ఫైల్ కనిపిస్తే ఫోన్‌లోకి కాపీ పేస్ట్ చేసుకుని నేరుగా ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. వన్‌క్లిక్ రూట్ ఈఎక్స్ఈ సాఫ్ట్‌వేర్ ఫైల్‌ను డోన్‌లోడ్ చేసుకుని, విండోస్ కంప్యూటర్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ అయిన యాప్‌ను ఎపెన్ చేసి రన్ చేయాలి. అందులో వస్తున్న స్టెప్స్‌ను అనుసరించి వెళ్ళాలి. ఒకవేళ వస్తున్న స్టెప్స్‌లో పూర్తి చేయనివి ఏవైనా ఉంటే వాటిని పూర్తి చేసుకుంటూ వెళ్ళాలి. అందులో భాగంగానే రూటింగ్‌కు సంబంధించి వచ్చే సమాచారాన్ని క్షుణ్ణంగా చదివి తెలుసుకోవాలి. తర్వాత ఫోన్‌లో డీబగ్గింగ్ ఎనేబుల్ చేసి, వన్‌క్లిక్‌రూట్ ఇన్‌స్టాల్ చేసిన కంప్యూటర్‌కు డేటా కేబుల్‌తో కనెక్ట్ చేయాలి. ఫోన్, కంప్యూటర్ డ్రైవర్స్ ఇన్‌స్టాల్ అయ్యేవరకు వేచి చూస్తే, వన్‌క్లిక్ సాఫ్ట్‌వేర్‌లో రూట్ నౌ అనే ఆప్షన్ వస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. ఫోన్ స్క్రీన్‌పై ఏవైనా పర్మిషన్‌లు అడిగితే ఓకే అని ప్రెస్ చేస్తూ ఉంటే, కొన్ని నిమిషాల తర్వాత రూటింగ్ సక్సెస్ అనే మెసేజ్ కంప్యూటర్‌లో కనిపిస్తుంది. దీంతో ఫోన్ రూటింగ్ పూర్తయినట్టే.

### అవసరమైనవి..

- నో ఫ్రిల్స్ సీపీయూ అనే యాప్ సాయంతో ఫోన్ ప్రాసెసర్ స్పీడ్‌ను డిఫాల్ట్ సెట్టింగ్ నుంచి మ్యాక్సిమమ్ స్పీడ్‌కు మార్చుకోవచ్చు. ఇలా చేయడం వల్ల ఇతర యాప్స్ వాడే సమయంలో ఫోన్ స్లో అవ్వడాన్ని నిరోధించవచ్చు. ఫోన్ వాడకం లేదనుకుంటే ప్రాసెసర్ స్పీడ్‌ను తగ్గించుకుంటే బ్యాటరీని ఆదా చేసుకోవచ్చు.
- ఏదైనా అప్లికేషన్ బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవకుండా కేవలం వాడే సమయంలో మాత్రమే రన్ అయ్యేలా గ్రీనిఫై అనే అప్లికేషన్‌ను సెట్ చేసుకోవచ్చు.
- రూటింగ్ చేశాక ఫోన్‌లో లాక్‌స్క్రీన్, నోటిఫికేషన్ బార్, షార్ట కట్ ఫీచర్స్, ఎల్ఈడీ ఇండికేటర్ రంగు మార్పు తదితరాల కోసం పింప్ మైరూమ్ యాప్, ఎక్స్‌పోస్డ్ వై టూల్స్ అప్లికేషన్‌లను ఉపయోగించుకుని మార్పులు చేసుకోవచ్చు.
- ఫోన్‌లో గేమ్స్ ఆడేపుడు, లేదా మరేదైనా యాప్‌ను వినియోగించేపుడు ప్రమోషన్స్ యాడ్స్ వస్తుంటాయి. అటువంటివి రాకుండా యాడ్ బ్లాక్ చేసుకోవచ్చు.
- ఫోన్ కొన్నపుడు ఎలా ఉందో అలా కావాలని కొత్తగా కనిపించాలని చాలా మంది ఫ్యాక్టరీ రీస్టోర్ సెట్టింగ్స్ పెడతారు. దీని వల్ల అప్పటివరకు ఉన్న కాల్‌లాగ్స్, మెసేజెస్, మనకు కావాలనుకుని పెట్టుకున్న కొన్ని సెట్టింగ్స్, కాంటాక్ట్స్ అన్నీ పోతాయి. అయితే కాంటాక్ట్స్ మాత్రం జీమెయిల్‌తో అనుసంధానమై ఉండడం వల్ల మెయిల్ ఐడీ రీసెట్ చేయగానే వచ్చేస్తాయి. మరి మిగిలిన వాటి పరిస్థితి ఏంటి అంటే.. అన్నీ వదులుకోవాల్సిందే. అయితే వాటన్నింటినీ కూడా తిరిగి పొందాలంటే టైటానియం బ్యాకప్ అనే రూట్ అప్లికేషన్ ఉపయోగిస్తే వచ్చేస్తాయి. రూట్ అప్లికేషన్‌లలో ఇది చాలా బాగా పనిచేస్తుంది.
- కేవలం చిన్న చిన్న మార్పులు, ఫోన్ లుక్ కోసమే కాకుండా తక్కువ బటన్స్ వినియోగం, ఒకటి రెండు టచ్‌లలో పనులు పూర్తయ్యేలా అనేక రకాల ఆప్షన్లు ఇందులో ఉన్నాయి. పూర్తిగా కొత్త కొత్త అవసరాలు తీర్చే రూటింగ్ యాప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

### వారెంటీ వదులుకోవాల్సిందే..

అయితే ఫోన్ కొన్నామంటే ఇన్ని సంవత్సరాలు అంటూ వారెంటీ వస్తుంది. ఫోన్‌తో వచ్చిన సాఫ్ట్‌వేర్‌ను వదిలేసి, రూటింగ్ చేసుకుంటే వారెంటీ పనిచేస్తుందా అంటే కచ్చితంగా పని చేయదు. మరి వారెంటీ పోగొట్టుకుని మరీ రూటింగ్ అవసరమా అంటే.. స్మార్ట్‌ఫోన్‌ను సరిగా వినియోగించాలనుకునే వారికి కచ్చితంగా అవసరమే. రూటింగ్ చేయడం వల్ల ఫోన్‌లో మనకు కావాల్సిన యాప్స్ మాత్రమే ఉంటాయి. బ్యాటరీ లైఫ్ టైమ్ పెరుగుతుంది.



### నష్టాలు..

రూటింగ్ చేసుకోవడం వల్ల ఫోన్‌తో పాటు వచ్చే వారెంటీ పోతుంది. సాంకేతిక సమస్యలు తలెత్తితే, కంపెనీ వారెంటీ లేదని పట్టించుకోదు. కొన్ని ఫోన్‌లకు అన్‌రూటింగ్ చేస్తే సమస్య సమసిపోతుంది. కొన్నింటికి అన్‌రూటింగ్ చేసినా వారెంటీ వచ్చే అవకాశం ఉండదు. ఎందుకంటే సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చోటుచేసుకుని ఉంటాయి. దేనికి పనికి వస్తుందనేది ఫోన్ బ్రాండ్ మీద ఆధారపడి ఉంటుంది. సోనీ కంపెనీ ఫోన్‌లకు రూటింగ్ కష్టమనే చెప్పవచ్చు. అన్ని ఫోన్‌లకు ఈ తరహా రూటింగ్ వర్తించదు. అందుకే ముందుగా గూగుల్‌లో ఫోన్ కంపెనీ పేరు, మోడల్‌తో సెర్చ్ చేస్తే ఎటువంటి రూటింగ్ పద్ధతులు ఉన్నాయో తెలుసుకోవాలి. ఒక వేళ ఉంటే తదనుగుణంగానే రూటింగ్ చేసుకోవాలి.

# డిలీటెడ్ చాట్ పొందండిలా..

వాట్సాప్.. అంటే తెలియని వారుండరు. నిద్ర లేచింది మొదలు ఎన్నో విషయాలు వాట్సాప్ ద్వారా షేర్ చేస్తుంటారు. తెలుసుకుంటుంటారు. వాట్సాప్ కూడా వినియోగదారుల కోసం అనేక రకాల ఫీచర్లను తీసుకువస్తోంది. పొరపాటున ఒకరికి పంపాల్సిన మెసేజ్ మరొకరికి పంపినా 'Delete For Everyone' సాయంతో సరిదిద్దుకోవచ్చు. అయితే ఒక్కోక్కసారి మనకు అవసరమైన మెసేజ్‌లు పొరపాటున డిలీట్ చేస్తుంటాం. ఒకసారి డిలీట్ చేస్తే ఆ మెసేజ్ పోయినట్టే. ఇక దానిని చూసే అవకాశం ఉండదు. అయితే వాట్సాప్‌లో పొరపాటున ఎవరి చాట్ అయినా డిలీట్ చేసినా మళ్లీ తిరిగి పొందవచ్చు. అయితే దీనికి ప్రత్యేకమైన ఫీచర్ ఏమీ లేదు. చిన్న ట్రిక్ ను ఫాలో అయితే మెసేజ్‌లను మళ్ళీ చూడవచ్చు.

పొరపాటున వాట్సాప్ చాట్ డిలీట్ చేయగానే వెంటనే వాట్సాప్‌లో ఏ ఆప్షన్‌నూ కదిలించకుండా అన్ ఇన్‌స్టాల్ చేయాలి. అనంతరం ఇన్ స్టాల్ చేయాలి. తర్వాత వాట్సాప్‌లో ప్రొఫైల్ వివరాలు ఇచ్చిన అనంతరం వాట్సాప్ చాట్ బ్యాకప్‌ను రీస్టోర్ చేయమంటారా అని అడుగుతుంది. ఓకే చేసేయాలి. పొరపాటున డిలీట్ చేసిన చాట్ మీకు తిరిగి కనిపిస్తుంది. అయితే ఈ ఆప్షన్ పని చేయాలంటే వాట్సాప్‌లో చాట్ బ్యాకప్ యాక్టివేట్ అయి ఉండాలి. అయితే అది ఆన్ అయిందో లేదో అని బాధ పడాల్సిన పని లేదు. అది డీఫాల్ట్‌గా ఆన్‌లోనే ఉంటుంది. ఒకవేళ పనికట్టుకుని ఆఫ్ చేస్తే తప్ప ఆఫ్ అయ్యే అవకాశమే లేదు. అందువల్ల ఎప్పుడైనా పొరపాటున చాట్‌ను డిలీట్ చేస్తే ఈ ప్రక్రియను ఫాలో అవ్వడం ద్వారా మీ చాట్‌ను తిరిగి పొందవచ్చు.

మరికొన్ని ఫీచర్లు

వాట్సాప్ మున్ముందు మరిన్ని ఫీచర్లు అందుబాటులోకి రానున్నాయి. యాప్‌లోనే ఫింగర్ ప్రింట్ సదుపాయం, నోటిఫికేషన్ బార్‌లో ఆడియో వినడం వంటి ఫీచర్లు ఉన్నాయి. అంతేకాకుండా మరికొన్ని తెలియని ట్రిక్స్ కూడా ఉన్నాయి. వాట్సాప్‌లో వాయిస్ కాల్స్, వీడియో కాల్స్ సహజంగా వినియోగిస్తూనే ఉంటాం. అయితే వీటికి ఎక్కువ డేటా వాడుతున్నట్లు అనిపిస్తే వాట్సాప్ కాల్ సెట్టింగ్స్‌లో డేటా యూసేజ్ ఆప్షన్‌ను ఎంచుకుంటే డేటా వాడకాన్ని తగ్గించవచ్చు. అలాగే డేటా అండ్ స్టోరేజ్ యూసేజ్ ఆప్షన్ ద్వారా వాట్సాప్ డేటా మీ ఫోన్‌లో ఎంత స్టోరేజ్‌ని ఉపయోగించుకుంటుంది, ఏ కాంటాక్ట్‌కి సంబంధించి ఎంత డేటా ఉంది అనే వివరాలు కూడా ఇందులో చూసుకోవచ్చు. గ్రూప్ సెట్టింగ్స్‌ను ఉపయోగించుకోవడం ద్వారా ఎవరు పడితే వాళ్ళు గ్రూపుల్లో జాయిన్ అవకుండా నియంత్రించుకోవచ్చు.



# వీటిని సెర్చ్ చేస్తే.. మీ మీద నిఘా ఉన్నట్టే..

ఏ విషయం గురించి సమాచారం కావాలన్నా తడుము కోకుండా వెతికేది గూగుల్ సెర్చ్‌లోనే.. ఎటువంటి సమాచారమైన గూగుల్‌లో అందుబాటులో ఉంటుంది. తెలిసో, తెలియకో చాలా విషయాలను సెర్చ్ చేస్తూ ఉంటాం. అయితే మనం తెలియక చేసే కొన్ని తప్పులు మనల్ని ఇబ్బందుల్లోకి నెట్టే అవకాశం ఉంది. అయితే అందులో కొన్ని మనం చూడకూడని సైట్లు కూడా ఉంటుంటాయి. కొన్ని వెతకకూడని అంశాలు ఉంటాయి. కొన్ని విషయాలు వెతికినప్పుడు పర్లేదు కానీ కొన్ని విషయాలు వెతకడం అంత మంచిది కాదు. అలాంటి సందర్భాల్లో మీరు విషయాలు కాకుండా సమస్యలు వెతుకుతున్నట్లు అవుతుంది. ఇంటర్నెట్‌లో ఉన్న సమస్యలు తెచ్చి ఇంట్లో పెట్టుకోకుండా ఉండాలంటే ఏయే విషయాలను సెర్చ్ చేయకూడదో తెలుసుకుందాం..

### చైల్డ్ పోర్నోగ్రఫీ..

ఈ మధ్య కాలంలో మన దేశంలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల ప్రభుత్వాలు కూడా ఈ విషయంపై చాలా సీరియస్‌గా ఉన్నాయి. రోజురోజుకు పెరుగుతున్న అత్యాచారాలు, కిడ్నాప్‌లు, చిన్నపిల్లలపై లైంగిక వేధింపులకు చైల్డ్ పోర్నోగ్రఫీనే కారణమని చాలా సందర్భాల్లో తేలింది. ఇటువంటి కేసుల్లో ఉన్న నిందితులు కూడా అటువంటి వీడియోలను చూడటం కారణంగా ప్రభావితం అవ్వడం కారణంగానే ఇలాంటి పనులు చేస్తున్నట్లు విచారణలో తేలుతుండడంతో ఉండటంతో దీనిపై నిఘా పెట్టారు. మన దేశంలో ఏకంగా ఇటువంటి వీడియోలపై నిషేధం కూడా విధించారు.

### ఆత్మహత్య

ఏదో సరదాగా తెలుసుకుందామని కొంతమంది లేదా బాగా డిప్రెషన్‌కు గురైన వాళ్ళో ఆత్మహత్య ఎలా చేసుకోవాలి అని వెతుకుతూ ఉంటారు. అలాంటి విషయాల గురించి సెర్చ్ చేసినట్లయితే పోలీసులు కొన్ని నిమిషాల్లోనే మీ ఐపీ అడ్రెస్ ను ట్రేస్ చేసి ఇంటికి వచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ మీరు నిజంగా డిప్రెషన్‌లో ఉంటే కౌన్సెలింగ్ చేస్తారు. లేదా సరదాకి చేసి ఉంటే వాళ్ళ రీతిలో స్పందిస్తారు. అందువల్ల ఇలాంటి విషయాలు సెర్చ్ చేయకుండా ఉంటేనే మంచిది.

### ఆయుధాలు

గూగుల్‌లో 'How to make a bomb', 'How to get a gun' లాంటి పదాలను అస్సలు సెర్చ్ చేయకూడదు. ఎందుకంటే అటువంటి పదాలను సెర్చ్ చేస్తే మీ ఐపీ అడ్రెస్‌ను ట్రేస్ చేసి మీ మీద నిఘా పెట్టే అవకాశం ఉంది. కాబట్టి ఇలాంటి వాటి గురించి అస్సలు వెతకకుండా ఉండటమే మంచిది.

### వ్యక్తిగత వివరాలు

మనం సెర్చ్ చేసిన ప్రతిదీ గూగుల్ స్టోర్ చేసుకుంటుంది. ఈ విషయం తెలియక అత్యుత్సాహానికి పోయి కొంతమంది తమ పేరు, ఫోన్ నంబర్, అడ్రస్, మెయిల్ ఐడీ వంటి వ్యక్తిగత వివరాలు గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఏం వస్తాయో చూద్దామని చేస్తుంటారు. ఇలాంటివి చేస్తే జైలుకి వెళ్లే అవకాశం ఉండదు కానీ , డేటా చోరీకి గురయ్యే అవకాశం మాత్రం పుష్కలంగా ఉంది. కాబట్టి మీ వ్యక్తిగత వివరాలను గూగుల్‌లో అస్సలు సెర్చ్ చేయవద్దు. ఇవే కాక చెడుకు సంబంధించిన ఏ విషయాలు సెర్చ్ చేసినా ఎంతో కొంత నష్టమే జరిగే అవకాశం ఉంది. అందువల్ల అవసరమైనవి, విజ్ఞానాన్ని అందించే వాటి గురించి మాత్రమే తెలుసుకుంటే మేలు.



# కండ్లకు డార్క్‌మోడ్

ఇంటర్నెట్‌లో ఏది బ్రౌజ్ చేయాలన్నా గూగుల్ వినియోగం తప్పనిసరి. అవసరాన్ని బట్టి ఒకొకసారి ఎక్కువ సేపు సమయం కేటాయించాల్సి వస్తుంది. ఎక్కువ సేపు అలా చూస్తున్నపుడు అందులోని కాంతి తీవ్రతకు మన కండ్లు కొంచెం అలిసిపోయినట్టు అనిపిస్తాయి. అలాంటి పరిస్థితి రోజువారీలో భాగమైతే కండ్లకు ప్రమాదమే. ఆ కాంతి కంటి రెటీనాపై ప్రభావం చూపుతుంది. గూగుల్ బ్రౌజ్ చేస్తున్నప్పుడు కళ్లు కాస్త ఒత్తిడికి లోనయినట్లు అనిపించడం సహజమే. అంతేకాకుండా బ్యాటరీ చార్జింగ్ కూడా త్వరగా తగ్గిపోతుంది. ఈ రెండింటినీ నివారించాలంటే గూగుల్ క్రోమ్‌లో డార్క్ మోడ్‌ను ఎనేబుల్ చేసుకోవాలి. డార్క్ మోడ్‌ను ఉపయోగించడం వల్ల కంటిపై మొబైల్ ఫోన్ నుంచి వచ్చే ప్రకాశవంతమైన కాంతి పడకుండా ఉంటుంది. ఇది ఎనేబుల్ చేసుకోవాలంటే సింపుల్ బటన్ లేదా చెక్ బాక్స్ వంటివి ఏమీ లేవు. అయితే ఒకొక్క దానిలో ఒక్కో రకంగా ఈ ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకోవాల్సి ఉంటుంది.

**విండోస్ 10లో.. :** డార్క్ మోడ్ ఎనేబుల్ చేసుకోవడానికి మీ కంప్యూటర్‌లో సెట్టింగ్స్ మెనూ ఓపెన్ చేసి, అందులో పర్సనలైజేషన్ పై క్లిక్ చేయాలి. అందులో కలర్స్‌ను ఓపెన్ చేసి అక్కడ 'Choose your default app mode'ను ఎనేబుల్ చేయాలి. దాన్ని డార్క్‌కు మార్చుకోవాలి. అంతే క్రోమ్‌ను రీస్టార్ట్ చేయాల్సిన అవసరం లేకుండానే డార్క్‌మోడ్‌కు మారిపోతుంది.

**మాక్ ఓఎస్‌లో :** మాక్ ఓఎస్‌లో.. సిస్టం ప్రిఫరెన్సెస్ ఓపెన్ చేయాలి. జనరల్ పై క్లిక్ చేసి, అక్కడ అప్పియరెన్స్‌ను ఎంచుకోవాలి. అక్కడ కనిపించే ఆప్షన్‌లలో డార్క్‌ఆప్షన్‌ను ఎంచుకోవాలి. విండోస్‌లో మారినట్లుగానే ఇందులోనూ వెంటనే డార్క్‌మోడ్‌కు మారిపోతుంది.

**ఆండ్రాయిడ్ వెర్షన్‌లో.. :** ఆండ్రాయిడ్ వర్షెన్‌లో గూగుల్ క్రోమ్ డార్క్‌మోడ్ ఇంకా ప్రయోగాల దశలోనే ఉంది. దాన్ని ఉపయోగించాలంటే.. బ్రౌజర్ అడ్రెస్ బార్ లో chrome://flags అని టైప్ చేయాలి. అక్కడ సెర్చ్ ఫ్లాగ్స్ అనే డైలాగ్ బాక్స్ ఓపెన్ అవుతుంది. అందులో డార్క్ అని టైప్ చేసి ఎంటర్ చేయాలి. వెంటనే కింద మీకు 'Android web contents dark mode', 'Android chrome UI dark mode' అని రెండు ఆప్షన్లు కనిపిస్తాయి. ఒకవేళ మీరు మొదటి ఆప్షన్ ఎంచుకుంటే ఏ వెబ్‌సైట్ ఓపెన్ చేస్తున్నారో గూగుల్‌క్రోమ్ పరిశీలించి, దానికి సంబంధించిన డార్క్‌మోడ్‌ను ఆటోమేటిక్‌గా ఎంపిక చేస్తుంది. డార్క్‌మోడ్ వెర్షన్ అందుబాటులో లేకపోతే సైట్ కలర్స్‌ను మారుస్తుంది. రెండో ఆప్షన్ ఎంచుకుంటే బ్రౌజర్ ఇంటర్ ఫేస్ దానంతట అదే డార్క్‌కు మారుతుంది. అయితే ఎంచుకోవాలనుకున్న ఆప్షన్ కిందనున్న డ్రాప్ డౌన్ బాక్స్‌పై క్లిక్ చేసి, అక్కడ ఎనేబుల్‌డ్ అనే ఆప్షన్‌ను యాక్టివేట్ చేసి, గూగుల్ క్రోమ్‌ను రీస్టార్ట్ చేయాలి. ఆండ్రాయిడ్ డివైజ్‌లో గూగుల్ క్రోమ్ డార్క్ మోడ్ ఎనేబుల్ అయిపోతుంది.




**డియర్ రీడర్స్..**

టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..? ఇలాంటి అనుభవాలేమైనా ఉంటే మాకు రాసి పంపండి. మా చిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020. tech+@ navatelangana.com

20 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయారు. మంచి ఎండకాసే వేళ అశ్విన్, జడేజా స్పిన్‌ను ఎదుర్కొని ఎంత సేపు పోరాడగలరు?. మూడో రోజు ఆట ఆరంభానికి ముందు దక్షిణాఫ్రికా ప్రదర్శనపై అభిమానుల్లో నెలకొన్న అంచనాలు. అంచనాలను తలకిందులు చేయటమే కాదు, కోహ్లిసేన లెక్క సైతం సరి చేసేందుకు సఫారీ సేనకు ఎంతో సమయం పట్టలేదు. తొలి రెండు సెషన్లలో పూర్తి ఆధిపత్యం చెలాయించిన దక్షిణాఫ్రికా 385/8తో గౌరవప్రద స్థితిలో నిలిచింది.

డీన్ ఎల్గార్ (160), క్వింటన్ డికాక్ (111) శతకాలతో విశాఖను మోతెక్కించారు. ఎల్గార్ సహనంతో క్రీజులో నిలిచి, స్పిన్ దాడిని ముందుండి ఎదుర్కొన్నాడు. డికాక్ ఎదురుదాడే లక్ష్యంగా పరుగుల వేటపై దృష్టి పెట్టాడు. డుప్లెసిస్, డికాక్‌లతో కలిసి వరుస వికెట్లకు సెంచరీ భాగస్వామ్యాలు నమోదు చేసిన ఎల్గార్ విశాఖ టెస్టులో దక్షిణాఫ్రికాను ఒడ్డున పడేశాడు!. చివరి సెషన్లో వికెట్లతో టీమ్ ఇండియా తిరిగి పట్టు సాధించినా.. దక్షిణాఫ్రికా డ్రా కోసం రంగం సిద్ధం చేసుకుంది. ట్రంప్ కార్డ్, ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (5/128) ఐదు వికెట్ల ప్రదర్శనతో రాణించాడు.



సఫారీ ఆపద్బాంధవుడు : డీన్ ఎల్గార్ 160 (287 బంతుల్లో 18 ఫోర్లు, 4 సిక్స్‌లు)

# సఫారీ ప్రతిఘటన

- ఎల్గార్, డికాక్ శతకాల మోత
- అశ్విన్ ఐదు వికెట్ల ప్రదర్శన
- దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 385/8
- లోటు మరో 117 పరుగులు మాత్రమే
- ఫ్రీడం సిరీస్ తొలి టెస్టు మూడో రోజు

విశాఖపట్నం నుంచి
శ్రీనివాస్ దాస్ మంతటి

విశాఖ టెస్టు రసకందాయంగా సాగుతోంది. తొలి రెండు రోజులు టీమ్ ఇండియా తిరుగులేని ఆధిపత్యం చెలాయించగా, మూడో దక్షిణాఫ్రికా వంతైంది. డీన్ ఎల్గార్ (160, 287 బంతుల్లో 18 ఫోర్లు, 4 సిక్స్‌లు), క్వింటన్ డికాక్ (111, 163 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకాలతో చెలరేగారు. కెప్టెన్ డుప్లెసిస్ (55, 103 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) క్రీయాశీలక ఇన్నింగ్స్ ఆడాడు. వరుసగా 5, 6 వికెట్లకు ఎల్గార్-డుప్లెసిస్, డికాక్-ఎల్గార్ శతక భాగస్వామ్యాలు నమోదు చేశారు. దక్షిణాఫ్రికాను ఒత్తిడి నుంచి బయటపడేశారు. ఎల్గార్, డికాక్, డుప్లెసిస్ రాణించటంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 385/8తో మంచి స్థితిలో కొనసాగుతోంది. టెయిలెండర్లు సెనురన్ ముతుసామి (12 బ్యాటింగ్, 60 బంతుల్లో 1 ఫోర్), కేశవ్ మహరాజ్ (14 బంతుల్లో 3 రన్స్) అజేయంగా ఆడుతున్నారు. టీమ్ ఇండియా ట్రంప్‌కార్డ్, ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (5/128) ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా (2/116) 200 వికెట్ల క్లబ్‌లోకి చేరిపోయాడు. తొలి రోజు వర్షం కారణంగా మూడో సెషన్‌లో 31 ఓవర్ల ఆట తుడిచిపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ ఓవర్ల లోటు భర్తీ కోసం వరుసగా 2, 3 రోజుల్లో 98 ఓవర్ల ఆట సాగించారు. నేడు కూడా 98 ఓవర్ల ఆట సాగనుంది!.

**తొలి సెషన్ : దక్షిణాఫ్రికా 153/4 : సఫారీ దూకుడు**

రెండో రోజు ఆఖరి గంటలో మూడు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా, మూడో రోజు కొత్త వ్యూహంతో ముందుకొచ్చింది. భారత స్పిన్ దాడికి రక్షణాత్మక వైఖరి కాకుండా, ఎదురుదాడి చేయాలనుకుంది. వార్మప్ మ్యాచ్‌లో అజేయ అర్ధ సెంచరీ సాధించి, ఫామ్‌లో ఉన్న తెంబ బవుమా (18) మూడు ఫోర్లతో మెరిసినా, వికెట్ కాపాడుకోలేదు. ఇషాంత్ శర్మ ఓవర్లో బవుమా వికెట్ల ముందు దొరికిపోయాడు. ఓపెనర్ ఎల్గార్‌తో జత కలిసిన కెప్టెన్ డుప్లెసిస్ (55) ఐదో వికెట్‌కు 100 ప్లస్ భాగస్వామ్యం నమోదు చేశాడు. అశ్విన్‌పై ఎదురుదాడి చేసిన ఎల్గార్ బౌండరీలు బాదగా.. డుప్లెసిస్ సైతం వెనక్కి తగ్గలేదు. వికెట్‌కు రెండువైపులా ధనాధన్‌తో సఫారీ వేగంగా పరుగులు సాధించింది. తొలి సెషన్‌లో అశ్విన్, జడేజాల ప్రయోగం ఫలించలేదు. 6 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 112 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన డీన్ ఎల్గార్ క్రీజులో పాతుకుపోయాడు. ఎల్గార్ వ్యక్తిగత స్కోరు 74 వద్ద జడేజా బౌలింగ్‌లో కీపర్‌కు వెళ్లిన క్యాచ్‌ను వృద్ధిమాన్ సాహా నేలపాలు చేశాడు. విలువైన జీవనదానం పొందిన ఎల్గార్ మరింత దూకుడుగా ఆడాడు. తొలి సెషన్‌లో ఎల్గార్, డుప్లెసిస్ మరో వికెట్ పడనీయలేదు. 114 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా విశాఖ టెస్టులో తొలిసారి ఓ సెషన్‌లో ఆధిపత్యం చెలాయించింది.



ధనాధన్ శతకం : క్వింటన్ డికాక్ 111 (163 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్స్‌లు)

**రెండో సెషన్ : దక్షిణాఫ్రికా 292/5 : ఎల్గార్ శతకనాదం**

91 బంతుల్లో ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో అర్ధ సెంచరీ సాధించిన డుప్లెసిస్ క్రీజులో ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. భారత బౌలర్లు సఫారీ సారథిని పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. ట్రంప్‌కార్డ్ అశ్విన్ నిలదొక్కుకున్న డుప్లెసిస్‌ను అవుట్ చేసి, మళ్లీ వికెట్ల వేటకు తెరదీశాడు. వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ 7 పరుగుల వద్ద ఉండగా సిల్లీ పాయింట్‌లో రోహిత్ శర్మ సులువైన క్యాచ్‌ను అందుకోలేకపోయాడు. హనుమ విహారి బౌలింగ్‌లో డికాక్‌కు ముందు రోహిత్ మొహరించినా.. ఆ ఫీల్డింగ్ పొజిషన్‌కు తగిన రీతిలో ముందుగా ఉండలేదు. క్యాచౌట్ ప్రమాదం నుంచి బయటపడిన డికాక్ ఎడాపెడా బౌండరీలు బాదాడు. 11 ఫోర్లు, ఓ సిక్సర్‌తో లంచ్ తర్వాత వీరవిహారం చేశాడు. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 79 బంతుల్లోనే అర్ధ సెంచరీ బాదిన డికాక్.. ఓపెనర్ ఎల్గార్‌కు సూపర్ సహకారం అందించాడు. స్పిన్నర్లపై నిలకడగా ఎటాక్ చేసిన ఎల్గార్ 11 ఫోర్లు, 4 సిక్సర్‌తో 175 బంతుల్లో సెంచరీ సాధించాడు. మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాది శతకం పూర్తి చేశాడు ఎల్గార్. డికాక్‌తోనూ ఎల్గార్ ఆరో వికెట్‌కు 100 ప్లస్ భాగస్వామ్యం నమోదు చేశాడు. డికాక్ దూకుడుతో ఈ సెషన్‌లో దక్షిణాఫ్రికా 139 పరుగులు రాబట్టింది. వరుసగా రెండో సెషన్లో దక్షిణాఫ్రికా కొనసాగింది. తొలి సెషన్‌లో ఒక వికెట్, రెండో సెషన్‌లో మరో వికెట్ మాత్రమే భారత్‌కు దక్కాయి.

**మూడో సెషన్ : దక్షిణాఫ్రికా 385/8, ఊరటనిచ్చిన అశ్విన్**

టీ విరామం తర్వాత టీమ్ ఇండియా కాస్త ఊరట చెందింది. జోరు కొనసాగించిన ఎల్గార్ 269 బంతుల్లో 150 మార్క్ అందుకున్నాడు. జడేజా ఓవర్లో స్వీప్ చేద్దామనుకుని, స్క్వేర్ లెగ్‌లో బంతిని గాల్లోకి లేపాడు. బౌండరీ లైన్ నుంచి పరుగెత్తుకుంటూ వచ్చిన పుజార డైవ్ చేస్తూ అద్భుత క్యాచ్ అందుకుని, ఎల్గార్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. డబుల్ సెంచరీ దిశగా సాగిన ఎల్గార్ 160 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరుకున్నాడు. భారత్‌తో వన్డేల్లో తిరుగులేని రికార్డులు డికాక్ సొంతం. కానీ టెస్టుల్లో గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో ఎన్నడూ 50 ప్లస్ పరుగులు చేయలేదు. ఆరంభంలోనే అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడిన డికాక్ భారత్‌పై తొలి టెస్టు శతకాన్ని అశ్విన్ ఓవర్లో భారీ సిక్సర్‌తో సాధించాడు. 17 ఫోర్లు, 4 సిక్సర్లు బాదిన డికాక్ ప్రమాదకరంగా కనిపించాడు. డికాక్‌కు వరుసగా రెండు వైవిధ్య బంతులతో తికమక పెట్టిన అశ్విన్.. మూడో బంతిని నేరుగా వికెట్లపైకి సంధించాడు. క్లీన్‌బౌల్డ్‌గా డికాక్ 111 పరుగులకు నిష్క్రమించాడు. ధనాధన్ శతకంతో అప్పటికే దక్షిణాఫ్రికాపై ఒత్తిడి తొలగించిన డికాక్ సంతృప్తిగానే పెవిలియన్‌కు చేరాడు. టెయిలెండర్ వెర్నన్ ఫిలాండర్ (0) వికెట్లను సైతం అశ్విన్ గిరాటేశాడు. ఐదు వికెట్ల ప్రదర్శన పూర్తి చేశాడు. మూడో సెషన్లో దక్షిణాఫ్రికా 93 పరుగులు చేయగా.. భారత్ మూడు వికెట్లతో ముగించింది.

**స్కోరు వివరాలు :**

**భారత్ తొలి ఇన్నింగ్స్ : 502/7 డిక్లేర్డ్**

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ :** డీన్ ఎల్గార్ (సి) పుజార (బి) జడేజా 160, ఎడెన్ మార్క్‌రం (బి) అశ్విన్ 5, డీ బ్రూయిన్ (సి) సాహా (బి) అశ్విన్ 4, డేన్ పీట్ (బి) జడేజా 0, తెంబ బవుమా (ఎల్బీ) ఇషాంత్ శర్మ 18, డుప్లెసిస్ (సి) పుజార (బి) అశ్విన్ 55, క్వింటన్ డికాక్ (బి) అశ్విన్ 111, సెనురన్ ముతుసామి బ్యాటింగ్ 12, వెర్నన్ ఫిలాండర్ (బి) అశ్విన్ 0, కేశవ్ మహరాజ్ బ్యాటింగ్ 3, ఎక్స్‌ట్రాలు : 17, **మొత్తం : (118 ఓవర్లలో 8 వికెట్లకు) 385.**

**వికెట్ల పతనం :** 1-14, 2-31, 3-34, 4-63, 5-178, 6-342, 7-370, 8-376.

**బౌలింగ్ :** ఇషాంత్ శర్మ 14-2-44-1, మహ్మద్ షమి 15-3-40-0, అశ్విన్ 41-11-128-5, రవీంద్ర జడేజ 37-4-116-2, హనుమ విహారి 9-1-7-0, రోహిత్ శర్మ 2-1-7-0.

# వికెట్ల వేటగాడు!



వచ్చాడు.. ఐదేశాడు : రవిచంద్రన్ అశ్విన్ (5/128)

నవతెలంగాణ క్రీడావిభాగం

రెండేండ్ల క్రితం భారత టెస్టు జట్టులో రవిచంద్రన్ అశ్విన్‌ది కీలక భూమిక. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున పవర్ ప్లే, డెత్ ఓవర్లలో అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్న అశ్విన్.. అదే జోరు భారత క్రికెట్‌లోనూ చూపించాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో మణికట్టు స్పిన్నర్ల వైపు జట్టు మొగ్గటంతో వన్డే, టీ20 జట్టుకు దూరమయ్యాడు. అయినా, టెస్టుల్లో రవిచంద్రన్ అశ్విన్ తిరుగులేని స్పిన్నర్. జట్టు మేనేజ్‌మెంట్ అశ్విన్‌ను పక్కనపెట్టడంతో ఓ దశలో అశ్విన్ క్రీయాశీల క్రికెట్‌లో ఉన్నాడా? అనే అనుమానం కలిగింది. టెస్టుల్లో అత్యంత వేగంగా 200 వికెట్లు తీసిన అశ్విన్.. 300 వికెట్ల వేటలో అదే జోరు చూపించాడు. ఉపఖండ పిచ్‌లతో పాటు విదేశీ పిచ్‌లపైనా వికెట్ల వేటలో స్టార్ హంటర్ ట్యాగ్ నిలుపుకున్నాడు.

సూపర్ స్పీడ్‌తో సాగుతున్న అశ్విన్ టెస్టు కెరీర్‌కు నిరుడు ఆస్ట్రేలియా పర్యటనలో బ్రేక్ పడింది. ఆడిలైడ్‌లో తొలి టెస్టులో ఆడిన అశ్విన్.. మిగతా మూడు టెస్టులకూ దూరమయ్యాడు. ఆ తర్వాత జరిగిన కరీబియన్ పర్యటనలో రెండు టెస్టులకూ బెంచ్‌కే పరిమితం అయ్యాడు. 2017లో వెస్టిండీస్ పర్యటించిన భారత జట్టులో అశ్విన్ కీలక ఆటగాడు. టెస్టు సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. విండీస్ అశ్విన్‌కు ఇష్టమైన ప్రత్యర్థి. కరీబియన్లపై ఆడిన 11 టెస్టుల్లో 552 పరుగులు, 60 వికెట్లు కూల్చాడు. నాలుగు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన అశ్విన్, నాలుగు శతకాలు సైతం బాదాడు. విండీస్‌పై ఇంతటి సక్సెస్ సాధించిన ఆటగాడిని 2019 సిరీస్‌లో కోహ్లి, శాస్త్రి తుది జట్టులోకి ఎంచుకోలేదు. అశ్విన్‌ను పక్కనపెట్టినందుకు కెప్టెన్ విరాట్ కోహ్లి, కోచ్ రవిశాస్త్రి తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ' ఓ జట్టుపై కండ్లుచెదిరే గణాంకాలు సాధించిన ఆటగాడికి తుది జట్టులో చోటు దక్కదా? ఇది ఆశ్చర్యకరం' అని సునీల్ గవాస్కర్ విమర్శించగా.. ' అశ్వినే ఇప్పటికీ భారత నం.1 స్పిన్నర్' అని మాజీ చీఫ్‌ఫ్ కోచ్ అనిల్ కుంబ్లే సెలక్షన్‌పై పరోక్ష విమర్శ చేశాడు. విశాఖ టెస్టులో దక్షిణాఫ్రికాపై ఐదు వికెట్ల ప్రదర్శనతో అశ్విన్ మరోసారి చర్చల్లోకి వచ్చాడు. 2018 ఆడిలైడ్ టెస్టు తర్వాత భారత్ ఆడిన టెస్టుల్లో అశ్విన్‌కు చోటు దక్కలేదు. అశ్విన్‌కు స్థానం నిరాకరించటంపై జట్టు మేనేజ్‌మెంట్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగానూ లేదు. విశాఖ టెస్టు, సహజసిద్ధంగా స్పిన్ పిచ్ కావటంతో ఫ్రీడం సిరీస్ తొలి టెస్టుకు అశ్విన్‌ను జట్టులోకి తీసుకున్నారు. ' పిచ్ పరిస్థితుల దృష్ట్యా ఇద్దరు స్పిన్నర్లు ఆడుతున్నారు. అందుకే అశ్విన్‌ను జట్టులోకి వస్తున్నాడు' అని కెప్టెన్ కెప్టెన్ మ్యాచ్‌కు ముందు మీడియాతో అన్నాడు. ఒకవేళ విశాఖలోనూ ఒకే స్పిన్నర్‌తో ఆడాల్సి వస్తే అశ్విన్ మరోసారి బెంచ్‌కే పరిమితం కావాలని కోహ్లి చెప్పకనే చెప్పాడు.

సుదీర్ఘ విరామం తర్వాత తుది జట్టులోకి వచ్చిన అశ్విన్ బంతి అందుకుంటూనే తన ముద్ర చూపించాడు. రెండో రోజు ఆఖరి గంటలో రెండు కీలక వికెట్లు కూల్చిన అశ్విన్.. దక్షిణాఫ్రికాను మానసికంగా గట్టి దెబ్బ కొట్టాడు. అశ్విన్ స్పిన్‌కు గతంలో ఎన్నోసార్లు బలైన దక్షిణాఫ్రికా, అతడి శైలిని దృష్టిలో ఉంచుకుని మూడో రోజు ఎటాకింగ్ చేయటం మొదలెట్టింది. డీన్ ఎల్గార్ అశ్విన్ లక్ష్యంగా బౌండరీలు బాదాడు. అయినా, అశ్విన్ డిఫెన్స్‌లో పడిపోలేదు. సఫారీ కెప్టెన్ డుప్లెసిస్‌ను అవుట్ చేసి మూడో రోజు వికెట్ల వేట మొదలెట్టాడు. చివరి సెషన్ ఆఖర్లో వరుసగా డికాక్, ఫిలాండర్‌లను వెనక్కి పంపి ఐదు వికెట్ల ప్రదర్శన పూర్తి చేసుకున్నాడు. ఇందులో డికాక్‌ను అవుట్ చేసిన తీరు అమోఘం. తొలి బంతిని కాస్త టర్న్ చేసిన అశ్విన్, తర్వాతి బంతిని అదే శైలిలో సంధించాడు. కానీ మూడోది డికాక్‌ను ఊహించినట్టుగా రాలేదు. బ్యాట్‌కు దాటుకుని నేరుగా వికెట్లపైకి దూసుకెళ్లింది. పునరాగమనంలో ఐదు వికెట్ల ప్రదర్శనతో తన ఉనికితో పాటు జట్టుకు తన అవసరాన్ని సైతం అశ్విన్ గుర్తు చేశాడు.

**2** 200 టెస్టు వికెట్లను వేగంగా అందుకున్న రెండో భారత బౌలర్‌గా రవీంద్ర జడేజా రికార్డు సృష్టించాడు. అశ్విన్ (37), హర్భజన్ సింగ్ (46) టెస్టుల్లో 200 వికెట్లు కూల్చగా, జడేజా 44వ టెస్టులో ఈ ఘనత సాధించాడు. ప్రపంచ క్రికెట్‌లో 44వ టెస్టులోనే 200 టెస్టు వికెట్లు కూల్చిన బౌలర్ జడేజా మాత్రమే కావటం విశేషం.



ఫలితం రాడతారా? : విశాఖ టెస్టులో టీమ్ ఇండియా ఆటగాళ్లు

# విశాఖ ఎటువైపు?

నవతెలంగాణ క్రీడావిభాగం

పరుగుల వరద పారుతున్న విశాఖ టెస్టు పయనం ఎటువైపు? తొలి రోజులు భారత్ ఆధిపత్యం సాగగా, మూడో రోజు దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 39/3తో వచ్చిన సఫారీ జట్టు మూడో రోజు ఏకంగా 346 పరుగులు చేసింది. ఎల్గార్ (160), డికాక్ (111), డుప్లెసిస్ (55) స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌లతో దక్షిణాఫ్రికా విశాఖ టెస్టులో మంచి స్థితిలో నిలిచింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌కు దక్షిణాఫ్రికా లోటు ప్రస్తుతం 117 పరుగులు మాత్రమే. మరో రెండు వికెట్లు చేతిలో ఉన్నాయి. నేడు ఉదయం సెషన్లో కోహ్లిసేన లాంఛనం ముగించినా.. వంద పరుగుల కంటే ఎక్కువ ఆధిక్యం దక్కే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో విశాఖ టెస్టులో ఫలితంపై ఆసక్తి పెరుగుతోంది. వరల్డ్ నం.1 టీమ్ ఇండియా సొంతగడ్డపై మ్యాచ్‌ను డ్రా చేసుకుంటే.. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కే దెబ్బ. పూర్తి పాయింట్లు దక్కించుకునే చోట.. ప్రత్యర్థితో పాయింట్లు పంచుకోవటం ఆతిథ్య జట్టుకు గట్టి ఎదురుదెబ్బ అని చెప్పక తప్పదు!.

విశాఖపట్నంలో నిజానికి మూడో రోజు ఉష్ణోగ్రతలు సాధారణం. నాల్గో రోజు మంచి ఎండకాస్తే స్పిన్‌కు మరింత దన్ను లభిస్తుంది. టెయిలెండర్లను త్వరగా అవుట్ చేసి, వీలైనంత తొలి ఇన్నింగ్స్ సాధించటం కోహ్లిసేన తొలి కర్తవ్యం. రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా పరుగులు చేసి, కనీసం 350-400 స్కోరు నమోదు చేయాలి. ఐదో రోజు దక్షిణాఫ్రికాను ఛేదనకు ఆహ్వానిస్తే, పగుళ్ల పిచ్‌పై పరుగుల సాధన కష్టసాధ్యమైతుంది. తొలి టెస్టులో కోహ్లిసేన విజయానికి మెరుగైన అవకాశాలు ఉంటాయి. ఇదంతా, అంత సులువు కాదు. ఎందుకంటే పిచ్ పరిస్థితులను అర్థం చేసుకున్న సఫారీ బ్యాట్స్‌మన్ డిఫెన్స్‌ను వదిలి, ఎటాకింగ్ షాట్లతో చెలరేగారు. నాల్గో ఇన్నింగ్స్‌లో నిజానికి షాట్ల ఎంపికలో ఈ స్వేచ్ఛ ఉండదు. వికెట్లు నిలుపుకోవాలనే ఒత్తిడి బ్యాట్స్‌మన్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇది కోహ్లిసేనకు సానుకూల పరిణామం. నేడు టీమ్ ఇండియా ప్రదర్శనపై విశాఖ టెస్టు ఫలితం ఆధారపడి ఉంది!.

మూడో రోజు వైఫల్యాలు సైతం భారత్‌ను రేసులో వెనక్కి లాగాయి. ఎల్గార్ 74 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను వికెట్ కీపర్ సాహా వదిలేశాడు. డికాక్ 7 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను రోహిత్ శర్మ నేలపాలు చేశాడు. మూడో సెషన్లోనూ వికెట్ల వెనకాల లభించిన అవకాశాలను సాహా వృథా చేశాడు. ఫీల్డింగ్‌లో, క్యాచింగ్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచి ఉంటే మూడో రోజు దక్షిణాఫ్రికా పరిస్థితి కచ్చితంగా భిన్నంగా ఉండేది. కెప్టెన్ విరాట్ కోహ్లి వ్యూహ రచనలో విఫలమయ్యాడు. తొలి సెషన్‌లో తెంబ బవుమా వికెట్ తీసిన ఉత్సాహంలో ఉన్న ఇషాంత్ శర్మను కోహ్లి కొనసాగించలేదు. ఇషాంత్‌ను కాదని మహ్మద్ షమికి బంతి అందించాడు. మూడో రోజు కొత్త బంతిని పార్ట్ టైమ్ స్పిన్నర్ హనుమ విహారికి ఇవ్వటం విడ్డూరం అనిపించింది. ఇషాంత్ శర్మ, మహ్మద్ షమి ఉండగా.. స్పిన్నర్ చేతికి కొత్త బంతిని ఇవ్వటం విమర్శలకు తావిచ్చింది. విశాఖ టెస్టులో పూర్తి పాయింట్ల ఫలితం కోరుకుంటే భారత్ ఫీల్డింగ్, క్యాచింగ్‌తో పాటు కెప్టెన్సీ వ్యూహ రచనలోనూ మెరుగ్గా రావాల్సి ఉంది.

# బీసీసీఐ ఏజీఎంకు శ్రీని దూరం

**టీఎన్‌సీఏ రాజ్యాంగంలో మార్పులు**

**చెన్నై :** భారత క్రికెట్ పరిపాలన కింగ్ మేకర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసన్ బోర్డు వార్షిక సర్వ సభ్య సమావేశానికి దూరంగా ఉండనున్నాడు. అక్టోబర్ 23న జరుగనున్న బీసీసీఐ ఏజీఎంకు రాష్ట్ర సంఘాల ప్రతినిధుల విషయంలో సీఓఏ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) తరఫున నూతనంగా ఎన్నికైన కార్యదర్శి ఆర్‌ఎస్ రామస్వామి ఏజీఎంలో పాల్గొననున్నాడు. సమావేశానికి దూరంగా ఉంటున్నా.. బీసీసీఐ ఆఫీస్ బేరర్ల ఎన్నికలో శ్రీనివాస్ కీలక పాత్ర పోషించనున్నాడు. రాష్ట్ర సంఘాల ప్రతినిధులతో ఇప్పటికే చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఏజీఎంలో ఎన్నికలు లేకుండా ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు శ్రీనివాసన్ రంగం సిద్ధం చేస్తున్నాడు!. ఏజీఎంకు హాజరయ్యేందుకు టీఎన్‌సీఏ రాజ్యాంగంలో స్వల్ప మార్పులు చేసింది. తొమ్మిదేండ్ల పదవీకాలం నిబంధనను సిఓఏ సూచనల మేరకు మార్పు చేసింది. ఇద్దరు అధ్యక్షులు, ఇద్దరు కార్యదర్శుల విషయంలో టీఎన్‌సీఏకు ఉన్న పరిధి దృష్ట్యా సుప్రీంకోర్టులో ప్రత్యేక పిటిషను దాఖలు చేసిన సంగతి తెలిసిందే.



# హర్భజన్‌కు అనుమతి నిరాకరణ!

- ఇంగ్లాండ్ 100 బంతుల లీగ్



**న్యూఢిల్లీ :** ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) మానసపుత్రిక 100 బంతుల లీగ్‌లో ఆడేందుకు హర్భజన్ సింగ్‌కు బీసీసీఐ అనుమతి నిరాకరించినట్టు సమాచారం!. హర్భజన్ సింగ్ (37) అంతర్జాతీయ క్రికెట్‌కు ఇంకా వీడ్కోలు పలుకలేదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో చెన్నై సూపర్ కింగ్స్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ కెరీర్, ఐపీఎల్ కెరీర్‌కు వీడ్కోలు పలకనిదే విదేశీ లీగ్‌ల్లో ఆడేందుకు భారత క్రికెట్ బోర్డు అనుమతి మంజూరు చేయటం లేదు. ఈ నేపథ్యంలోనే హర్భజన్ సింగ్‌కు సైతం అనుమతి ఇవ్వలేదని సమాచారం. ' బీసీసీఐ నుంచి హర్భజన్ సింగ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) అడుగలేదు. అనుమతి లేకుండా ఏ లీగ్‌లోనైనా పేరు నమోదు చేసుకునేందుకు వీల్లేదు. బీసీసీఐ పాలసీకి ఇది వ్యతిరేకం. ఈ విషయంలో భజ్జీని బోర్డు సంప్రదించింది. 100 లీగ్ ఆటగాళ్ల ముసాయిదాలో నేను లేనని హర్భజన్ వివరణ ఇచ్చాడు' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.

# క్రికెట్ వ్యాపారమైంది

- ఈ సమస్యను అధిగమించలేం
- దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ షాన్ పొలాక్



**నవతెలంగాణ- విశాఖపట్నం :** ఆధునిక క్రికెట్ అంటే వ్యాపారమని, ఇక్కడ జాతీయ జట్టు ప్రాతినిధ్యం కోసం ఎవరినీ ఆపలేమని దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం షాన్ పొలాక్ ఆవేదన వ్యక్తం చేశాడు. దక్షిణాఫ్రికాకు 10 టెస్టులు ఆడిన పేసర్ ఒలివర్ (27), కైల్ అబాట్‌లు 2017లో ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్ ఒప్పందాలు చేసుకున్నారు. రిటైర్మెంట్ తర్వాత మోర్నీ మోర్కెల్ సైతం కౌంటీ ఒప్పందం చేసుకున్నారు. నాణ్యమైన ఆటగాళ్లు కౌంటీల్లో ఆడుతుంటే, జాతీయ జట్టుకు సరైన ప్రత్యామ్నాయాలు ఉండటం లేదని పొలాక్ అభిప్రాయపడ్డారు. ' జాతీయ జట్టు ఎంపికకు అందుబాటులో ఎంతో మంది నాణ్యమైన ఆటగాళ్లు అందుబాటులో ఉండాలని కోరుకుంటాం. కానీ ఈ సమస్యను మనం అధిగమించలేం. ఆధునిక క్రీడల్లో ఇది భాగమైంది. గతంలో క్రీడల్లో అధిక ఆదాయ ఆర్జన ఉండేది కాదు. జాతీయ జట్టు ప్రాతినిధ్యం కోసం ఎదురు చూసేవారు. కానీ ఇప్పుడు క్రికెట్ వ్యాపారమయం అయ్యింది. క్రికెటర్లు వ్యాపార కోణంలోనే నిర్ణయాలు తీసుకుంటారు. ఎక్కడ ఆదాయ ఆర్జన ఉంటే అక్కడి వెళ్తున్నారు. జాతీయ జట్టుకు అందుబాటులో ఉండకుండా ఇలా వెళ్లటం దురదృష్టకరం. దక్షిణాఫ్రికా క్రికెట్‌లో దిగ్గజ క్రికెటర్లు ఇప్పుడిప్పుడే రిటైర్ అయ్యారు. కొత్త తరం నిర్మాణానికి కాస్త సమయం పడుతుంది. డివిలియర్స్, ఆమ్లా, స్టెయిన్ వంటి ఆటగాళ్లకు రాత్రికి రాత్రి ప్రత్యామ్నాయం వెతకలేం' అని పొలాక్ అన్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

epaper.navatelangana.com